ప్రజలే ప్రభువులు

# జనబలం


నవంబర్ 2021 | లోక్‌సత్తా ఉద్యమ సంస్థ మాస పత్రిక | రూ.10/-




## అధికారం @ 20

ఏపీ పరిణామాలపై సీఎం, ప్రతిపక్ష నేత, పార్టీలు, పౌరసమాజం, మీడియాలకు జేపీ బహిరంగ లేఖ

ఏపీ లోక్‌సత్తా పార్టీ పునర్నిర్మాణం.. నూతన అధ్యక్షుడిగా భీశెట్టి బాబ్జీ.. 8 లక్ష్యాలతో కార్యాచరణ




## అందరికీ ఆరోగ్యానికి ఆచరణసాధ్య నమూనా

(గత సంచిక తరువాయి) సమర్థవంతం / అందుబాటు / అతి తక్కువ వ్యయం



హుజూరాబాద్‌లో సంక్షోభం చూశాకైనా.. దామాషా పద్ధతి, ముఖ్యమంత్రుల

## ప్రత్యక్ష ఎన్నికకు పార్టీలు ముందుకు రావాలి

దళితబంధుని రీడిజైన్ చేయాలని కేసీఆర్‌కు జేపీ విజ్ఞప్తి

FDR FOUNDATION FOR DEMOCRATIC REFORMS

# the WHAT and WHY of Healthcare Reform

## Primary Care

**First point of contact; long-term person-focused care; comprehensive and coordinated care**

**WHAT is the current situation?**

- Inadequate public-funded primary care doctors - only **2.5** per 100,000 population!
- Poor **quality** and low **patronage**
- Widespread prevalence of **informal providers**
- Focus predominantly on **Public Health** measures

**WHY is reform necessary?**

- To focus on **comprehensive medical care**
- To build **trust**
- To ensure **continuity** and **patient-centric** care

## Secondary Care

**Hospital Care; low-cost simple interventions; upon reference by primary care providers**

**WHAT is the current situation?**

- Majority of the population covered under **government health insurance programmes** e.g. Aarogyasri, Ayushman Bharat etc.
- Private hospitals under such programmes predominantly in **urban areas**
- Major portion of expenditure being spent on tertiary care – **over 50%** under Aarogyasri in Andhra Pradesh!

**WHY is reform necessary?**

- To provide access to public-funded **secondary care** in **rural and semi-urban** areas
- **Unsustainability** of covering **tertiary care** under insurance programmes – ever-increasing cost of tertiary care and inefficiency of insurance markets in healthcare

## Tertiary Care

**Highly specialised hospital care; high-cost advanced interventions; upon reference by primary and secondary care providers**

ప్రజలే ప్రభువులు

# జనబలం

లోక్‌సత్తా ఉద్యమ సంస్థ మాసపత్రిక

సంపుటి 24 సంచిక 11
నవంబర్ 2021

సంపాదకవర్గం
బండారు రామ్మోహనరావు
శిరమని నరేష్

వర్కింగ్ ఎడిటర్
దూసనపూడి సోమసుందర్

## జనబలం చందా రుసుము వివరాలు

| | |
|---|---|
| సంవత్సర చందా | రూ. 100.00 |
| మూడు సంవత్సరాలకు చందా | రూ. 290.00 |
| ఐదు సంవత్సరాలకు చందా | రూ. 475.00 |
| జీవితకాలపు చందా | రూ. 1200.00 |

*జనబలంలో ప్రచురితమవుతున్న వ్యాసాలలో రచయిత(త్రు)లు వెలిబుచ్చే అభిప్రాయాలు కేవలం వారి సొంతం. జనబలం సంపాదకవర్గం ఆ అభిప్రాయాలతో ఏకీభవిస్తున్నట్టు కాదు.*

### చందాదారులకు విజ్ఞప్తి

చందా మొత్తాలను, ప్రకటనల ధర మొత్తాలను చెక్కుగాని, డి.డి. ద్వారా గాని FOUNDATION FOR DEMOCRATIC REFORMS పేర పంపవచ్చును. NEFT సౌకర్యము ద్వారా పంపదలచినవారు SBI PUNJAGUTTA BRANCHలోని SB A/C. No. 52086568057కి IFSC CODE No. SBIN0020072కు పంపి, Transaction I.D. No. మరియు తారీఖు తప్పనిసరిగా తెలియజేయవలెను. నగదు రూపంలో చెల్లించదలచిన వారు లోక్‌సత్తా సంస్థ కేంద్ర కార్యాలయంలో ఇచ్చి రశీదు పొందవలెను.

## కార్టూన్ కార్నర్




ఆగండయ్యా... నేను ఇప్పుడే పార్టీకి రాజీనామా చేసి బీజేపీలో చేరుతున్నాను. కావాలంటే మాట్లాడండి!

కార్యాలయ చిరునామా : తులిప్స్ అపార్ట్‌మెంట్స్ 6-3-655, ప్లాట్ నెం 407, సివిల్ సప్లయిస్ ఆఫీస్ వెనుక,
సోమాజిగూడ, హైదరాబాద్-500 082 ఫోన్: 040-23310288
Email: janabalam.loksatta@gmail.com, loksattaudyamasamstha@gmail.com

సంపాదకీయం

# ఆవేదన కల్గిస్తున్న ఆంధ్రప్రదేశ్ పరిణామాలు

రాష్ట్ర విభజన అనంతరం ఆంధ్రప్రదేశ్‌లో సంభవించిన పరిణామాలు ఆలోచనాపరులకు ఆవేదనను కలిగిస్తున్నాయి. ఇష్టంలేని విభజన తెచ్చిపెట్టిన కష్టాల నుంచి ఆంధ్రప్రదేశ్ బైటపడకలేకపోయింది. విభజన సందర్భంగా ఇచ్చిన హామీలు నెరవేరలేదు. రాష్ట్ర ఆర్థిక లోటును భర్తీ చేస్తామని చెప్పిన జాతీయ ప్రభుత్వం గత ఏడేళ్లుగా సమస్యని లెక్కల చిక్కుల్లో నాన్చుతోంది. రాజధాని వివాదంలో పడింది. పోలవరం నత్తనడకనడుస్తోంది. ప్రత్యేక కేటగిరీ హెూదా ప్రస్తావనే విన్పించడం లేదు. విద్య, వైద్యం, ఉపాధి కల్పన, మానవాభివృద్ధి సూచికల్లో రాష్ట్రం వెనుకబడిపోతోంది. విభజన జరిగిన ఏడేళ్ల తర్వాత చూసుకుంటే రాష్ట్రం సంక్షోభంలో చిక్కుకున్నట్టు స్పష్టంగా కన్పిస్తోంది. ఆర్థిక, రాజకీయ రంగాలలోనే కాకుండా సామాజిక జీవితంలో సంక్షోభ పర్యవసానాలు తీవ్రంగా పరిణమిస్తున్నాయి.

2014లో రాష్ట్ర విభజన జరిగే నాటికి ఆంధ్రప్రదేశ్ రుణభారం 97 వేల కోట్ల రూపాయలుగా ఉంది. గత ప్రభుత్వ హయాంలో 2019 మార్చి నాటికి రుణభారం 2,58,928 కోట్లకి చేరింది. గత రెండున్నరేళ్లలో ప్రస్తుత ప్రభుత్వం 1,27,000 కోట్ల రుణాన్ని తీసుకోవడంతో రాష్ట్ర రుణభారం 3.8 లక్షల కోట్లకి చేరుకున్నది. రాష్ట్ర జి.ఎస్.డి.పి. 10.6 లక్షల కోట్ల రూపాయలుగా ఉంది. జాతీయప్రభుత్వం విధించిన పరిమితిని మించి రాష్ట్రం అప్పులు చేస్తోందని కాగ్ హెచ్చరించింది. రాష్ట్రం ఇప్పటికే ఏటా వడ్డీ రూపంలో 35 వేల కోట్ల రూపాయలు చెల్లిస్తోంది. 2021-22 ఆర్థిక సంవత్సరంలో విధించిన పన్నులు 75 వేల కోట్ల రూపాయలు. వివిధ కార్పొరేషన్లు తీసుకున్న రుణాలకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన గ్యారంటీల విలువ 96,500 కోట్ల రూపాయలుగా ఉంది. ఇటీవల కాలంలో రానున్న రోజుల్లో వసూలు కానున్న ఆదాయాన్ని గ్యారంటీగా చూపి అప్పులు తీసుకునే పరిస్థితి కూడా కన్పిస్తోంది. ప్రభుత్వ ఉద్యోగుల వేతనాలు, వివిధ సంక్షేమ పథకాలలో లబ్ధిదారులకు చెల్లించే నగదు సకాలంలో చెల్లింపులు చేయలేక ప్రభుత్వం సతమతమవుతోంది. గత సంవత్సరం రైతుల నుండి కొనుగోలు చేసిన ధాన్యానికి రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ బకాయి పడింది. సార్వా ధాన్యం సొమ్ము దాళ్వా సీజనుకు కూడా చేతికి అందక వరి, పత్తి మొక్కజొన్న రైతులు నానాయాతన పడ్డారు. రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక నిర్వహణా పద్ధతులు సవ్యంగా లేవని జాతీయ ప్రభుత్వమూ, రిజర్వ్‌బ్యాంకు అసంతృప్తి వ్యక్తం చేస్తూ వచ్చాయి. జమాఖర్చులలో ఉన్న లోపాలను కాగ్ పదేపదే ఎత్తి చూపించింది. దాదాపు 45 వేల కోట్ల రూపాయల ఖర్చులకు సంబంధించిన వివరాలు లభించలేదని ప్రజాపద్దుల కమిటీ చైర్మన్ వెల్లడించారు.

జాతీయ స్థాయిలో మానవాభివృద్ధి సూచికల్లో రాష్ట్రం గతంలోని తన స్థానాన్ని కోల్పోతున్నదని తాజా గణాంకాలు సూచిస్తున్నాయి. తమది సంక్షేమ పరిపాలన అంటూ పాలకపక్షం ఎంతగా చెబుతున్నప్పటికీ సంక్షేమంలో సైతం జాతీయ స్థాయి జాబితాల్లో ఆంధ్రప్రదేశ్ స్థానం పడిపోతున్నది.

నిజానికి ఆంధ్రప్రదేశ్‌కు అపారమైన వనరులున్నాయి. అభివృద్ధి చెందడానికి అవకాశాలు కూడా పుష్కలంగా ఉన్నాయి. ప్రజలలో గొప్ప చొరవ ఉంది. బలమైన స్థానిక నాయకత్వం ఉంది. ప్రగతి శీల దృష్టి, హేతుబుద్ధి, తార్కిక వివేచన కల పౌర సమాజం ఉంది. సంప్రదాయ మాధ్యమాలకు బలమైన పట్టు ఉంది. ఇటీవల జనమాధ్యమాల విస్తరణ కూడా అత్యంత వేగంగా సాగుతోంది. అయినా రాష్ట్రం తన దిశను కోల్పోయింది.

ఎన్ని సానుకూల అంశాలున్నా రాష్ట్రంలో రాజకీయ, సామాజిక వాతావరణాన్ని కలుషితం చేసే సంస్కృతి వేళ్లూనుకుంటున్నది. ప్రజాస్వామ్యంలో బహిరంగ చర్చకు కీలక ప్రాముఖ్యత ఉంటుంది. రాష్ట్రంలో బహిరంగ చర్చ ప్రమాణాలు నానాటికీ దిగజారిపోతున్నాయి. పరస్పర నిందలు, పరుష పదజాలం, వ్యక్తిగత దూషణలు, అసభ్యత, అశ్లీలం పెరిగిపోతున్నాయి. రాజకీయ పరిభాషలో హుందాతనం తగ్గి, అసభ్యత, అశ్లీలం పెరిగిపోతున్నాయి.

రాష్ట్రంలో పాలు, తేనెలు ప్రవహిస్తున్నాయని ప్రజాజీవితం అత్యద్భుతంగా వెలిగిపోతోందని పాలకపక్షం గట్టిగా నమ్ముతోంది. అభివృద్ధీ-సంక్షేమం తమ పాలనకు రెండు కళ్లవంటివని ప్రభుత్వ పెద్దలు అంటున్నారు. జరుగుతున్న పాలన అంతా అవినీతిమయం అనీ, పాలన పడకేసిందనీ, రాష్ట్రం అధోగతి పాలవుతోందని ప్రధాన ప్రతిపక్షం విమర్శిస్తోంది. రెండు వాదనలకూ పొంతన లేదు. అంశాల వారీగా వాస్తవాలను నిష్పాక్షికంగా అంచనా వేసే స్వతంత్ర స్వరాలు లేకపోవడం పెద్దలోటుగా పరిణమించింది. అధికార-ప్రతిపక్ష పార్టీల మధ్య ప్రజాస్వామ్యబద్ధంగా, హుందాగా జరగాల్సిన రాజకీయ చర్చ పక్కదారులు పడుతోంది. రాష్ట్ర స్థాయిలో జరుగుతున్న బహిరంగ చర్చ స్థాయి ముఠాకక్షల మాదిరిగా తయారైంది. జనమాధ్యమాల సాయంతో అది కిందిస్థాయికి చేరి వికృతంగా మారుతోంది. రాష్ట్రంలో మర్యాదస్తులైన వారు చర్చలో పాల్గొనలేని దుర్భర, దుస్సహ వాతావరణం ఏర్పడి పోయింది. 2019 ఎన్నికలలో తమకు ప్రజలు ఇచ్చిన ఏకపక్షతీర్పును పాలకపక్షం సవ్యంగా అర్థం చేసుకున్నట్టుగా కన్పించదు. ప్రతిపక్షంపైనా విమర్శకులపైనా, స్వతంత్ర అభిప్రాయాలు కలిగిన వారిపైనా, జనమాధ్యమాలలో విరుచుకుపడి నోరు మూయించే దౌర్జన్య సంస్కృతి పెరిగి పోయింది. ప్రభుత్వమే కక్షసాధింపులకు, వేధింపులకూ పూనుకోవడం పాలకపక్ష శ్రేణులకు ఉత్సాహాన్ని, ప్రేరణనూ అందిస్తోంది.

ప్రభుత్వం ఏం చేసినా చెల్లుతుందని, పాలకపక్ష నేతలు భావిస్తూ వచ్చారు. ఉన్నత న్యాయస్థానాల తీర్పులను సైతం తమదైన ధోరణిలో తప్పు పట్టే వరకూ నేతలు తెగించారు. ఎన్నికలలో గెలిచిన తర్వాత పాలనపై కన్నా రాజకీయ ప్రచారవ్యూహాలకే ప్రాధాన్యం ఇవ్వడం పాలకపక్షానికి తగదు. దుర్భేద్యమైన కోటలు సైతం ఏదో ఒక యుద్ధంలో ఓడిపోతాయి. పాలకపక్షాలు సంయమనంతో విశాల దృష్టితో నలుగురిని కలుపుకొని తీసుకెళ్లే ప్రయత్నం చేయాలి. ప్రతిపక్షం సైతం తన పాత్రను సందర్భోచితంగా పోషించాల్సి ఉంటుంది. ఎన్నికలు పూర్తయిన వెంటనే పాలకపక్షంపై దండయాత్రకు బయలుదేరడం ప్రజాస్వామ్య స్ఫూర్తికాదు. రాష్ట్రంలో పరిస్థితులు దిగజారడానికి అదే కారణం!

ఆంధ్రప్రదేశ్‌లో అధికార, ప్రతిపక్ష పార్టీలను, వివిధ రాజకీయ పక్షాలనూ, పౌరసమాజాన్ని, జనమాధ్యమాలనూ ఉద్దేశించి లోక్‌సత్తా వ్యవస్థాపకులు డాక్టర్ జయప్రకాశ్ నారాయణ్ ఇటీవల రాసిన బహిరంగ లేఖకు చాలా ప్రాధాన్యం ఉంది. 'అందరి ఉమ్మడి లక్ష్యం ఒకటే అయినప్పుడు అభిప్రాయభేదాల్ని సమన్వయం' చేయడం అవసరమని డాక్టర్ జయప్రకాశ్ నారాయణ్ చేసిన సూచన స్వాగతించదగినది. బహిరంగ చర్చ ప్రమాణాలను పెంచే దిశగా పౌరసమాజ సంస్థలు చొరవ తీసుకోవాల్సిన అవసరం ఎంతో ఉంది. సమస్యలు పరిష్కారం కోసం ఆంధ్రప్రదేశ్ పౌర సమాజం తక్షణం మౌనం వీడాల్సిన తరుణం వచ్చింది. జేపీగారి బహిరంగ లేఖ సారాంశం అదే!

డి. సోమ సుందర్

### ఆంధ్రప్రదేశ్ పరిణామాలు ఆందోళనకరం ..

# మౌనంగా ఉండలేం

**ఏపీలో రాజకీయ వేడిని చల్లార్చి, ప్రజలకు భరోసానిచ్చేందుకు చొరవ చూపాలని**


**ముఖ్యమంత్రి, ప్రతిపక్ష నేత, పార్టీలు, పౌర సమాజం, మీడియాలకు జేపీ బహిరంగ లేఖ**

ఆంధ్రప్రదేశ్‌లో ఇటీవలి పరిణామాలు ఆందోళనకరమని, రాజకీయ వేడిని చల్లార్చి ప్రజలకు భరోసానిచ్చేందుకు చొరవ చూపాలని ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి, ప్రతిపక్ష నేత చంద్రబాబు నాయుడు, అధికార, ప్రతిపక్ష పార్టీల కార్యకర్తలు, ఇతర పార్టీలు, పౌర సమాజం, మీడియాలకు ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ బహిరంగ లేఖలో విజ్ఞప్తి చేశారు. లేఖను లోక్‌సత్తా వర్గాలు మీడియాకు విడుదల చేశాయి.

**జేపీ లేఖ యధాతథంగా..**

“ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజకీయంలో ఇటీవలికాలంలో చోటు చేసుకుంటున్న పరిణామాలు ఆలోచనాపరులందరినీ ఆందోళనకు గురిచేస్తున్నాయి.

2014లో రాష్ట్ర విభజన తర్వాత ప్రభుత్వ ఆదాయానికి, పెట్టుబడులు, ఉపాధి కల్పనకి కేంద్రంగా ఉన్న మహానగరాన్ని ఆంధ్రప్రదేశ్ కోల్పోయిన విషయం అందరికీ తెలుసు. ఆంధ్రప్రదేశ్ ప్రజలలో స్వయంకృషితో ఎదగాలన్న పట్టుదల ఉంది. కష్టపడే తత్వం ఉంది. ఆత్మగౌరవం ఉంది. తమ కుటుంబాల రేపటి మంచి భవిష్యత్తు కోసం ఈవేళ అవసరమైతే త్యాగాలు చేసే దూరదృష్టి ఉంది. సుమారు 1000 కిలోమీటర్ల తీరప్రాంతముంది. ఖనిజ సంపద ఉంది. ప్రతి కుటుంబానికీ పిల్లలకు మంచి విద్య అందాలనే ఆకాంక్ష ఉంది. వీటన్నిటినీ సద్వినియోగం చేసి బీదరికాన్ని నిర్మూలించటం, ప్రజల్లో ఆత్మ విశ్వాసాన్ని పెంచటం, ఆర్థిక ప్రగతిని వేగవంతం చేయటం, రాష్ట్ర సమగ్ర అభివృద్ధికి బాటలు వేయటం మనందరి ఉమ్మడి లక్ష్యం కావాలి. ప్రభుత్వ పక్షం, ప్రతిపక్షం అన్న తేడా లేకుండా అన్ని పార్టీలూ రాష్ట్ర భవిష్యత్తు కోసం పనిచేయాలి. పౌర సమాజం, పత్రికలు, ఇతర జన మాధ్యమాలు కులాలు, ప్రాంతాలు, పార్టీలకు అతీతంగా ప్రజలను సంఘటితం చేయటం, ప్రజల్లో చైతన్యాన్ని పెంచటం, యువతకి మంచి భవిష్యత్తు కోసం పటిష్ఠమైన










పునాదులు వేయటం అవసరం. రాష్ట్ర విభజన కారణంగా సంక్షోభంలో చిక్కుకున్న ఆంధ్రప్రదేశ్ ప్రజలకి రాజకీయ పార్టీలు ఆదర్శవంతమైన నాయకత్వాన్ని ఇవ్వాలి. దురదృష్టవశాత్తు నాయకుల మధ్య రాజకీయ విభేదాలు కక్షలు కార్పణ్యాలకి, ద్వేషానికి, పరుషమైన, అనాగరికమైన భాషాప్రయోగానికి, హింసకి. భావోద్వేగాలకి దారితీస్తున్నాయి. బహిరంగ చర్చ ప్రమాణాలు, చట్టబద్ధపాలనను పరిహసిస్తున్నాయి. ఈ విభేదాల్లో సైద్ధాంతిక, విధానపరమైన అంశాలేమీ లేవు. పార్టీల మధ్య ఈ రకమైన రాజకీయం వల్ల ప్రజలు తీవ్రంగా నష్టపోతున్నారు.

నిజమైన రాజకీయం ఒక పవిత్ర వ్యాసంగం. పరిమితమైన వనరుల్ని పెరుగుతున్న మన అవసరాల కోసం విజ్ఞతతో వినియోగించటం, ఎంతో వైవిధ్యభరితమైన సమాజంలో సామరస్యతని, ఐక్యతని పెంచటం, శాంతియుతంగా, హేతుబద్ధమైన వాదనల ద్వారా, ఇచ్చిపుచ్చుకునే ధోరణితో అభిప్రాయ భేదాలని సమన్వయం చేయటం, బతుకుభారంతో సతమతమవుతున్న బీదలకి తాత్కాలిక సాయం అందిస్తూనే దీర్ఘకాలికంగా కుటుంబాలకు ఆదాయాన్ని, యువతకు ఉపాధిని పెంచే రీతిలో ఆర్థిక అభివృద్ధికి సమాజాన్ని సన్నద్ధం చేయటం- ఇవీ నేటి రాజకీయం ముందున్న పెనుసవాళ్లు. ఈ పరిస్థితుల్లో అభిప్రాయ భేదాల్ని విస్మరించి రాష్ట్రంలో అన్ని వర్గాలనీ కలుపుకుని సామరస్య వాతావరణాన్ని నెలకొల్పే బాధ్యత ప్రభుత్వానికి, అన్ని రాజకీయ పార్టీలకి, పత్రికలకి, జన మాధ్యమాలకి ఉంది. ఈ కర్తవ్యాన్ని నిర్వహించవలసిందిగా రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ జగన్మోహన్‌రెడ్డి గారిని, ప్రతిపక్ష నాయకుడు శ్రీ చంద్రబాబునాయుడు గారిని, వివిధ పార్టీల కార్యకర్తలని, పౌర సమాజ పెద్దలని, పత్రికలు, జన మాధ్యమాలని వినమ్రంగా అర్థిస్తున్నాం. దయచేసి సామరస్యంగా వ్యవహరించండి, కవ్వింపు చర్యల్ని, మాటల్ని వీడండి, జరిగినదాన్ని పక్కన పెట్టండి, రాజకీయ వేడిని చల్లార్చండి. రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి కావాలని, బీదరికాన్ని తొలగించాలని, అందరికీ మంచి ప్రమాణాల విద్య, ఆరోగ్యాల్ని అందించాలని, మౌలిక సదుపాయాల ఏర్పాటు, ఆర్థిక ప్రగతి, ఉపాధి కల్పన, ఆదాయాల పెంపు జరగాలని అందరూ కోరుకుంటున్నారు. మనందరి ఉమ్మండి లక్ష్యం ఒకటే అయినప్పుడు, అభిప్రాయ భేదాలను సమన్వయం చేయటం అవసరం, సాధ్యం. ద్వేషాన్ని, ఆగ్రహావేశాల్ని చల్లబరిచి అందరినీ ఐకమత్యతతో కార్యోన్ముఖుల్ని చేయటమే గొప్ప నాయకత్వం. అలాంటి నాయకత్వాన్నిచ్చే శక్తిసామర్థ్యాలు ఆంధ్రప్రదేశ్‌లోని ప్రధాన రాజకీయ పార్టీలకి, పౌర సమాజానికి పుష్కలంగా ఉన్నాయి.

తీవ్ర ఆర్థిక సమస్యల సుడిగుండంలో చిక్కుకున్న రాష్ట్ర భవిష్యత్తుకి చిత్తశుద్ధితో కలసిపనిచేయటం ప్రభుత్వంతో పాటు అన్ని పార్టీల ఉమ్మడి బాధ్యత. అందుకు సహకరించటం, సమాజానికి సరైన మార్గాన్ని చూపెట్టటం పౌర సమాజం, పత్రికల కర్తవ్యం. అందరూ కలిసి కృషి చేసినప్పుడే నిరాశను అంతం చేసి, అన్ని వర్గాల ప్రజలకూ ధైర్యాన్ని, భరోసాని కల్పించగలం. భావోద్వేగాలు, హింసలు తీవ్రంగా పెరిగిన ప్రస్తుత సమయంలో తప్పుల్ని ఎన్నటం వల్ల ఉపయోగం లేదు. ఎదుటివారిలో తప్పుల్ని వెతకటానికి తప్ప, తమ తప్పుల్ని గుర్తించటానికి ఎవరూ ఇష్టపడరు. ఆంధ్రప్రదేశ్‌లోని అధికార, ప్రతిపక్ష పార్టీల్లో కుల, మతాలకు అతీతమైన అద్భుత నాయకత్వం ఉంది. కానీ అలాంటి మంచి ఆలోచనలు, మంచి నాయకత్వ సామర్థ్యం బయటపడటం కష్టమైన పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో.. ఎన్నికల రాజకీయాలకి, పక్షపాతాలకి అతీతంగా పౌర సమాజంలో పెద్దలు, పత్రికలు, జన మాధ్యమాలు, చిత్తశుద్ధి, అనుభవం ఉన్న నాయకులు పూనుకోవటం అవసరం. ఈ భారాన్ని కేవలం రాజకీయ పార్టీల మీద మాత్రమే పెట్టకుండా చొరవ తీసుకోవాలని పౌర సమాజ పెద్దల్ని, పత్రికల్ని, జన మాధ్యమాల్ని వినమ్రంగా కోరుతున్నాం. అందరూ కలవండి, పరిష్కారంలో భాగమవ్వండి. లోక్‌సత్తా ఉద్యమం, ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా పార్టీ అలాంటి నిర్మాణాత్మక ప్రయత్నంలో పక్షపాతాలకి, రాగద్వేషాలకి అతీతంగా కృషి చేస్తాయి".

# ఓటుకు-ప్రజల జీవితాలకి సంబంధం లేని ప్రజాస్వామ్యం నడుస్తోంది: జేపీ




మన దేశంలో ఓటుకు, ప్రజల జీవితాలకి సంబంధం తెగిపోతోందని, హుజూరాబాద్ ఉప ఎన్నికలే ఇందుకు తాజా నిదర్శనమని ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ అన్నారు. ప్రముఖంగా చెప్పుకునే పార్టీలు ఒక్కోటీ ఈ ఎన్నికలో కనీసం రూ.40 కోట్లు ఖర్చు చేశాయన్నారు. ఒక ఉప ఎన్నికకు వందల కోట్ల వ్యయంతో హుజూరాబాద్ ప్రపంచంలోనే అత్యంత ఖరీదైన అసెంబ్లీ స్థానం అపవాదును మూటకట్టుకుందన్నారు. ఓటు అంటే డబ్బు పంపిణీ, ఉచితాలు, తాయిలాలు, కులం, మతంగా తయారుచేశారని, ఇది నిజమైన ప్రజాస్వామ్యం కాదన్నారు.

రచయిత, విద్యావేత్త కనిగిరి సత్యనారాయణ ప్రసాద్ రచించిన 'కొత్త రాజకీయ తత్వం-దృఢమైన సమాజాలకు సర్వరోగ నివారిణి-సమకాలీన భారత రాజకీయాల్లో మలుపులు' అనే పుస్తకాన్ని హైదరాబాద్ సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో జేపీ ఆవిష్కరించారు.

ప్రజాస్వామ్యంలో ఎన్ని లోపాలున్నా రాజకీయాల్లో ఉన్నవారంతా రాక్షసులు అనే అభిప్రాయం సరికాదని జేపీ అన్నారు. రాజకీయాల్లో ఉన్నవారూ సమర్థులేనని, ఎంతో కొంత సమాజానికి మేలు చేద్దామనే భావనతోనే రాజకీయాల్లోకి వస్తారన్నారు. ఆఖరికి నేర చరితులు కూడా ఏదైనా మంచి చేద్దామనే రాజకీయాల్లో పాల్గొంటారన్నారు. అయితే, మన దేశంలో వ్యవస్థల నిర్మాణం సరిగా లేకపోవటం వల్ల పార్టీలు, నాయకులు బాధితులుగా ఒక విషవలయంలో చిక్కుకుపోయారన్నారు. వ్యక్తులు, పెత్తందారీతనం చుట్టూ కాకుండా వ్యవస్థల చుట్టూ పాలన ఉండేలా పరిష్కారాలపై రాజకీయాల్లో నిర్మాణాత్మకమైన చర్చ అవసరమన్నారు. ప్రజలపైన పాలకులు పెత్తనం చేస్తూ ప్రస్తుతం తలకిందులుగా ఉన్న ప్రజాస్వామ్యాన్ని సరిచేయాలన్నారు.

ప్రజల దృక్పథం కూడా మారాలని, ప్రజాస్వామ్యంలో తామే ప్రభువులమని, పాలకులు సేవకులు మాత్రమేనని గుర్తించాలని, ఆత్మవిశ్వాసంతో, ఆత్మగౌరవంతో వ్యవహరించాలని జేపీ అన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో పని చేయించుకోవటం తమ హక్కయినా కూడా మన దేశంలో ప్రజలు ఇప్పటికీ ప్రభుత్వాధికారులను చూసి భయపడుతుంటారన్నారు. పోలీసు స్టేషన్‌కి వెళ్లాలంటే వణికిపోతుంటారన్నారు. ఒక దిగువ స్థాయి ప్రభుత్వాధికారిని కూడా తమ కంటే ఎంతో అధికుడిగా ప్రజలు భావిస్తుంటారన్నారు. రాజకీయాలను పట్టించుకోకుండా మౌన ప్రేక్షకుల్లా ఉంటే నష్టపోయేది ప్రజలేనని, ప్రతి ఒక్కరూ రాజకీయాల్ని ఆలోచనతో పట్టించుకుంటూ పరిష్కారంలో భాగమవ్వాలన్నారు. సమాజంలో అవకాశమున్నవారంతా రాజకీయ వ్యవస్థను ఎలా మార్చాలి, జనంలో ఆలోచనను ఎలా పెంచాలి అనే దిశలో పనిచేయాలని సూచించారు. సత్యనారాయణ ప్రసాద్ మాట్లాడుతూ, చాలామంది రాజకీయాల్లోకి వచ్చే ముందు నీతివాక్యాలను వల్లిస్తారని, ఆ తర్వాత ఏరు దాటాక తెప్ప తగలేసినట్లు వ్యవహరిస్తున్నారని అన్నారు. ఎన్నికలకు ముందు ఒకలా, ఎన్నికలయ్యాక మరోలా పనిచేస్తున్నారన్నారు. యువత రాజకీయాల్లోకి వస్తేనే మార్పు సాధ్యమన్నారు. పుస్తకంలో ఆయన దేశంలోని రాజకీయ పార్టీలు, కొత్త పార్టీలు, ప్రాంతీయ పార్టీలు, వాటి రాజకీయాలు, రాజకీయ నేతలు, ఉచితాలు తదితర అంశాలను ప్రస్తావించారు. సమావేశంలో పర్యావరణవేత్త సుబ్బారాయుడు, సైన్స్ కమ్యూనికేటర్ అనిల్ దుబే, గాంధీ హైస్కూల్ అధ్యక్షుడు బి.మోహన్ సింగ్, కె.ప్రకాష్ బాబు, వెంకట్రావ్, నిర్వాహక ప్రతినిధులు వినోద్, టి.వివేక్ తదితరులు పాల్గొన్నారు.

# ఏపీ లోక్‌సత్తా పార్టీ పునర్నిర్మాణం: జేపీ

## నూతన అధ్యక్షుడిగా భీశెట్టి బాబ్జీ.. 8 లక్ష్యాలతో కార్యాచరణ

ఎన్నికల లక్ష్యాలు, పక్షపాత రాజకీయాలకి అతీతంగా 8 లక్ష్యాల సాధనకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో లోక్‌సత్తా పార్టీని పునర్నిర్మాణం చేస్తున్నట్లు వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ ప్రకటించారు. ఈ లక్ష్యాల పైన అధ్యయనం చేయటానికి, ప్రజల్లో విస్తృత ప్రచారాన్ని చేపట్టటానికి, నిర్మాణాత్మకమైన ఉద్యమ కార్యకలాపాలు చేపట్టటానికి, తగిన రీతిలో ప్రతి లక్ష్యానికి సంకల్పం, సామర్థ్యం ఉన్న నాయకులను గుర్తించి వారితో బృందాల్ని ఏర్పాటు చేయటానికీ ప్రజా ఉద్యమాల్లో చురుకైన పాత్ర నిర్వహిస్తున్న పార్టీ సీనియర్ నేత భీశెట్టి బాబ్జీని లోక్‌సత్తా పార్టీ ఏపీ నూతన అధ్యక్షుడిగా నియమిస్తున్నట్లు తెలిపారు.

**ఎనిమిది లక్ష్యాలు:**

1) **అధికార వికేంద్రీకరణ:** ఓటుకి, వ్యక్తి జీవితానికి మధ్య సంబంధం ప్రజలకు బోధపడేలా అధికార వికేంద్రీకరణ.

2) **చట్టబద్ధపాలన:** ఎక్కువ-తక్కువలు, ధనిక-బీద, అగ్ర-నిమ్న కులవివక్ష లేకుండా చట్టం అందరికీ సమానంగా వర్తించేలా చేయటం.

3) **సామాన్య పౌరులకి సక్రమంగా పౌర సేవలు:** వేధింపులు, అవమానాలు, లంచాలు లేకుండా సామాన్య పౌరులకి సకాలంలో, సక్రమంగా, గౌరవప్రదంగా పౌర సేవలు అందే ఏర్పాటు.

4) **ప్రజలకు ఆర్థిక భారం లేకుండా సమగ్ర**

### సామాన్యులకు నాయకత్వం ఇచ్చింది జేపీ మాత్రమే

ఆటగాళ్లు కాదు ఆట నియమాలు మారాలని, రాజకీయ పార్టీల్లో, ప్రభుత్వంలో సామాన్యులు అధికారంలోకి రావాలని సమగ్ర భావజాలంతో భారతదేశంలోనే మొదలైన తొలి పార్టీ లోక్‌సత్తా అని, అలాంటి పార్టీని ప్రారంభించిన డా॥ జయప్రకాష్ నారాయణ్‌తో ఉద్యమ సంస్థ నాటి నుండి గత 18 ఏళ్లుగా పనిచేయటం తనకెంతో గౌరవమని భీశెట్టి బాబ్జీ అన్నారు. లోక్‌సత్తా పార్టీ ఏపీ విభాగం నూతన అధ్యక్షుడిగా నియామకం సందర్భంగా తనను సత్కరించిన పార్టీ నేతలకు కృతజ్ఞతలు చెబుతూ.. ఏ అధికారం లేకున్నా నిజమైన రాజకీయం కోసం లోక్‌సత్తా పనిచేస్తోందని, ప్రతి బిడ్డకూ నాణ్యమైన విద్య, ప్రతి కుటుంబానికీ మంచి ప్రమాణాల ఆరోగ్యం, చట్టబద్ధపాలన, జనం చేతికి అధికారం, ప్రభుత్వ కార్యాలయాల్లో హక్కుగా సేవలు వంటి అంశాల మీద దేశంలోనే లోతైన కృషి చేస్తోందన్నారు. భారత్ వంటి దేశంలో సామాజిక, రాజకీయ సూత్రీకరణల్ని రూపొందించటం, వాటి సాధన కోసం ఒక వేదికను నిర్మించి సుదీర్ఘకాలం పనిచేయటం అంత సులభం కాదని.. దేశాభివృద్ధి, జనహితం కోసం జేపీ చెబుతున్న మాటల్ని ప్రజల్లోకి, ముఖ్యంగా యువతలోకి ఎక్కువగా తీసుకెళ్లాల్సుందని అన్నారు. ఈ నెలలో అన్ని జిల్లాల్లో పర్యటించి లక్ష్యాలపై నాయకులను సన్నద్ధం చేయనున్నట్లు బాబ్జీ తెలిపారు. కార్యక్రమంలో లోక్‌సత్తా పార్టీ విజయనగరం నియోజకవర్గ అధ్యక్షుడు అల్లంశెట్టి నాగభూషణం, కార్పొరేషన్ కార్యదర్శి తాత్రాజు రాజారావు, కొత్త సునీల్, రఘు, పి.ఎల్.ఎన్ రాజు, శిమ్మ శ్రీను, పొలుపర్తి అప్పారావు, బోర రమేష్, మహిళా అధ్యక్షురాలు రాయి పద్మ, పతివాడ చంద్రరావు, కోరాడ అరవింద్, బి.భాస్కర్, పిల్లా ఆదీశ్వరరావు, ఏర్నిబాబు తదితరులు పాల్గొన్నారు.



**ఆరోగ్య వ్యవస్థ అమలు:** కొవిడ్ కాలంలో ఆరోగ్య రంగంలో సంక్షోభం చూశాక ప్రజలంతా కోరుకుంటున్నట్లు.. ప్రాథమికం నుండి తృతీయ దశ వరకూ అన్ని స్థాయిలో ఎటువంటి ఆర్థిక భారం లేకుండా ప్రజానీకం తమకు నచ్చిన వైద్యుని వద్ద చికిత్స పొందేలా సమగ్రమైన ఆరోగ్య వ్యవస్థను నిర్మించటం.

5) **ఏ స్కూల్‌లో చదివినా ప్రతి బిడ్డకూ మంచి ప్రమాణాల విద్య:** విద్యలో ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాల తేడా లేకుండా మంచి ప్రమాణాల విద్యను ప్రతి బిడ్డకూ అందేలా చేయటం, కుటుంబం మీద ఆర్థిక భారం లేకుండా.

6) **పాలనలో పారదర్శకత, జవాబుదారీతనం:** అన్ని స్థాయిలో పాలనలో పారదర్శకత, జవాబుదారీతనం కోసం తగిన ఏర్పాట్లకు కృషి.

7) **వ్యవసాయంలో ఆదాయం:** సంక్షోభంలో ఉన్న వ్యవసాయ రంగంలో ఆదాయాన్ని పొందేందుకు విధానాలు చేపట్టటం, వ్యవసాయానికి-ఇతర రంగాలకు మధ్య సంబంధాలను పెంచి యువతకు ఉపాధిని కల్పించటం, చిన్న పట్టణాల అభివృద్ధి, వాటితో వ్యవసాయానికి అనుబంధం ద్వారా వలసల అవసరం లేకుండా మంచి ప్రమాణాల జీవితాన్ని గ్రామీణ ప్రజలకు అందించటం.

8) **రాజకీయ సంస్కరణలు:** ఎన్నికల్లో డబ్బు, తాత్కాలిక తాయిలాలు, కుల, మత, ప్రాంత విభజనల్ని అరికట్టి మంచి నాయకత్వం ఎదిగేందుకు వీలుగా ఎన్నికల వ్యవస్థలో, రాజకీయ వ్యవస్థలో సమూల సంస్కరణలు.

"ఈవేళ దేశం ఉన్న పరిస్థితుల్లో ఈ రంగాల్లో మౌలిక మార్పుల కోసం లోక్‌సత్తా ఉద్యమం, ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్).. అవే లక్ష్యాల కోసం ఒక పార్టీగా లోక్‌సత్తా ఏర్పడ్డాయి. ఇదే నేపథ్యంలో ఎన్నికల వ్యూహాలు, పక్షపాత రాజకీయాలకి అతీతంగా దీర్ఘకాల దృక్పథంతో పైన పేర్కొన్న లక్ష్యాల కోసం కృషి చేస్తూ ప్రజల్లో చైతన్యాన్ని పెంచి నిర్మాణాత్మక ఉద్యమ కార్యకలాపాలని చేపట్టటం లోక్‌సత్తా పార్టీ బాధ్యత. అందుకనుగుణంగా లోక్‌సత్తా పార్టీ ఆంధ్రప్రదేశ్ శాఖను పునర్నిర్మాణం చేయవలసిన అవసరం ఉంది. ఈ లక్ష్యాలకు అనుగుణంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పునర్నిర్మాణం చేపట్టటం కోసం పార్టీలో సభ్యత్వ నమోదు, అంతర్గత ఎన్నికల్ని నిర్వహించే వరకు శ్రీ భీశెట్టి బాబ్జీ గారిని రాష్ట్ర అధ్యక్షుడిగా నియమించటమైనది. పైన పేర్కొన్న 8 లక్ష్యాలపై అధ్యయనం చేయటానికి, ప్రజల్లో విస్తృత ప్రచారాన్ని చేపట్టటానికి, నిర్మాణాత్మకమైన ఉద్యమ కార్యకలాపాలు చేపట్టటానికీ తగిన రీతిలో ప్రతి లక్ష్యానికి సంకల్పం, సామర్థ్యం ఉన్న నాయకులను గుర్తించి వారితో బృందాల్ని ఏర్పాటు చేయటం నవంబర్ 30 నాటికల్లా పూర్తి చేయాలని నూతన అధ్యక్షుడ్ని కోరటమైనది. రాష్ట్రంలో ఎన్నికల రాజకీయాలకి, పక్షపాతాలకి అతీతంగా ఉండి విశ్వసనీయత, అనుభవం ఉన్న నాయకులు, పౌరులతో సంప్రదింపులు, సమావేశాలు జరిపి రాష్ట్ర రాజకీయాల్లో సామరస్య వాతావరణం ఉండేలా కృషి చేయటం.. తేవాల్సిన సంస్కరణలు, ప్రభుత్వ విధానాలపైన ఆరోగ్యకరమైన, హేతుబద్ధమైన బహిరంగ చర్చను చేపట్టటం అత్యవసరం. ఇందుకు కావలసిన చర్యలన్నిటినీ రాష్ట్రంలో అన్ని ప్రాంతాలలో ప్రముఖులనీ సంప్రదించి చేపట్టాలని కోరటమైనది" అని ఒక ప్రకటనలో జయప్రకాష్ నారాయణ్ తెలిపారు.

## సహకార భీమసింగి సమస్యపై కలికట్టుగా పోరాడదాం

విజయనగరం జిల్లాలో సహకార రంగంలో ఉన్న భీమసింగి చక్కెర కర్మాగారం సమస్యను కలసికట్టుగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి రైతులు, కార్మికుల వ్యథలను పరిష్కరించేందుకు కృషి చేద్దామని జేడీ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు వి.వి లక్ష్మీనారాయణ అన్నారు. కర్మాగారాన్ని తెరిపించాలన్న డిమాండ్‌తో లోక్‌సత్తా పార్టీ చొరవతో అఖిలపక్షం నిర్వహించిన రైతు మహాజనసభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఉద్యోగుల బకాయిల్ని వెంటనే చెల్లించాలన్నారు. దేశంలో, రాష్ట్రంలో ప్రభుత్వాలు రైతుల సమస్యలను పట్టించుకోవటం లేదన్న అసంతృప్తి ప్రతి చోటా ఉందన్నారు. ఇప్పటికే భీమసింగి కర్మాగారం విషయంలో రైతులు, కార్మికుల ప్రయోజనాల పరిరక్షణకు పలు ఆందోళనా కార్యక్రమాల్ని నిర్వహించామని, అయినా ప్రభుత్వం, ప్రజాప్రతినిధుల్లో చలనం రాకపోవటం బాధాకరమని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ అన్నారు. రైతులు చెరకు పంట మీద ఎంతో పెట్టుబడి పెట్టారని, కర్మాగారాన్ని తెరవటంపై అనిశ్చితి కొనసాగితే వారు ఆర్థికంగా మరింత సంక్షోభంలో కూరుకుపోతారన్నారు. ఆందోళనలకు దిగటం తప్ప వారికి వేరే మార్గం ఉండదన్నారు. తెలుగుదేశం, సీపీఐ, సీపీఎం, లోక్‌సత్తా, రైతు సంఘాల నేతలు బండారు పెదబాబు, పి. కామేశ్వరరావు, తమ్మినేని సూర్యనారాయణ, చల్లా జగన్, కరక వెంకట రమణ, కృష్ణమూర్తి, లగుడు రవికుమార్, బి.నర్సింగరావు, ముగ్రాపు సూర్యనారాయణ, మంగరాజు, తమ్మినాయుడు, మహంతి శంకరరావు, యంగ్రపు నాయుడు బాబు, ఆదినారాయణ, కృష్ణారావు, కృష్ణబాబు, పెద్ద సంఖ్యలో రైతులు, కార్మికులు పాల్గొన్నారు.





# అధికారం @ 20

ఎన్నికైన ప్రభుత్వాధినేత పదవుల్లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇరవయ్యేళ్ల మైలురాయిని దాటారు. 2001 అక్టోబర్ 7న గుజరాత్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించి వరుసగా నాలుగు పర్యాయాలపాటు పన్నెండున్నర సంవత్సరాలకుపైగా పరిపాలించి రికార్డు సృష్టించారు. ఆ తర్వాత 2014లో ప్రధానమంత్రిగా బాధ్యతలు స్వీకరించి గత ఏడేళ్లుగా పదవిలో కొనసాగుతున్నారు. గుజరాత్ ముఖ్యమంత్రిగా 4,610 రోజులు, ప్రధానమంత్రిగా 2,691 రోజులు (అక్టోబర్ 7, 2021 నాటికి) ఎన్నికైన ప్రభుత్వాలకు ఆయన సారథ్యం వహించారు. క్రికెట్ తరహాలో రికార్డులను వెతికే ప్రయత్నం చేస్తే.. గుజరాత్ ముఖ్యమంత్రిగా, భారత ప్రధానమంత్రిగా కూడా ఆయన తొలిసారి ప్రమాణం 14వ స్థానంలోనే ఉండటం, ఇరవయ్యేళ్లలో ఒక్కసారి కూడా ఓడిపోకుండా గెలవటం వంటి ఇంకొన్ని రికార్డులు కూడా దొరుకుతాయి. తన సుదీర్ఘ పదవీ ప్రస్థాన విశేషాన్ని ఐక్యరాజ్యసమితి సాధారణ సభ (యూఎన్‌జీఏ) 76వ సమావేశంలో కూడా ప్రధాని వివరించారు. తన చాయ్‌వాలా నేపథ్యాన్ని కూడా మళ్లీ గుర్తుచేశారు. ఇదంతా ప్రజాస్వామ్యం ఘనతేనని చెప్పారు. ప్రజాస్వామ్యం నడుస్తుందని, ఫలితాలను సాధిస్తుందని, ఇవి తన అనుభవం నుండి చెబుతున్న మాటలని తెలిపారు. భారత్‌లో ఉన్న అపరిపక్వ ప్రజాస్వామ్యాన్ని పరిణతి దిశగా మళ్లించేందుకు కృషి చేయకుండా, ఇంకా బలహీనపరుస్తున్నారని ప్రపంచ సూచీలు కూడా వరుసగా చెబుతుండటం, కొన్ని మిత్ర దేశాల నుండి సైతం నేరుగా విమర్శలు వస్తున్న నేపథ్యంలో.. ఈ అంశాల్ని మోదీ సభ ముందు ఉంచటం ప్రాధాన్యతను సంతరించుకుంది.

తన 20 ఏళ్ల అధికారంలో భారత్‌లోని రాజకీయాలపై మోదీ బలమైన ముద్ర వేశారనటంలో సందేహం లేదు. వ్యక్తిగత నైతికత, సైద్ధాంతిక విశ్వాసం, వేగంగా ఎదగాలనే తపన, సంసార బాదరబందీ లేకుండా కష్టపడటం, కఠిన క్రమశిక్షణ ఆయన్ను వేగంగా ఎదిగేలా చేశాయి. ముఖ్యంగా భారతదేశంలోని కేంద్రీకృత అధికార వ్యవస్థ, గుజరాత్ నేపథ్యం ఆయన శైలికి బాగా ఉపకరించాయి. అధికారాన్ని పూర్తిగా కేంద్రీకరించి, వాణిజ్యాన్ని బాగా సరళీకరించి పెట్టుబడులను ప్రోత్సహించేందుకు తగిన వాతావరణాన్ని, మౌలిక వసతుల్ని కల్పించటం, వ్యవసాయ, గృహ విద్యుత్ ఫీడర్లను వేరు చేసి సరఫరాను మెరుగుపరచటం, వ్యక్తిగత అవినీతి లేకుండా పనిచేయటం మోదీకి గుజరాత్‌లో ప్రజామోదాన్ని సాధించిపెట్టాయి. వ్యక్తిగత వాగ్ధాటి, చాతుర్యం ఆయన్ను బలమైన జనాకర్షక నేతగా తీర్చిదిద్దాయి. ఇదే క్రమంలో భారతీయ జనతా పార్టీకి తన కంటే ముందే పార్టీపరంగా, పార్టీ వెలుపల ఉన్న దశాబ్దాల పునాది ఆయన ఎదుగుదలకు దోహదం చేసింది. క్రమంగా గుజరాత్ నమూనాలో భారతదేశంపై కూడా పట్టు సాధించేందుకు ఆయన సన్నద్ధమయ్యారు. కాంగ్రెస్‌పై గుత్తాధిపత్యమున్న పెత్తందారీ కుటుంబ నేతలకు 21వ శతాబ్దపు భారతదేశ నిర్మాణం పట్ల సరైన అవగాహన లేకపోవటం, కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీయే ప్రభుత్వం సంస్కరణల్ని వీడి అవినీతిలో కూరుకుపోయి తిరోగమన ఆలోచనలు చేయటం మోదీకి బాగా



కలిసొచ్చింది. చట్టబద్ధపాలనను బాగు చేయకుండా, సంస్కరణల్ని వేగవంతం చేయకుండా, పెరుగుతున్న యువత ఆకాంక్షల్ని పట్టించుకోకుండా రోడ్ల మీద ప్రతిస్పందనల్ని, అసంబద్ధ డిమాండ్లను ప్రోత్సహించే ధోరణిని అవలంబించటం కాంగ్రెస్ ప్రతిష్ఠను మరింత దిగజార్చింది. రోడ్ల మీద ఆందోళనలకు, సోషల్ మీడియాకు, పాలనా సంస్కరణలకు మధ్య ఎంత సంబంధముందో యూపీయే ప్రభుత్వం అర్థం చేసుకునేలోపే సోషల్ మీడియా, గుజరాత్ ట్రాక్ రికార్డు, యువత, మధ్యతరగతి ఆకాంక్షలు, భారతీయ సామాజిక ధోరణుల చుట్టూ అజెండా, తన ప్రసంగ పాటవాలతో మోదీ

విరుచుకుపడ్డారు. మోదీ మాటలు, ప్రచారం, బీజేపీ పునాది, ఆ పార్టీ వెనుక ఉన్న సైద్ధాంతిక శక్తుల కృషి వల్ల దేశంలోని పలువురు తటస్థులు కూడా భారత్‌లో ఓ గొప్ప మార్పునకు మోదీ నాంది పలుకుతారని విశ్వసించి మద్దతు పలికారు. ఫలితంగా జాతీయ స్థాయిలో దాదాపు 30 ఏళ్ల తర్వాత పెద్ద విజయాన్ని మోదీ నమోదు చేశారు. బహుశా ఈ స్థాయి గెలుపుని మోదీ కూడా ఊహించి ఉండరు. ఈ విజయాన్ని మోదీ ఎలా విశ్లేషించుకున్నారోగానీ, గుజరాత్ పాలనలోని లొసుగుల్ని, పరిమితుల్ని సంస్కరించుకోకుండానే అదే నమూనాను విస్తరించటం వైపు మొగ్గు చూపారు. తటస్థుల సూచనలు ఎంత విలువైనవైనా తన కోణంలో, పార్టీ కోణంలో మాత్రమే చూడనారంభించారు. ఈ నేపథ్యంలో విస్తృత ప్రాధాన్యం దృష్ట్యా ప్రధానిగా మోదీ ఏడేళ్ల పాలన గురించే మనం ప్రధానంగా చర్చిస్తున్నా.. అందులో అంతకుముందు సుమారు పదమూడేళ్లపాటున్న గుజరాత్ పాలన కూడా మిళితమై ఉంటుంది.

**మంచి పనుల్ని కూడా మరుగున పడేసే స్థాయి కేంద్రీకరణ**

గుజరాత్ చిన్న రాష్ట్రానికి, పరిమిత వైవిధ్యం ఉన్న రాష్ట్రానికి అన్వయించిన పాలనా నమూనాను ప్రపంచంలోనే అత్యంత వైవిధ్యభరితమైన, సంక్లిష్టమైన సువిశాల భారతదేశానికి వర్తించే ప్రయత్నం ఏ రకంగా చూసినా అసంబద్ధమవుతుంది. కేంద్రీకృత పాలనలో ముఖ్యమంత్రికి పైన ప్రధానమంత్రికే ఎక్కువ అధికారాలు ఉన్నప్పటికీ, ఆ ప్రధానికి పార్టీ మీద కూడా తిరుగులేని పట్టు ఉన్నప్పటికీ.. భారతదేశం మొత్తాన్నీ గుప్పెట్లో పెట్టుకొని శాసించటం చాలా కష్ట సాధ్యం. కానీ మోదీ అదే నమూనా వైపు సహజాత మొగ్గు చూపారు. ప్రధానిగా తన విజయం స్థాయితోపాటు, చైనా నమూనా పట్ల ఆకర్షణ ఆయనను అలా ప్రేరేపించి ఉండవచ్చు. వివిధ చారిత్రక కారణాలరీత్యా భారత రాజ్యాంగం అవకాశం ఇచ్చిన కేంద్రీకృత పాలనను చైనాలోని ఏకపక్ష స్థాయికి తీసుకెళ్లాలన్న కాంక్ష మీద ఉన్న దృష్టి.. భారత్ కంటే తక్కువ వైవిధ్యం, భిన్నత్వం ఉన్న చైనా కూడా పైస్థాయిలోనే అంతా కేంద్రీకరించే దుస్సాహసం చేయలేదన్న స్పృహను ఆయనలో మరుగుపరిచింది.

చైనాలో స్థానిక ప్రభుత్వాలకవిషయంలో, అవి చేయాల్సిన పనుల్లో అధ్యక్షుడు జోక్యం చేసుకోడు. మన దేశంలో పూర్వం దేశాన్ని ఏలిన చక్రవర్తులు గ్రామాలకు ఎలాగైతే స్వయంపాలనను అనుమతించారో, అదే తరహాలో స్థానిక ప్రభుత్వాలకు ఆధునిక చైనా నేతలు స్వేచ్ఛను ఇచ్చారు. కానీ భారతీయ సంస్కృతీ సంప్రదాయాలకు నిలువెత్తు నిదర్శనమని చెప్పుకుంటున్న పార్టీకి ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రధానమంత్రి మాత్రం అధికారాన్ని కేంద్రీకరించుకుని స్థానిక ప్రభుత్వాలు చేయాల్సిన పనులను కూడా తానే ప్రకటిస్తుంటారు, పైనుంచి అమలు చేస్తుంటారు. ఈ ధోరణి వల్లే ఎన్ని నిధుల్ని వెచ్చించినా, ఎంతో ప్రచారం చేసినా స్వచ్ఛ భారత్ లాంటి కార్యక్రమం కూడా ఆశించిన ఫలితాలనివ్వటం లేదు.

మనిషి నాగరికమవుతున్నకొద్దీ ప్రజాస్వామ్యయుతంగా మారుతుంటాడు. ఇతరులతో సంబంధాలు నెరపటానికి మధ్యేమార్గాన్ని అనుసరించటం, మరీ ఎక్కువమంది మధ్య సంబంధాలు నెరపే పరిస్థితుల్లో పరస్పర విరుద్ధ ప్రయోజనాలను సైతం సమన్వయం చేయటం ప్రజాస్వామిక లక్షణం. ఈ దిశగా ప్రజాస్వామ్యం పరిణతి చెందటానికి దోహదం చేయకుండా, ఇంకా బలహీనపరిచే విధంగా వ్యవహరిస్తూ వ్యక్తి చుట్టూ కేంద్రీకరించటం రాజకీయ తిరోగమనమవుతుంది తప్ప పురోగమనమవదు. ప్రజాస్వామ్యంలో అనివార్యంగా ఉండాల్సిన లక్షణం అధికార వికేంద్రీకరణ, మానవ వికాసంలో మున్ముందు చోటు చేసుకోబోయే పరిణామాలకు వెసులుబాటు ఉండే విధానాలను అమలు చేయటం! కానీ నియంతృత్వ, మత ఛాందస దేశాల్లో కంటే కూడా ఎక్కువగా ప్రజాస్వామిక భారతంలో అధికారాన్ని కేంద్రీకరించే పనిని మోదీ గతం కంటే పెద్దస్థాయిలో కొనసాగించారు. రాష్ట్రాల పరిధిలోని అంశాలపై కూడా ఫెడరల్ స్ఫూర్తికి విరుద్ధంగా ఆధిపత్యం చెలాయిస్తున్నారు. 2014 ఎన్నికల ప్రచార సమయంలో తాను గుర్తించిన బహుళత్వ భావనను ఆ తర్వాత స్పష్టమైన మెజారిటీతో అధికారంలోకి రావటంతో విస్మరించటానికే మొగ్గు చూపారు.

ఈ కేంద్రీకరణ వల్ల ఆయన చేసిన కొన్ని మంచి పనులు కూడా మరుగునపడ్డాయి. ప్రధాని అయ్యాక ఏవైనా ప్రకటనలు చదవటానికి తప్ప మీడియా సమావేశాల్లో మోదీ పాల్గొనకపోయినా, మీడియాను అధికార పక్షానికి అనుగుణంగా ప్రభావితం చేస్తున్నారనటానికి అనేక ఆధారాలున్నాయి. కానీ అంత మీడియా బలాన్ని సమకూర్చుకున్నా కూడా.. సరైన చర్చ లేకుండా, సంబంధిత వర్గాలందరినీ స్థూలంగానైనా విశ్వాసంలోకి తీసుకోకుండా ఆయన ప్రభుత్వం ఏకపక్షంగా తీసుకురావటం వల్ల కొన్ని మంచి చట్టాలు ప్రజల్లోకి సరిగా వెళ్లలేదు. ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ ఎప్పటి నుంచో చెబుతున్న కొన్ని అంశాలతో 2020లో నూతన జాతీయ విద్యావిధానాన్ని, వ్యవసాయ చట్టాల్లో మార్పుల్ని మోదీ ప్రభుత్వం తీసుకొచ్చింది. కానీ ఆ విద్యావిధానంలో ఏముందో, ఆ విధానం అమలుకు ఎటువంటి విధివిధానాలు అవసరమో, కొవిడ్ సంక్షోభాన్ని అధిగమించి డిజిటల్ బోధన, అభ్యాసానికి ఆ విధానాన్ని ఎలా ఉపయోగించుకోవాలో పెద్దగా చర్చే లేదు. ఉపాధ్యాయుల్లోనూ అయోమయం నెలకొంది. సర్కారు వారికి తీరినప్పుడు శిక్షణా కార్యక్రమాలను, అది కూడా మొక్కుబడిగా నిర్వహిస్తున్నారు. డిజిటల్ సన్నద్ధత పట్ల ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల విద్యార్థులకు కలిగిన నష్టాల్ని ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ ప్రెస్ (ఓయూపీ) తాజా అధ్యయనం కూడా వెల్లడించింది. అలాగే వ్యవసాయ చట్టాల వల్ల తమకు సంకెళ్లు తొలగి మార్కెట్‌లో కొంత ఆదాయం

పెరుగుతున్నా, ప్రస్తుత ప్రధాన ప్రతిపక్ష పార్టీ గతంలో అధికారంలో ఉన్నప్పుడు అవే మార్పుల్ని తీసుకురావాలని ప్రతిపాదించినా కూడా పలువురు రైతులు ఆ సంస్కరణల్ని వ్యతిరేకించటమో, అనుమానించటమో చేస్తున్నారు, కొన్ని చోట్ల ప్రతిపక్ష పార్టీల మద్దతుతో ఆందోళనలు చేస్తున్నారు. కొన్నాళ్ల తర్వాత ఈ చట్టాలు దేశమంతా ఎలాగోలా అమలవ్వచ్చు, నిరసనల్ని లెక్కచేయని లోహ పురుషుడు మోదీ అన్న గుర్తింపు రావచ్చు.. కానీ దీనివల్ల ఫలితాలు నెమ్మదించటంతోపాటు, కాలక్రమంలో అది మోదీ విశ్వసనీయతకు, రాబోయే కాలంలో మరిన్ని మంచి మార్పుల దిశగా ఆయన సత్సంకల్పాలకు అవరోధంగా మారుతుంది. ఇది తన లక్ష్యాలకు తానే అవరోధంగా మారే స్వీయవిధ్వంసక లక్షణమవుతుంది. ప్రజాస్వామికంగా నచ్చచెబితే ప్రజలు మరీ వ్యతిరేకిస్తారు అనే పరిస్థితి కూడా మన దేశంలో లేదు. ప్రస్తుతం కొవిడ్ వ్యాక్సిన్లు, అంతకుముందు లాక్‌డౌన్లు, పెద్ద నోట్ల రద్దు (డీమానిటైజేషన్) ఇందుకు పెద్ద ఉదాహరణలు.

ప్రభుత్వం ప్రత్యామ్నాయంగా కొత్త నోట్లను వెంటనే సిద్ధం చేయకుండా తమ వద్ద నోట్లు తీసుకుని జీవితాల్ని బజారుపాలు చేసినా కూడా కోట్ల మంది ప్రజలు కిమ్మనకుండా డీమానిటైజేషన్‌కి మద్దతిచ్చారు. నోట్ల కోసం బ్యాంకుల ముందు క్యూలలో నిలబడి కొంతమంది ఉసురు కోల్పోయినా కూడా సహించారు. మోదీ ప్రభుత్వం ఏదో దేశానికి మంచి చేస్తుందేమోనన్న ఆశతో ఎదురుచూశారు. నోట్ల రద్దును అసమర్థంగా అమలు చేసి ఇన్ని కష్టాలకు కారణమైనా, దేశ ఆర్థిక రంగాన్ని కుదేలు చేసినా, అవినీతి అంతం కాకపోయినా మోదీ వైపే ఎక్కువమంది మొగ్గు చూపారు. అలాగే కొవిడ్ కాలంలో శాస్త్రీయ ఆలోచనా ధోరణి లేకుండా, పరిస్థితుల్ని సరిగా మదింపు చేయకుండా గుడ్డిగా కఠిన లాక్‌డౌన్‌ని గంపగుత్తగా, ఉన్నపళంగా అమలు చేసినా, దుర్భర పరిస్థితుల్ని భరించారే తప్ప ప్రజలు ఎదురుతిరిగి ప్రభుత్వాన్ని గద్దె దింపే ప్రయత్నం చేయలేదు. ప్రజాస్వామికంగా ఎంతో పరిపక్వత కలిగిన దేశంగా మనం చెప్పుకునే సంపన్న, విద్యాధిక దేశం అమెరికాలో ప్రభుత్వం ఎంత చెబుతున్నా కొవిడ్ టీకాలను వేసుకోవటానికి అనేకమంది ప్రజలు మొరాయిస్తుండగా, మన దేశంలో మాత్రం అత్యధికశాతం ప్రజలు సరైన చదువు లేకున్నా కూడా ప్రభుత్వం మీద నమ్మకంతో టీకాల్ని వేయించుకున్నారు. తమ జీవితాల్లో ఏమాత్రం మెరుగుదల వచ్చే అవకాశముందన్న ఆశాభావం కనిపించినా పెద్దసంఖ్యలో ఓట్లు వేయటానికి ముందుకొస్తున్నారు. అందువల్ల ఇక్కడ సమస్య ప్రజలు కాదు. వాస్తవానికి ప్రజలు తమకు మేలు చేసే అంశాల్ని వ్యతిరేకించినా కూడా వారికి నచ్చచెప్పి ఒప్పించి అమలు చేయాల్సిన బాధ్యత ఎన్నికైన నాయకత్వానిది. అంత స్థాయి నాయకత్వ సామర్థ్యం కూడా లేదిక్కడ. ప్రజలు ఆకాంక్షించే, ఆమోదం తెలిపే అంశాల్ని కూడా సరైన రీతిలో అమలు చేయలేకపోవటమే ఇక్కడ సమస్య. అలాంటప్పుడు మోదీ ప్రదర్శించినది ఏ స్థాయి నాయకత్వమవుతుంది?

**కొవిడ్ వచ్చాక కూడా సమగ్ర ఆరోగ్య విధానం అమలుకు తాత్సారం**

అలాగే మరో అంశం ఆరోగ్య విధానం. కొవిడ్ రాకముందే దేశానికి అవసరమైన ఆరోగ్య విధానాన్ని డా॥ జేపీ రూపొందించి నీతి ఆయోగ్ ద్వారా మోదీ ప్రభుత్వానికి 2015లో అందజేశారు. అదేదో ఆషామాషీగా రూపొందించినది కాదు. 2005 జాతీయ ఆరోగ్య మిషన్ రూపశిల్పి జేపీ. ఎంతో అధ్యయనంతో ఆయన రూపొందించిన ఆరోగ్య విధానాన్ని యూపీఏ ప్రభుత్వం అరకొరగా అమలు చేసింది. దానికి మూల్యం భారత జాతితోపాటు కాంగ్రెస్ పార్టీ కూడా చెల్లిస్తోంది. అప్పటి ప్రధానమంత్రి డా॥ మన్మోహన్ సింగ్.. ఆర్థిక సంస్కరణలు ప్రవేశపెట్టి 30 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఇటీవల చేసిన ప్రకటనలో ఆ వైఫల్యాన్ని అంగీకరించి దిద్దుబాటుకు పిలుపునిచ్చారు కూడా. జాతీయ ఆరోగ్య మిషన్ నాటి నుంచి ఇప్పటి వరకూ దేశంలోని, విదేశాల్లోని అనుభవాలను క్షుణ్ణంగా అధ్యయనం చేసి, భారతదేశ పరిస్థితులకనుగుణంగా జేపీ 2015లో ఆరోగ్య విధానాన్ని తయారుచేసి మోదీ సర్కారుకు అందించారు. కానీ భారత్ వంటి దేశానికి ఏదోకరకంమైన ఆరోగ్య విధానాన్ని అమలు చేసేయొచ్చన్న నిర్లక్ష్యంతో ఎంత సదుద్దేశమున్నా కూడా ఉదాసీనంగా వ్యవహరించారు. ప్రయివేటు రంగానికి లాభాలు చేకూర్చేలా అసమగ్రమైన ఆయుష్మాన్ భారత్ పథకాన్ని ప్రవేశపెట్టారు. ప్రపంచంలోనే అతి పెద్ద ఆరోగ్య కార్యక్రమం అని ప్రకటించుకోవటానికి తప్ప ఆ బీమా ఆధారిత పథకం భారతదేశ అవసరాలను తీర్చలేదని 2020లో వచ్చిన కొవిడ్ సంక్షోభం నిర్దాక్షిణ్యంగా తెలియచెప్పింది.

ఆరోగ్య రంగం పట్ల మన దృక్పథం, అవగాహన ఎంత లోపభూయిష్టంగా ఉన్నాయో కొవిడ్‌ను ఎదుర్కొనే విషయంలో కూడా తేటతెల్లమవుతూ వచ్చింది. జేపీ లాంటి వాళ్లు చెబుతున్నా కఠిన, గుండుగుత్త లాక్‌డౌన్లు విధించటం, టీకాలకు ముందుగా ఒప్పందాలు కుదుర్చుకోకపోవటం, రెండో అలకు సన్నద్ధం కాకపోవటం వంటి తప్పిదాల్ని ప్రభుత్వం చేసింది. దీనికి కోట్ల మంది భారీ మూల్యం చెల్లించారు. కరోనాలో కొత్త ఉత్పరివర్తనం వల్ల ముప్పు పొంచి ఉందని కొవిడ్ రెండో ఉధృతికి చాలా ముందుగానే శాస్త్రవేత్తలు హెచ్చరించినా రాజకీయ జోక్యం వల్ల భారత వైద్య పరిశోధన మండలి (ఐసీఎంఆర్) ఆ విషయాలను కప్పిపుచ్చిందంటూ విశ్వసనీయ వార్తలు వెలువడ్డాయి. తొలి దశ కరోనా సమయంలో కఠిన లాక్‌డౌన్‌తో మందగించిన దేశ ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టటంతోపాటు రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికల ప్రచారానికి మార్గం సుగమం చేసుకోవాలన్న ప్రధాని నరేంద్ర మోదీ ఆకాంక్షలకు అనుగుణంగా ఐసీఎంఆర్ ఆ సమాచారాన్ని వక్రీకరించిందని 'న్యూయార్క్ టైమ్స్' వార్తాకథనం పేర్కొంది. కరోనాపై విజయం సాధించామంటూ అప్పటి యూనియన్

వైద్య ఆరోగ్య శాఖ మాజీ మంత్రి హర్షవర్ధన్ చేసిన ప్రకటనను గుర్తు చేసింది. ఈ మొత్తం వ్యవహారంలో ఐసీఎంఆర్ సీనియర్ అధికారుల తీరునూ తప్పు పట్టింది. వ్యాధి నిరోధకత వ్యాప్తిని అంచనా వేయటానికి జరిపే సీరో సర్వే ఫలితాలను కూడా ప్రభుత్వ అభిమతానికి అనుగుణంగా వక్రీకరించారని కథనం తెలిపింది. నిరర్థకమని తెలిసినా రకరకాల చికిత్సా పద్ధతులను, ఔషధాలను కూడా కొవిడ్ కాలంలో భారత్‌లో యధేచ్ఛగా వాడారని గతంలో ఐసీఎంఆర్‌తో కలిసిపనిచేసిన శాస్త్రవేత్తలను ఉటంకిస్తూ పత్రిక పేర్కొంది. ఈ వార్తలపై కనీస అంతర్మథనం ప్రభుత్వం వైపు నుంచీ జరిగిందా? రాజును మించి రాజభక్తిని అధికారులు ప్రదర్శించటం వల్ల ఎంత నష్టం జరిగిందో గుర్తించాకైనా ప్రధాని విచారణకు ఆదేశించారా? నోట్ల రద్దు వల్ల ఎన్ని ఉద్యోగాలు పోయాయో, సామాన్య, మధ్యతరగతి ప్రజలు ఎంత కష్టనష్టాల పాలయ్యారో చూశాక కూడా ఈ అంతర్మథనం లేకుంటే అది ఎంత అప్రజాస్వామిక పాలనవుతుంది! అధికారులు ప్రజాసేవకులుగా తమ బాధ్యతల్ని నిర్వర్తించకపోయినా తనకు అనుగుణంగా వ్యవహరిస్తే ప్రధాని రక్షిస్తారనే భరోసా ఉండబట్టే.. న్యూయార్క్ టైమ్స్ కథనాన్ని నీతి ఆయోగ్ సభ్యుడు వి.కె పాల్ 'అసందర్భ, అవాంఛిత కథనం'గా అభివర్ణించారు. కొవిడ్‌ను నియంత్రించటంలో భారత్ సాధిస్తున్న విజయాల నుండి దృష్టి మళ్లించేలా ఈ కథనం ఉందని ఐసీఎంఆర్ డైరెక్టర్ జనరల్ బలరామ్ భార్గవ అన్నారు. ఇప్పటికైనా ప్రధాని మోదీ ఆరోగ్య రంగంపై లోతైన ఆలోచన చేయాలి. ఆధునిక ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రభుత్వం చేయాల్సిన ఒక మౌలిక బాధ్యత పట్ల తన వైఫల్యాన్ని సరిదిద్దుకోవాలి.

కొవిడ్ తర్వాత ప్రజల నుండి ఆరోగ్యం కోసం వస్తున్న భారీ డిమాండ్‌ను అవకాశంగా మలచుకుని 2021లో తాజాగా ఒక సమగ్ర ఆరోగ్య విధానాన్ని జేపీ రూపొందించారు. దీని ద్వారా ప్రజలకు ఎటువంటి ఆర్థికభారం అందరికీ ఆరోగ్యాన్ని అందించవచ్చు. ఇందుకోసం ప్రభుత్వానికయ్యే వ్యయం జీడీపీలో అదనంగా 0.5 శాతం వరకు మాత్రమే. ఈ ఖర్చుతో కలుపుకున్నా కూడా ప్రపంచంలో ఆరోగ్యానికి అతితక్కువ ఖర్చు చేసే పెద్ద దేశం భారత్ మాత్రమే అవుతుంది. అందరికీ ఆరోగ్యాన్ని అందించే ఈ సమగ్ర ఆరోగ్య విధానం పుస్తకాన్ని ఇప్పటికే ప్రధానికి జేపీ అందించారు. ఈ విధానాన్ని అమలు చేస్తే ప్రజలకు ఎంతో మేలు జరగటమే కాకుండా, మోదీకి ఎన్నికల్లో ఓట్లు కూడా లభిస్తాయనటంలో సందేహం లేదు.

**చట్టబద్ధపాలన పట్ల ఉదాసీనత**

ఇక మోదీపై తరచూ విమర్శలకు కారణమవుతున్న మరో అంశం చట్టబద్ధపాలన వైఫల్యం. ఉక్కునాయకుడిలా కనిపించాలని ఉబలాటపడే నేత ముందు చట్టబద్ధపాలనను సక్రమంగా అమలు చేయాలి. పూర్వకాలంలో చక్రవర్తులు కూడా తమ బలానికి చిహ్నంగా, కీర్తిప్రతిష్ఠలకు అర్హతగా అందరికీ భద్రతను కల్పించటం, న్యాయం అందించటాల్ని పరిగణించేవారు. కానీ ఆధునిక ప్రజాస్వామ్య దశలోకి ప్రవేశించినా కూడా, చట్టం అందరికీ సమానంగా అందించే వ్యవస్థను నిర్మించటంలో పాలకులు విఫలమవుతున్నారు. ఇందుకు చరిత్రాత్మక మెజారిటీతో, అంచనాలతో ఎన్నికైన మోదీ కూడా మినహాయింపు కాకపోవటం విషాదం. రాజకీయ వ్యవస్థ పరిధిలో పనిచేసే పోలీసులు కూడా తమ పాలకులు న్యాయాన్ని పరిరక్షిస్తారన్న అభిప్రాయం ఉంటే విధినిర్వహణలో కొంతయినా ప్రజాసేవకుల్లా వ్యవహరిస్తారు. కానీ ఇప్పటికీ గత ప్రభుత్వాలతో పోలిస్తే భారతదేశంలో పోలీసు వ్యవస్థలో మౌలిక మార్పేమీ రాలేదు. వ్యవస్థ ఎలా ఉన్నా నిజాయతీగా, నిబద్ధతతో పనిచేసే కొంతమందిని మినహాయిస్తే, మిగిలినవారు పోలీజు జులుం, వసూళ్లలో భాగంగానే కొనసాగుతున్నారు. కొవిడ్ లాక్‌డౌన్ సమయంలో పోలీసుల తీరు చూశాకైనా ప్రభుత్వం సంస్కరణలకు చురుగ్గా ప్రయత్నించటం లేదు. ఇంత సమాచార వ్యవస్థ అందుబాటులో ఉన్నా కూడా.. నిషేధించిన చట్ట నిబంధనలతో కేసులు పెట్టటం పోలీసులు మానలేదు. ఇందుకు ఒక సమాజంగా రాజ్యాంగ ప్రజాస్వామిక వ్యవహారశైలికి మనం ఇంకా ఎదగకపోవటం కూడా ఒక కారణమైనప్పటికీ, పోలీసు వ్యవస్థ నిర్మాణంలో అప్రజాస్వామిక ధోరణులు కొనసాగుతుండటం ఇంకా పెద్ద కారణం. అందువల్ల ముందుగా పోలీసు వ్యవస్థను సంస్కరించాలి. పోలీసుల్లో నేర పరిశోధనా విభాగాన్ని శాంతి భద్రతల విభాగం నుంచి వేరు చేసి, స్వతంత్ర ప్రతిపత్తి, మౌలిక వసతులు, జవాబుదారీతనంతో నేర దర్యాప్తు సంస్థను ప్రత్యేకంగా ఏర్పాటు చేయాలి. మూడేళ్ల జైలుశిక్షకు అవకాశమున్న నేరాలన్నిటినీ ఈ సంస్థ పరిధిలోకి తేవాలి. జిల్లా స్థాయిలో బలమైన, స్వతంత్రమైన ప్రాసిక్యూషన్ వ్యవస్థను ఏర్పాటు చేయాలి. ఈ ఏడాదే హైదరాబాద్‌లో ఎఫ్‌డీఆర్, లోక్‌సత్తా నిర్వహించిన సదస్సులో చట్టబద్ధపాలనకు నిర్దిష్ట పరిష్కారాలను పలువురు అత్యున్నత స్థాయి నిష్ణాతులతో తొమ్మిది రోజుల చర్చల అనంతరం వెలువరించారు. ప్రజాస్వామ్యానికి మూలస్తంభాలైన శాంతి భద్రతల్ని, సమన్యాయాన్ని కాగితాల నుంచి కార్యాచరణలోకి తీసుకొచ్చి ప్రజలందరికీ అందించేందుకు కావలసిన ఏర్పాట్లు ఇందులో ఉన్నాయి. ఇవేవీ పెద్ద ఖర్చుతో కూడుకున్నవి కావు, అదేసమయంలో వెంటనే అమలు చేయగలిగినవి. ఈ వివరాలను కూడా మోదీ ప్రభుత్వానికి అందించారు. చట్టబద్ధపాలన అమలు వల్ల మన ఆర్థిక వ్యవస్థకూ ఎంతో లబ్ధి చేకూరుతుంది. పెట్టుబడులు పెరుగుతాయి, ఉపాధి అవకాశాలు అందుబాటులోకి వస్తాయి, ఫలితంగా నల్లడబ్బు అవసరం లేకుండానే ఎన్నికల్లో మోదీ పార్టీకి ఓట్లు కూడా వస్తాయి.

**అవినీతి నియంత్రణ మాటలపై విశ్వాసం కోల్పోయిన ప్రజలు**

మోదీపై భారత ప్రజానీకం ఎంతో ఆశపెట్టుకున్న కీలకాంశం అవినీతి నియంత్రణ. ప్రజలు ఎంతో బలంగా మోదీకి అండగా నిలిచినా కూడా అవినీతిని నియంత్రించటానికి

చిత్తశుద్ధితో, అవగాహనతో ఆయన చర్యలు తీసుకోవటం లేదని ఈ ఏడేళ్ల అనంతరం చాలా స్పష్టంగా అర్థమవుతోంది. నల్లడబ్బును వెనక్కి రప్పిస్తానని, అంతం చేస్తానని 2014లో గద్దెనెక్కిన మోదీ.. ఆ తర్వాత డీమానిటైజేషన్ సమయంలోనూ అదే మాట చెప్పారు. అవినీతిని అంతం చేయటానికే ఈ సాహసోపేత చర్య అన్నారు. ఆ తర్వాత కూడా ఈ రకమైన మాటల్నే వివిధ సందర్భాల్లో వల్లిస్తూ వచ్చారు. చివరికి 2021 అక్టోబర్‌లో నిఘా, దర్యాప్తు సంస్థల సమావేశంలో మాట్లాడుతూ, అవినీతిని అంతం చేయగలమనే భరోసాని తన ఏడేళ్ల పాలన అనంతరం దేశంలో తేగలిగామని కొత్త రాగం ఆలపించే ప్రయత్నం చేశారు. అవినీతిని అంతం చేస్తున్నామంటూ ఇప్పటిదాకా చెప్పి, ఏడేళ్ల తర్వాత అవినీతిని అంతం చేయగలమనే భరోసాని కల్పించామని తేల్చేస్తే, అంతకంటే దగా ఉంటుందా? ప్రపంచ అవినీతి సూచీలో 2018లో 78వ స్థానంలో ఉన్న భారతదేశం తాజాగా 86వ స్థానంలో ఉండటంతోపాటు.. ప్రధాని చెబుతున్నట్లు అవినీతి అంతమవుతుందన్న భరోసా కూడా ప్రజల్లో లేదని ఇటీవల సర్వేలు చెబుతున్నాయి. ఏ నాయకుడొచ్చినా అవినీతి అలాగే కొనసాగుతుందని 2020లో నిర్వహించిన ఓ దేశవ్యాప్త సర్వేలో మూడొంతుల మంది అభిప్రాయపడ్డారు. డీమానిటైజేషన్ అమలు తీరును అలా ఉంచితే, ప్రధాని చెబుతున్న లక్ష్యానికి, ప్రజలు పడుతున్న కష్టానికి తగ్గ ఫలితం రావాలంటే.. అవినీతి అంతానికి ఇవిగో ఈ నిర్దిష్ట చర్యలు తీసుకోండని ఆచరణసాధ్యమైన కొన్ని కీలక సూచనల్ని 2016–17లో జయప్రకాష్ నారాయణ్ ప్రధానికి పంపారు. ప్రజల ముందుంచారు. సీబీఐని బలోపేతం చేసి ఎలా జవాబుదారీ చేయాలో అందులో సవివరంగా పేర్కొన్నారు. కానీ ప్రత్యర్థుల మీద నిఘా, దర్యాప్తు సంస్థల్ని అస్త్రాలుగా ఉపయోగించుకుంటూ గొప్ప అవకాశాన్ని వృథా చేశారే తప్ప అవినీతి అంతానికి తగిన చర్యల్ని మాత్రం ప్రధాని తీసుకోలేకపోయారు. పైగా ప్రభుత్వం తనకు హక్కుగా అందించాల్సిన సేవకు గతి లేక లంచం ఇచ్చే సాధారణ పౌరులకు.. అవినీతికి పాల్పడే అధికారుల కంటే కఠినమైన శిక్షను విధించేలా చట్టసవరణ చేశారు. లోక్‌సత్తా ప్రతిపాదించిన 'హక్కుగా పౌర సేవల' చట్టాన్ని ఇంకా నానుస్తున్నారు.

అలాగే నల్లధనాన్ని ఇతర దేశాల నుండి రప్పించే ప్రయత్నం మీద సమయం వృథా చేయటం కన్నా కూడా.. ఇక మీద నల్లధనం దేశం నుండి తరలివెళ్లకుండా చూడటం ముఖ్యమని జేపీ చెప్పారు. భారతదేశం ఇప్పుడిప్పుడే అభివృద్ధి చెందుతోందని, కాబట్టి ఇప్పటి వరకు దేశం నుండి వెళ్లిన డబ్బు కన్నా ఇక ముందు ఎక్కువ డబ్బు వెళ్లే అవకాశముందని హెచ్చరించారు. అయినా ప్రచారార్భాటాల్లో మైమరచిపోయి అవినీతి సొమ్ము దేశం నుండి తరలిపోతున్న మార్గాల్ని అదుపుచేయలేకపోయారు. ప్రత్యర్థి పార్టీల్లో అవినీతిపరులు ఎక్కువ కాబట్టి తన మాటల్ని ప్రజలు నమ్మక తప్పని పరిస్థితి ఉంటుందని .. తన లాంటి వాళ్లు కూడా పట్టించుకోవటం లేదు కాబట్టి ఎన్నికల్లో అవినీతి పెద్ద అంశం కాబోదని ఆయన విశ్వసిస్తూ ప్రజలకు ఉపన్యాసాలిచ్చే ప్రయత్నం చేస్తున్నారు. కానీ ప్రజల్లో ఆలోచనను ఆలస్యం చేయగలరు గానీ అసలు రాకుండా ఆపలేరు. అవినీతిని అంతం చేయటానికి తన హయాంలో పెద్దఎత్తున కృషి జరిగిందని గత నెలలో మోదీ ప్రకటించిన రెండ్రోజుల్లోనే ఓ ప్రముఖ తెలుగు పత్రిక లేఖల కాలమ్‌లో ఒక పాఠకుడు ఇలా రాశారు.. "అవినీతిపరుల భరతం పట్టాల్సిందిగా ప్రధాని నిఘా సంస్థలకు పిలుపునిచ్చారు. నిజానికి ఆ సంస్థల పనితీరు పేలవంగా ఉంది. రాజకీయ జోక్యంతో నేరగాళ్లు తప్పించుకుంటున్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోకుండా, కేసులను సంవత్సరాల తరబడి దర్యాప్తు చేస్తూ ఉండటం తెలిసిందే. ముందుగా ఆయా సంస్థలను బలోపేతం చేయాలి".

**రాజ్యవ్యవస్థ పాత్రను సమగ్రంగా గుర్తించాలి.. ప్రాథమ్యాలు, విధానాలు సరైనవి కావాలి**

ప్రస్తుతమైతే కేవలం ఎన్నికల్లో గెలుపుల్ని చూసుకుంటూ మోదీ తనను తాను ఉన్నతంగా భావిస్తున్నారు. చరిత్రలో మరే నాయకుడికీ లేనంత స్థాయిలో తాను నిలవాలనుకుంటున్నారు. ఆ అవకాశం ఆయనకు ఉందనటంలో సందేహం లేదు. కానీ చరిత్రలో నిలిచిపోవాలంటే అందుకు తగ్గ అర్హతను ఆయన ఇంకా ఎంతో పెంపొందించుకోవాలి. లభిస్తున్న అవకాశాల మధ్య ఆయన ఎంపికలు సక్రమంగా ఉండాలి. ప్రాథమ్యాలు సరైనవి కావాలి. వాటి అమలుకు సరైన విధానాలను రూపొందించుకోవాలి. ఈ క్రమంలో ప్రజలకు తమ ఓటుకు, తమ జీవితాలకు మధ్య సంబంధం అర్థమయ్యే వ్యవస్థను మోదీ ప్రభుత్వం నిర్మించాలి, ఇందుకోసం అసలు రాజ్యవ్యవస్థ పాత్ర ఏమిటో సమగ్రంగా అర్థం చేసుకోవాలి. వ్యాపారం చేయటం ప్రభుత్వం పని కాదు అనే స్పృహ ఇటీవలికాలంలో ఆయన సర్కారులో కొంత పెరగటం స్వాగతించాల్సిన విషయం. అలాగే మౌలిక వసతుల నిర్మాణానికి రూ.100 లక్షల కోట్లతో 'గతిశక్తి' ప్రయత్నం ఎంతో అవసరమైనది. వీటిని క్షేత్రస్థాయిలో సక్రమంగా అమలు చేయాలన్న విషయాన్ని అలా ఉంచితే.. ఈ పెద్ద ముందడుగులు చాలవు. ఆధునిక ప్రజాస్వామ్యంలో రాజ్యవ్యవస్థ చేయాల్సిన నాణ్యమైన ఆరోగ్యం, విద్య, ఉపాధి అవకాశాలకు చర్యలు, చట్టబద్ధపాలన, రాష్ట్రాలకు మరిన్ని అధికారాలనిస్తూ స్థానిక ప్రభుత్వాలకు సాధికారతతో ఫెడరలిజాన్ని బలోపేతం చేయటం, అవినీతిరహిత సేవలు తదితర అంశాలపై సమగ్ర కృషి చేయాలి.

**విత్తు ముందా, చెట్టు ముందా మీమాంస అక్కర్లా..**

**ముఖ్యమంత్రుల ప్రత్యక్ష ఎన్నికతో ఎన్నికల సంస్కరణల్ని అమలు చేసే అవకాశం మోదీ చేతుల్లోనే ఉంది**

అయితే ఒక పార్టీగా గెలిస్తే గదా, ఏమైనా చేయగలిగేది.. గెలుపు కోసం నల్లధనం, ఇతర అడ్డదారులు తప్పవు.. అని

విత్తు ముందా, చెట్టు ముందా తరహా వాదనను వినిపించవచ్చు. ఇందుకు కూడా ఎక్కువ పరిష్కారం మోదీ చేతుల్లోనే ఉంది. మోదీ వ్యక్తిగతంగా అవినీతిపరుడు కాకపోయినా, పార్టీ గెలుపు కోసం మీడియా సహా వివిధ మార్గాల్లో ప్రచారానికి, ముఖ్యంగా రాష్ట్రాల స్థాయిలో ఇతర పార్టీల నేతల కొనుగోలు వంటి పనులకు లెక్కలేనంత నల్లధనాన్ని లెక్కలు చూపకుండా ఖర్చు చేయటం లేదని గుండె మీద చేయి వేసుకుని చెప్పలేరు (మోదీ పార్టీకి 2019-20లో అధికారికంగా వచ్చిన విరాళం రూ.785.77 కోట్లు మాత్రమే. రాజకీయ పార్టీల విరాళాల చట్టాన్ని బలోపేతం చేయకుండా ఇంకా అధ్వాన్నంగా మార్చటం ద్వారా కూడా ఆయన పార్టీ లబ్ధి పొందుతోంది). 2016-2020 మధ్యకాలంలో పార్టీలు మారిన ఎమ్మెల్యేలలో అత్యధిక శాతం బీజేపీలోనే చేరారు. నిజాయతీ విలువ తెలిసిన మోదీ ఈ పరిస్థితిని తప్పనిసరిగా ఏమీ భరించనక్కర్లేదు. ఎన్నికల్లో డబ్బు వ్యయాన్ని కట్టడి చేయటానికి ఆచరణసాధ్యమైన సంస్కరణల్ని తీసుకురావాలి. రాజకీయం ఎక్కువగా ఉండే రాష్ట్రాల్లో ముఖ్యమంత్రుల్ని ప్రత్యక్షంగా ఎన్నుకునే ఏర్పాటు చేసి ఎమ్మెల్యేల మీద ఆధారపడకుండా చేస్తే, ఇంతలా నల్లడబ్బుని వెచ్చించాల్సిన అవసరముండదు. ముఖ్యమంత్రి అభ్యర్థి మొత్తం రాష్ట్రంలో ఓట్ల కొనుగోలు చేయటం కష్టం కాబట్టి.. డబ్బు కన్నా అభ్యర్థుల చరిత్ర, పార్టీల విధానాలు వంటివి ఎక్కువ ప్రాధాన్యత వహిస్తాయి. ఎమ్మెల్యేల మీద ఆధారపడాల్సిన అవసరం ఉండదు కాబట్టి.. నేర రాజకీయాలు, పాలనా యంత్రాంగంలో పైరవీలు, అవినీతి లేకుండా నిజమైన ప్రజాప్రయోజనాల చుట్టూ ముఖ్యమంత్రి పాలన చేసే అవకాశాలు ఉంటాయి. ఎమ్మెల్యేలు కూడా తమకు ఒక పరిధి దాటి అధికారం ఉండదు కాబట్టి ఆ ఎన్నిక కోసం అంతగా డబ్బు వెచ్చించరు, పైరవీలకు పాల్పడరు. ముఖ్యమంత్రి మంచి పాలనకు.. ఎమ్మెల్యేలు చట్టసభలో సరైన శాసనాలు చేయటానికి, ముఖ్యమంత్రిని జవాబుదారీ చేయటానికి కృషి చేస్తారు. ఇలాంటి పరిస్థితుల్లో సమర్థులు, నిజాయతీపరులు ఎన్నికల్లో పోటీ చేసే అవకాశాలు పెరుగుతాయి. నల్లడబ్బు విరాళాలకు ప్రయివేటు, కార్పొరేట్ శక్తుల దురాశకు తలొగ్గాల్సిన పనుండదు.

**ఎఫ్ఆర్‌బీఎం తరహాలో తాయిలాల పరిమితికి కూడా చట్టం తేవాలి**

ఈ రకమైన మార్పులతోపాటు.. ప్రజల్ని ప్రలోభపెట్టటానికి బరితెగించి తాయిలాలను హామీ ఇవ్వటానికి కళ్లెం వేసేందుకు ఎఫ్ఆర్‌బీఎం తరహాలో తాత్కాలిక తాయిలాల పరిధిపై కూడా చట్టాన్ని తీసుకురావాలి.

ఇవి ఎన్నికల వ్యవస్థను మెరుగుపరిచి ప్రజాస్వామ్యాన్ని పటిష్టపరుస్తాయి, ప్రజల జీవితాల్ని ఉన్నతీకరిస్తాయి. ఎక్కడికక్కడ కొత్త నాయకులు యువత నుండి రావటానికి, భారతదేశ సమస్యలకు పరిష్కారాలు వేగంగా అమలవటానికి దోహదం చేస్తాయి. వాస్తవానికి ఆరోగ్యం, విద్య వంటి మౌలిక రంగాల్లో మార్పుల్ని ఎన్నికల సంస్కరణలతో సంబంధం లేకుండానే ప్రభుత్వ, ప్రయివేటు భాగస్వామ్యంతో తీసుకొచ్చేయచ్చు. ఈ రాజకీయ సంకల్పాన్ని, నాయకత్వ సామర్థ్యాన్ని ప్రదర్శిస్తే.. ఎన్నికల్లో నల్లడబ్బు విరాళాల ద్వారా వచ్చే ఓట్ల కన్నా కూడా ఎక్కువ ఓట్లు లభిస్తాయి.

**ప్రజాస్వామికతపై ఇంకొంత..**

ఇక ప్రజాస్వామ్యం పట్ల తనకు చెరగని విశ్వాసం ఉందని చెప్పుకోవటానికి, తన పాలన ఎంతో ప్రజాస్వామ్యయుతంగా ఉందని చాటుకోవటానికి మోదీ రకరకాలుగా ప్రయత్నిస్తున్న నేపథ్యంలో ఆ అంశం గురించి కొంత ప్రత్యేకించి మాట్లాడుకోవటం అవసరం.

ఇటీవల యూనియన్ హోం మంత్రి అమిత్ షా మోదీ గురించి చెబుతూ, మోదీ అందరూ చెప్పేది ఓపిగ్గా విన్నాకే నిర్ణయాలు తీసుకుంటారని, కేబినెట్‌లో చర్చించాకే సరైన నిర్ణయం తీసుకుంటారని అన్నారు. ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని ఎంతో గౌరవించే వ్యక్తిగా మోదీని చూపేందుకు ఆయన ప్రత్యేకంగా ఆసక్తి చూపారు. కానీ ఐక్యరాజ్యసమితిలో మోదీ చెప్పినా, సనసద్ టీవీలో అమిత్‌షా చెప్పినా ప్రజాస్వామ్యం వ్యక్తుల అలవాట్ల మీద ఆధారపడి ఉండదు. ప్రజల రోజువారీ జీవితం, ఆ క్రమంలో వ్యవస్థలు వ్యవహరిస్తున్న తీరు వంటి అంశాల ద్వారా వ్యక్తమవుతుంటుంది. బలమైన నేతకి, నిరంకుశ నేతకు మధ్య తేడా మోదీ విషయంలో కనిపించని పరిస్థితులు ఎందుకొచ్చాయో ఆత్మవిమర్శ చేసుకోవాలి. ప్రజాస్వామ్యానికి తీవ్ర హానిచేస్తూ ప్రజలను భయాందోళనల్లోకి నెట్టే అనేక అంశాలపై ఎందుకు ప్రధాని స్పందించలేకపోయారో చెప్పాలి. అంతకుముందు దేశంలో హిందూత్వ పేరుతో జరిగిన భౌతికదాడులపై సకాలంలో, సరైన రీతిలో స్పందించిన దాఖలాలు లేవు. చివరికి స్వదేశీ పాలనలో ఏ రకంగానూ జరగకూడని రీతిలో ఈమధ్య చోటుచేసుకున్న లఖింపూర్ ఖేరి ఘటనపై కూడా మోదీ వెంటనే స్పందించి జాతికి సమాధానం చెప్పలేకపోయారు. నిందితుడ్ని అరెస్టు చేయటానికి సుప్రీంకోర్టు కూడా చొరవ తీసుకోవాల్సి వచ్చింది. ఈ నేరాల్లో తప్పు ఎవరి పక్షానయినా ఉండి ఉండవచ్చు.. కానీ ఆయా సమస్యలపై బాధితుల ఘోషను వినాల్సిన, పరిష్కారాల్ని సత్వరం అందించే వ్యవస్థలు అందుబాటులో ఉండేలా చూడాల్సిన బాధ్యత అతిపెద్ద ప్రజాస్వామ్య దేశానికి ప్రధానిగా ఆయన మీద ఉంది. ఆయా ఘటనలపై తగిన వివరణ ఇచ్చి చట్టబద్ధపాలన అమలుపై తన భావజాల అనుచరులు సహా అందరికీ గట్టి హెచ్చరిక చేయాల్సిన బాధ్యత ఆయనకుంది. ఆయన పార్టీ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో చట్టబద్ధపాలనకు తీవ్ర సవాలు విసిరినవారిపై కూడా పక్షపాత రాజకీయాలతో వ్యవహరిస్తున్నా మోదీ స్పందించలేదు. తన పార్టీకి అనుకూలంగా ఉన్నవారిపై ఎన్ని కేసులున్నా కాలయాపన చేయటం, ప్రత్యర్థులపై నిఘా సంస్థలతో దాడులు చేయించటం ఒక ఒరవడిలా ఆయన

పాలనలో కనిపిస్తుంది. నేర చరిత్ర కలవారిని హోం శాఖ సహా పదవుల్లోకి తీసుకోవటంతోపాటు, వారు పదవుల్లో ఉన్నాక కూడా నేర సంస్కృతిని ప్రదర్శిస్తుంటే, వారి కుటుంబ సభ్యులు నేరాలకు పాల్పడుతుంటే పక్షపాత రాజకీయాల కోసం మౌనం వహించటం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తుంది. పార్లమెంటులో చర్చలు, లోక్‌పాల్, రిజర్వుబ్యాంకు, 'కాగ్', న్యాయమూర్తుల నియామకాలు, గణాంక విభాగం, చివరికి ఎన్నికల సంఘం విషయాల్లో మోదీ ప్రభుత్వ వ్యవహారశైలి వ్యవస్థల్ని బలహీన పరిచేలా ఉంది. ఇవన్నీ మోదీని ప్రజాస్వామి కవాదిగా చూపించటానికి అవరోధాలయ్యే ధోరణులు. భారత దేశంలో ప్రజాస్వామ్యం స్థాయి నాసిరకంగా ఉందని ప్రపంచ స్థాయి అధ్యయనాలు చెబుతున్నాయంటే, వాటిని పూర్తిగా అభూతకల్పనలని, కుట్రలని తోసిపారేయలేం. ఆ రకమైన నివేదికలకు తగిన భూమికను ఇవన్నీ సమకూరుస్తున్నాయి.

అలాగే కొవిడ్ కాలంలో ప్రజలకు సాయమందించేందుకు మానవత్వంతో పలువురు ముందుకొచ్చినా కూడా వారిలో స్ఫూర్తిని నింపి ప్రోత్సహించకుండా, ప్రజల సాధికారతకు పెద్దపీట వేయకుండా 'ప్రజల కంటే ప్రభుత్వమే ముందు' అనే ధోరణితో ప్రధానమంత్రి వ్యవహరించారు. 'పీఎం కేర్స్' ఫండ్ పేరుతో అనధికారికంగా నిధిని ఏర్పాటు చేసి అధికారాన్ని ఉపయోగించుకుని పారిశ్రామికవేత్తలు, ఇతర సంపన్నుల నుండి భారీఎత్తున నిధుల్ని వసూలు చేశారు. ప్రభుత్వం కంటే ప్రజలే మిన్న అని భావిస్తే.. ప్రజలు ఇచ్చే దాతృత్వ విరాళాలకే పన్ను రాయితీని మోదీ ప్రభుత్వం కల్పించి ఉండేది. ఇలా కల్పిస్తే, ప్రభుత్వం కంటే అనేక రెట్లు సాటి మనుషుల నుండి ప్రజలకు సాయం అందుతుంది. కానీ ఆ రకమైన ప్రజాస్వామిక దృష్టిని మోదీ ప్రభుత్వం ప్రదర్శించలేదు. సరికదా.. అలా దాతృత్వ సేవలను అందించే వారి మీద కూడా రాజకీయ కారణాలతో అక్రమాస్తుల వంకలతో దాడులు జరిగాయి. ఇది ఏ రకమైన ప్రజాస్వామ్యం అవుతుంది? దేశం 100 కోట్ల టీకా డోసుల మైలురాయిని దాటిన సందర్భంగా పత్రికలకు రాసిన ఓ వ్యాసంలో " 'టీం ఇండియా' బృంద స్ఫూర్తితోనే మన దేశం వేగంగా ముందడుగు వేస్తోందని 2015లో స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలోనే స్పష్టం చేశాను. ఆ టీం ఇండియాలో 130 కోట్ల మంది భారతీయులూ సభ్యులే. ప్రజా భాగస్వామ్యమే ప్రజాస్వామ్యానికి అతిపెద్ద బలం. అలా– 130 కోట్లమందినీ భాగస్వాములుగా చేసి దేశాన్ని ముందుకు నడిపిస్తే, ప్రతి క్షణం 130 కోట్ల అడుగులు ముందుకేస్తుంది. మన టీకాల కార్యక్రమం టీం ఇండియా బృంద స్ఫూర్తిని, సత్తాను మరోసారి ఘనంగా చాటింది. ఇలాంటి విజయం ప్రజాస్వామ్య వ్యవస్థలోనే సాధ్యపడుతుందని మొత్తం ప్రపంచానికి చాటి చెప్పింది" అని మోదీ రాశారు గానీ.. ఆచరణ మాత్రం అందుకు తగినట్లు లేదు.

ఇక ఒక ప్రజాస్వామిక వ్యవస్థలో అత్యున్నత స్థాయి అధికార స్థానంలో ఉన్న ప్రధాని ఎంత పారదర్శకంగా ఉండాలి! కానీ పాలనలో పాలనా సమాచార హక్కును నీరుగార్చటం నుంచి కొవిడ్‌ను ఎదుర్కోవటం, పీఎం కేర్స్ ఫండ్ నిర్వహణ వరకూ అంతా రహస్యానికి, ఏకపక్ష ధోరణులకే ప్రాధాన్యం. బొగ్గు నిల్వల గురించి కూడా వాస్తవాలు బయటకు చెప్పకుండా దాటవేతలు! ఒకవైపు ప్రభుత్వం వైపు నుండి విధిగా అందించాల్సిన సమాచారాన్ని నియంత్రిస్తూ, మరోవైపు గోప్యంగా ఉండాల్సిన ప్రజల సమాచారాన్ని సేకరించటం మాత్రం ముమ్మరంగా కానిచ్చేస్తున్నారు. చివరికి స్వతంత్ర ప్రతిపత్తి గల న్యాయవ్యవస్థపై కూడా నిఘా ఏర్పాటు చేసినట్లు విశ్వసనీయ ఆరోపణలు వచ్చాయి. ఉన్నత న్యాయస్థానాల్లో న్యాయమూర్తుల నియామకంలో పారదర్శకత కోసం ప్రజాస్వామ్య పీఠం, లోక్‌సత్తా కృషితో వచ్చిన 'జాతీయ జ్యుడీషియల్ అపాయింట్‌మెంట్స్ కమిషన్' (ఎన్‌జేఏసీ) బిల్లు యూపీయే హయాంలో రూపొందినా, ఆ రాజ్యాంగ సవరణను పార్లమెంటు ఆమోదం పొందింది మాత్రం మోదీ హయాంలోనే. 2014లో మోదీ సర్కారు ఎన్నికయ్యాక మొదట ఆమోదించిన బిల్లు అదే. ఆ తర్వాత పలు రాష్ట్రాల అసెంబ్లీలు కూడా వేగంగా ఆ సవరణను ధృవీకరించాయి. అలాంటి మోదీ ప్రభుత్వం ఆ తర్వాత న్యాయవ్యవస్థ మీద కూడా నిఘా ఏర్పాటు చేయటం విచారకరం. ప్రభుత్వం పారదర్శకత పాటించకుండా, వ్యక్తిగత, వ్యవస్థీకృత గోప్యతల్ని ఉల్లంఘించటం ఏ రకమైన ప్రజాస్వామిక పాలన అవుతుంది?

ప్రధానిగానే కాదు, ప్రజాస్వామ్య రాజకీయాల్లో ఎంతో కీలకమైన పార్టీల్లో ప్రజాస్వామ్య సంస్కృతి పరిరక్షణలో కూడా మోదీ విమర్శను ఎదుర్కోక తప్పదు. మోదీకి ముందు జాతీయ స్థాయిలో బీజేపీ.. మోదీ హయాంలో ఆ పార్టీ మధ్య తేడాని విశ్లేషిస్తే ఈ అంశం తేలిగ్గా అర్థమవుతుంది. మోదీ లేదా ఆయన అనుంగులు చెప్పిన మాట తప్ప భిన్నంగా ఏదీ జరిగే అవకాశాలు పార్టీలో లేవు. ఆయన మాటను ధిక్కరిస్తే ఏం జరుగుతుందో మేనకా గాంధీ, వరుణ్ గాంధీ పట్ల పార్టీ తీరు ఇటీవలి ఉదాహరణలు.

**సాధించిన విజయాలకు, సాధించగలిగిన లక్ష్యాలకు మధ్య అంతరాన్ని అధిగమిస్తేనే..**

కొన్ని అంశాల్లో మోదీ ప్రశంసనీయ కృషి చేశారనటంలో సందేహం లేదు. అలాగే ఇప్పటికీ ఈ దేశంలో అత్యంత ప్రజాదరణ కలిగిన నాయకుడు అనటంలో సందేహం లేదు. కానీ ప్రధానిగా ఏడేళ్ల పాలనలో ఆయన ఏం సాధించారు అంటే.. ఎవరూ నిర్దిష్టంగా ఏమీ చెప్పలేరు. నిరుద్యోగంతో ఉక్కిరి బిక్కిరి అవుతున్న యువత సహా ఎక్కువమంది ఎంతమాత్రం సంతృప్తిని వ్యక్తం చేయలేరు. ప్రతిపక్షాల్లోనివారికన్నా మెరుగు.. అన్నదే ఎక్కువశాతం సమాధానంగా వినవస్తుంది. మోదీ తాను సాధించిన విజయాలుగా ఇటీవలి ఐక్యరాజ్యసమితి సాధారణ సభలో ఏకరువు పెట్టిన యూనిఫైడ్ పేమెంట్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) ద్వారా లావాదేవీలు, తాగునీటి సరఫరా, బ్యాంకింగ్ సేవల

విస్తరణ, ఇళ్ల నిర్మాణం, పేదలకు ఆరోగ్య బీమా, విద్యుత్ సేవలు వంటి అంశాలు జనాభా సంఖ్య రీత్యా మిగతా దేశాలకు విశేషాలు తప్ప.. భారతదేశ వనరులు, అవకాశాలతో పోలిస్తే కాదు. పొరుగున ఉన్న చైనాతో పోల్చి చూసుకుంటే.. ఈ విజయాలన్నీ ఎంత సామాన్యమైనవో అర్థమవుతుంది. అలాగే సమర్థ పాలనకు 60 సూత్రాల పేరుతో విడుదల చేసిన ప్రణాళికలో కూడా సాంకేతిక పరిజ్ఞానాన్ని మరింతగా వినియోగించటమే ప్రధానాంశంగా ఉంది తప్ప మౌలికమైన మార్పులు లేవు. కొన్ని అంశాల్లో సంకల్పాన్ని ప్రదర్శించటంలో, అధికారులను పరిగెత్తించటంలో మోదీ ఎంతో తపనతో వ్యవహరిస్తున్నారు. కానీ వందడుగులు ముందుకెళ్లాల్సిన చోట పది అడుగులు కూడా వేయటం లేదు. కొద్దిమంది వేగంగా ఎదిగేలా, మిగిలినవారు యథాతథ స్థితిలో కొనసాగుతూ కాలంతోపాటు నెమ్మదిగా ఎదిగేలా వ్యవహరిస్తున్నారు. భారతీయ సంస్కృతి అంటే అందరినీ కలిపేది, అందరికీ అండగా నిలిచేది అనుకుంటున్నప్పుడు ఆ పనినే మరింత సమర్థవంతంగా అమలు చేసేందుకు అవకాశం కల్పించే రాజ్యాంగ ప్రజాస్వామ్య సంస్కృతిని పటిష్ఠపరచటానికి వంకలు చూపటం, వాయిదాలు వేయటం ఏ రకమైన రాజనీతిజ్ఞత? అది సమతుల సమాజాన్ని చేజేతులా నిరోధించటం కాదా?



గాంధీజీ తాను మహాత్ముడ్ని కానని నమ్మినా ప్రజలు దేశాలకతీతంగా ఆయన్ను మహాత్ముడిగా భావిస్తున్నారంటే, అందుకు ఆయన వర్తమానాన్ని సుదూర భవిష్యత్తుతో అనుసంధానం చేయటమే అందుకు కారణం. వర్తమానాన్ని గతంతో అనుసంధానం చేస్తూ దీర్ఘదృష్టి లేకుండా తక్షణ, స్వల్పకాలిక అవసరాలకే ఎక్కువ ప్రాధాన్యతనిస్తుంటే ఎన్నికల్లో గెలుపులుంటాయేమో గానీ, చరిత్రలో స్థానం లభించదు. ఐదేళ్లకోసారి ఆలోచనాతీరు మారిపోతున్న ప్రస్తుత వేగమయ ప్రపంచంలో శాశ్వత సత్యాలకు తప్ప చరిత్రలో స్థానం మిగలని రోజులే వస్తాయి. ఏదోకరూపంలో గుర్తింపు పొంది తాత్కాలికంగానైనా చరిత్రలో నిలిచిపోయే అవకాశాన్ని పొందే అదృష్టం గతతరంలో పలువురికి లభించింది. అలాంటి అవకాశాలు ప్రస్తుత కాలంలో, రాబోయే కాలంలో మరింత కష్టమవుతాయి. సందర్భానుసారం తాత్కాలికంగా సెలబ్రిటీలుగా వెలగొచ్చేమోగానీ తప్ప.. గాంధీలా ప్రజాచరిత్రలో శాశ్వతంగా నిలిచేవారు తక్కువగా ఉంటారు. అన్ని కోణాల నుండీ అంత నిశిత పరిశీలన జరుగుతుంది. చరిత్రలో నిలిచిపోయే అవకాశమూ లేక, దేశ చరిత్రలో అరుదైన అవకాశాన్ని సద్వినియోగం చేయని నేతగానూ మచ్చనెదుర్కొంటూ మోదీ చివరికి ఏం సాధించినట్లవుతుంది? ఈ హెచ్చరికను పట్టించుకోకపోతే, ఇప్పుడు ఏ పార్టీ గెలుపుల కోసమైతే తాను ఆరాటపడుతున్నారో, ఆ గెలుపులు కూడా ఆవిరయ్యే పరిస్థితి ఏర్పడుతుంది. దృఢత్వానికి కావలసిన సరైన మేళవింపులేకుండా పెళుసుగా ఉండే కర్రను విరగ్గొట్టటం తేలిక. ఎన్నికల్లో గెలిచినా ఓడినా బీజేపీ ప్రభావం దీర్ఘకాలం కొనసాగే అవకాశాలు ఉన్నాయనటంలో సందేహం లేదు. కానీ ఇందుకు మోదీ నేతృత్వంలోని విజయాల కన్నా ఆ పార్టీ వెనక ఉన్న భావజాల తీవ్రతే ఎక్కువ కారణం. ఆ భావజాలం రాబోయే కాలంలో బీజేపీకి మాత్రమే కాకుండా అదే బాటలో వచ్చే ఇంకో పార్టీకయినా లబ్ధి చేకూర్చే అవకాశం ఉంటుంది. మోదీ విజయాల్లో విధానపరమైన విషయం కూడా ఉన్నట్లయితే, బీజేపీ ఇప్పుడున్నంత వేగంగా విజయాల్ని సాధించకపోయినా, క్రమంగా విజయాల్ని విస్తరించుకున్నా.. కచ్చితంగా ఇప్పటికంటే సుస్థిరంగా ఆ విజయాల్ని నిలబెట్టుకుని ప్రభావవంతంగా మరింత దీర్ఘకాలం కొనసాగే అవకాశముంటుంది. కాబట్టి ఇంకా విషయవాసనల్ని వీడలేని సన్యాసిలా కాకుండా.. తాత్కాలిక లక్ష్యాల వాసనల్ని వీడి నిజమైన రుషిలా మోదీ ఆలోచించాలి. ఈ దేశ భవిష్యత్తు కోసం మౌలిక కృషి చేయాలి. అధికారం లక్ష్యం కాదు, మార్గం మాత్రమే, పార్టీ కన్నా దేశం మిన్న.. అనే మాటల్ని చేతల్లో చూపాలి. ప్రస్తుతానికైతే మోదీ చేస్తున్న కృషికి.. చేయాల్సిన, చేయగలిగిన కృషికి మధ్య ఎంతో అంతరం ఉంది. ఆయన ముందు మరీ ఎక్కువ సమయం లేదు. మోదీ మేలుకుంటారని, ఆర్థిక వృద్ధికి సంస్కరణల్ని వేగవంతం చేస్తూనే అందరికీ నాణ్యమైన ఆరోగ్యాన్ని, విద్యను అందిస్తారని, మూడో అంచె ఫెడరలిజంతో అధికారాన్ని స్థానిక ప్రభుత్వాల వరకూ వికేంద్రీకరిస్తారని, అవినీతిరహితంగా పౌర సేవలకు సంస్థాగత ఏర్పాట్లు చేస్తారని, చట్టబద్ధపాలనను, ఓటుకు-ప్రజల జీవితాలకు సంబంధముండేలా చేసే ఎన్నికల సంస్కరణల్ని, ఇతర కనీస మౌలిక మార్పుల్ని వేగంగా అమల్లోకి తెస్తారని పార్టీలకతీతంగా ఆశిద్దాం.

# కొవిడ్ - వాతావరణ మార్పులు - పట్టణ ప్రాంత జీవనం..

## 'ప్రజల భాగస్వామ్యమున్న స్థానిక సాధికారత, చిన్న పట్టణాల అభివృద్ధి'తో జాతీయ నగరీకరణ విధానం తక్షణావసరం



మన పట్టణ ప్రాంతాల సంక్షోభంపై నిశ్శబ్దాన్ని కొవిడ్ మహమ్మారి కొంత ఛేదించగా, వాతావరణ మార్పులు ఇంకొంత ఛేదించాయి. పట్టణీకరణ వేగంగా జరుగుతూ పట్టణ ప్రాంతాలు దేశానికి ప్రధాన ఆర్థిక వనరుగా రూపుదిద్దుకోవటంతో.. వాటిని పరిరక్షించుకునేందుకు వెంటనే స్పందించకపోతే పొంచి ఉన్న ఉపద్రవాలతో సమీప భవిష్యత్తులోనే జీవితాలు, జీవనోపాధులు దుర్భరమవుతాయని ప్రభుత్వాలు, సమాజం కూడా గుర్తిస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే, ఓ పక్క వాతావరణ మార్పులపై దేశీయ, అంతర్జాతీయ కృషిని ముమ్మరం చేస్తూనే మరోపక్క స్వచ్ఛ భారత్ (పట్టణ), అమృత్ రెండో దశ కార్యక్రమాలను కూడా జాతీయ స్థాయి ప్రభుత్వం ప్రారంభించింది. కానీ ఈ కృషిని ఇంకా మౌలిక సంస్కరణలతో చేయాల్సి ఉందని స్వదేశీ, విదేశీ అనుభవాలు, స్మార్ట్ సిటీల ప్రాజెక్టు పాఠాలు సైతం స్పష్టం చేస్తున్నాయి. పట్టణాల ప్రణాళికలు, స్థానికంగా వాతావరణ మార్పుల్ని నియంత్రించే పద్ధతులలో విధానాలను మరింత సమగ్రంగా రూపొందించటం అవసరం. దీంతోపాటు స్థానిక పాలనలో సమూల మార్పులు తీసుకురావాలి. 74వ రాజ్యాంగ సవరణ తరహాలో మాటల పటాటోపం కాకుండా.. ఫెడరలిజాన్ని మరింత విస్తరించి సమర్థవంతమైన, సాధికారత గల, ప్రజల భాగస్వామ్యమున్న స్థానిక పాలనను అందించేందుకు నిర్దిష్ట సంస్థాగత ఏర్పాట్లు చేయాలి. ప్రజలు పొట్ట చేత పట్టుకుని గతి లేక వలసలు రావాల్సిన అవసరం లేకుండా, నగరాలపై మితిమీరిన భారం పడకుండా చిన్న పట్టణాలను అభివృద్ధి చేయాలి. ఈ రకమైన మార్పులతో, రాష్ట్రాల క్రియాశీల పాత్రతో జాతీయ నగరీకరణ విధానాన్ని అమలు చేయటం తక్షణావసరం.

### సగం పట్టణాల విస్తరణలో ప్రణాళికల్లేవు

ఇల్లు కట్టాలంటేనే ఎన్నో రకాలుగా ఆలోచిస్తాం. నమ్మకమున్నా లేకున్నా వాస్తు వివరాలు తెలుసుకున్నాకే నమూనాను ఖరారు చేస్తాం. అలాంటిది మన రోజువారీ జీవితంలో ఎంతో ముఖ్య పాత్ర పోషించే పట్టణ ప్రణాళికల గురించి మాత్రం పెద్దగా పట్టించుకోం.

దాదాపు ఐదు వేల సంవత్సరాల నాగరికత, సంస్కృతి సంప్రదాయాల గురించి సగర్వంగా చెప్పుకుంటాం. కానీ ఆ నాగరికతలో భాగంగా మన పూర్వీకులు ఎంతో ప్రణాళికా బద్ధంగా నగరాలను నిర్మించారని గుర్తించటానికి ఆసక్తి చూపం.

మన దేశంలో ఎక్కువ శాతం పట్టణాల రూపకల్పనలో ప్రణాళికాబద్ధత తక్కువ. ఆధునిక భారతదేశ యుగం ప్రవేశించాక కూడా.. పట్టణాల విస్తరణలు వ్యక్తిగతానికి, ఉమ్మడి అవసరాలకు మధ్య గీతను చెరిపేస్తూ ఎడాపెడా జరిగాయి. రాజకీయ ఆక్రమణలు పెరిగాక, ఆ క్రమరాహిత్యం మరింత పెరిగింది. అధికారమే పరమావధిగా మారి డబ్బు రాజకీయాలు పెచ్చరిల్లటంతో.. ఎన్నికల్లో ఓట్ల కొనుగోలు, ఎన్నికల మధ్య కార్యకర్తల వ్యవస్థ నిర్వహణ వంటి వాటి కోసం భూకబ్జాలకు పట్టణాలను కల్పతరువులుగా భావించే రాజకీయ సంస్కృతి కొనసాగుతూ వస్తోంది. ప్రజలకు ఆదాయాలు పెరగటానికి, దేశ ఆర్థిక వృద్ధికి పట్టణాలు కీలకం కాబట్టి ఓపక్క పట్టణీకరణ వేగంగా పెరుగుతూనే ఉన్నా, పట్టణాల పట్ల మన దృక్పథంలో నాగరిక ప్రమాణాలు పెరగలేదు. దీంతో కనీస మౌలిక వసతులు కూడా లేకుండా అనేకమంది పేద, దిగువ మధ్యతరగతి వారు దుర్భర జీవితాల్ని గడపటం మన పట్టణీకరణలో భాగంగా మారింది. దేశ పట్టణ ప్రాంతాల్లోని 30% ఇళ్లకు నాలా సదుపాయం లేదని, 65% గృహాలకు ఘనవ్యర్థాల నిర్వహణ మార్గం లేదని, 88% ఇళ్లకు సరైన మురుగునీటి పారుదల లేదని లెక్కలు చెబుతున్నాయి. స్వచ్ఛ భారత్ మిషన్, అమృత్ పథకాల అమలు వల్ల గత ఏడేళ్లలో పట్టణ ప్రాంతాల ముఖచిత్రం మారిందని జాతీయ స్థాయి ప్రభుత్వం అంటున్నా, ప్రజలకు పారిశుద్ధ్యం మెరుగుపడిందని, అన్ని పట్టణాలనూ ఓడీఎఫ్ ఫ్రీగా ప్రకటించగలిగామని, 70% ఘనవ్యర్థాలను శాస్త్రీయంగా శుద్ధి చేయగలుగుతున్నామని చెబుతున్నా.. క్షేత్రస్థాయిలో మాత్రం పరిస్థితి ఇంకా ఎంతో అధ్వాన్నంగానే ఉంది.

పట్టణాల విస్తరణ ఇప్పటికీ ప్రణాళికలు, నిబంధనలు లేకుండానే కొనసాగుతోంది. దేశంలో దాదాపు సగం పట్టణాలు విస్తరణలో బృహత్ ప్రణాళికలను అనుసరించటం లేదని ఇటీవలి నీతి ఆయోగ్ నివేదిక కూడా ఆందోళన వ్యక్తం చేసింది. ఫలితంగా పట్టణాల వృద్ధి, మౌలిక వసతుల కల్పన గురించి ముందస్తుగా అంచనా వేయలేని పరిస్థితి నెలకొందని పేర్కొంది. నగరీకరణకు సంబంధించి ప్రస్తుతం దేశవ్యాప్తంగా ఎదురవుతున్న ఇబ్బందులు,

వాటిని ఎదుర్కొనేందుకు అనుసరించాల్సిన విధానాల గురించి తెలియజేస్తూ "దేశ పట్టణ ప్రణాళిక సామర్థ్యంలో సంస్కరణలు" పేరుతో నీతి ఆయోగ్ ఈ నివేదికను రూపొందించింది.

"పట్టణీకరణకు బృహత్ ప్రణాళిక (మాస్టర్ ప్లాన్) అత్యంత ముఖ్యం. పట్టణాల పరిధిలోని భూ వినియోగం, విస్తరణను ఎప్పుడు ఎలా క్రమబద్ధీకరించాలో అది తెలియచేస్తుంది. కానీ మన దేశంలో సగం పట్టణాలు మాస్టర్ ప్లాన్లు లేకుండానే విస్తరిస్తున్నాయి. కొన్నిచోట్ల ప్రణాళికలున్నా.. వాటి అమలులో సవాళ్లు ఎదురవుతున్నాయి. కోర్టు కేసుల వల్ల జాప్యం జరుగుతోంది. ఆర్థిక ఇబ్బందుల నేపథ్యంలో కొన్నిచోట్ల ముక్కముక్కలుగా ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తున్నారు. దేశవ్యాప్తంగా 7,933 పట్టణ నివాస ప్రాంతాలుండగా.. వాటిలో 65% ప్రాంతాలకు బృహత్ ప్రణాళికలు లేవు. ఫలితంగా విస్తరణ క్రమరహితంగా మారుతోంది" అని నీతి ఆయోగ్ నివేదిక పేర్కొంది.

**భూతాపం పెరుగుదల**

మరోవైపు నగరీకరణ లోపాల వల్ల జనజీవితాన్ని దుర్భరం చేసే, భవిష్యత్తు మనుగడను ప్రమాదంలో పడేసే ప్రతికూల మార్పులు వాతావరణంలో ఎలా చోటు చేసుకుంటున్నాయో పలు అధ్యయనాలు వివరిస్తున్నాయి. భూతాపం పెరగటానికి కారణమైన కార్బన్‌డయాక్సయిడ్, మీథేన్, నైట్రస్ ఆక్సయిడ్ వంటి గ్రీన్‌హౌస్ వాయు ఉద్గారాల విషయంలో పట్టణీకరణే పెద్ద దోషి అని వెల్లడిస్తున్నాయి.

విశ్వవ్యాప్తంగా నగరాలు 75 శాతం కర్బన ఉద్గారాలను వెలువరిస్తున్నాయని అధ్యయనాలు పేర్కొంటున్నాయి. ప్రపంచంలోని 25 మహానగరాలు 52 శాతం ఉద్గారాలకు కారణమవుతున్నాయి. భూఉపరితలంపై రెండు శాతం విస్తీర్ణంలో మాత్రమే ఉన్న నగరాల వల్ల ఏటా మూడు వేల కోట్ల టన్నుల కార్బన్‌డయాక్సయిడ్ వాతావరణంలోకి విడుదల అవుతోందని ఐక్యరాజ్యసమితి పర్యావరణ విభాగం అంచనా వేసింది. నగరాల్లో నానాటికీ పెరుగుతున్న నివాస, వాణిజ్య భవనాలు, ఘన వ్యర్థ పదార్థాలు, రవాణా, విద్యుదుత్పత్తి, వినియోగం, పారిశ్రామికీకరణ, తరిగిపోతున్న వృక్షసంపద, పట్టణాల విస్తరణ, వలసలతో పెరుగుతున్న జనాభా.. గ్రీన్‌హౌస్ వాయు ఉద్గారాలకు ప్రధాన కారకాలు. ఇంధన వనరులను అత్యధికంగా ఉపయోగించుకుంటున్నది నగరాలే. అలాగే కాంక్రీట్‌తో నిర్మించిన భవనాలు కర్బన ఉద్గారాలను అధికంగా వెలువరిస్తాయి. నగరాల్లో రోజూ కోట్ల టన్నుల ఘన, ద్రవ వ్యర్థ పదార్థాలు పోగవుతున్నాయి. వాటిని పునర్వినియోగించటమో, డంపింగ్ యార్డుల్లో తవ్విన పెద్ద గుంతల్లోకి తరలించటమో చేస్తున్నారు. 1990 నుండి 2020 మధ్యకాలంలో భవనాల నుండి వెలువడే ఉద్గారాలు మూడు శాతం మేర పెరిగాయని పరిశోధనలు వెల్లడిస్తున్నాయి (అమెరికా, ఐరోపా దేశాల్లో నివాస భవనాల నుండి వెలువడే ఉద్గారాలు ఆయా దేశాలు విడుదల చేసే మొత్తం ఉద్గారాల్లో 60 శాతానికి సమానం). ఘన వ్యర్థ పదార్థాలు కుళ్లినప్పుడు కార్బన్‌డయాక్సయిడ్, మీథేన్ వంటి గ్రీన్‌హౌస్ వాయువులు ఉత్పత్తి అయి వాతావరణంలోకి విడుదల అవుతాయి. ఘన వ్యర్థ పదార్థాల నిర్వహణ ప్రక్రియ వెలువరించే మొత్తం ఉద్గారాల్లో మీథేన్ 40-70 శాతం, కార్బన్‌డయాక్సయిడ్ 30-60 శాతం దాకా ఉంటాయి. పలు నగరాల్లో రోడ్డు రవాణా ద్వారా వెలువడే ఉద్గారాలు 30 శాతం మేర ఉంటే- రైల్వేలు, జలమార్గాల ఉద్గారాల శాతం 15 వరకు ఉంటుంది. ఈ క్రమంలో భారతీయ నగరాల్లో కూడా పరిస్థితి అధ్వాన్నంగా ఉంది. మన నగరాల్లో భూతాపం తీవ్రంగా ఉంది.

ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) సహా వివిధ అధ్యయన సంస్థలు ఇచ్చిన నివేదికల ప్రకారం.. ప్రపంచంలో అత్యంత కలుషితమైన గాలితో సతమతమవుతున్న 20 నగరాలలో 14 భారత్‌లోనే ఉన్నాయి. 'వరల్డ్ ఎయిర్ క్వాలిటీ రిపోర్ట్ 2020' (ఐక్యూ ఎయిర్) పేరిట ఓ స్విస్ సంస్థ ఈ ఏడాది మార్చిలో విడుదల చేసిన నివేదిక ప్రకారం ప్రపంచవ్యాప్తంగా గుర్తించిన 30 కాలుష్య పీడిత నగరాల్లో 22 భారతదేశంలోనే ఉన్నాయి. వేసవిలో వేడి గాలులతో, వర్షాకాలంలో కుండపోతగా కురిసే అసాధారణ వర్షాలతో నగర ప్రజలు అల్లాడుతున్నారు. సముద్ర మట్టాల పెరుగుదల కారణంగా తీరప్రాంత నగరాలకు ముప్పు పొంచి ఉందని అంతర ప్రభుత్వాల కమిటీ హెచ్చరి స్తోంది. ఏడాదికి 3.7 మి.మీ సముద్రమట్టం పెరుగుతోందని, దీనివల్ల 2100 నాటికి డజను భారతీయ నగరాలు ముంపు ప్రమాదం ఎదుర్కోవలసి ఉంటుందని తెలిపింది. వాతావరణ మార్పులకు దోహదం చేసే అంశాలు, వాటిలో నగరాల పనితీరుపై యూనియన్ గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల శాఖ ఆధ్వర్యంలో అధ్యయనం చేసిన 'క్లైమేట్ స్మార్ట్ సిటీస్ అసెస్‌మెంట్ ఫ్రేమ్‌వర్క్ (సీఎస్‌సీఏఎఫ్) 2.0' ఇటీవల అయిదు ప్రధానాంశాల ప్రాతిపదికన ఒకటి నుంచి అయిదు నక్షత్రాల రేటింగ్ ఇస్తే... దేశంలోని ఏ ఒక్క నగరమూ అయిదు నక్షత్రాల రేటింగ్‌ను అందుకోలేకపోయింది. వాతావరణ మార్పులపై నగరాల నిర్వహణ ఇటీవల కొంత మెరుగుపడుతున్నా ఈ దిశగా సమగ్ర చర్యలకు ఇంకా చాలా దూరం ప్రయాణించాల్సి ఉంది.

**పట్టణాల ప్రణాళికాబద్ధ విస్తరణ, పర్యావరణహితంగా నగరాల నిర్వహణ**

ఈ నేపథ్యంలో, పట్టణాల ప్రణాళికాబద్ధ విస్తరణ, పర్యావరణహితంగా నగరాల నిర్వహణలకు రాజకీయాలకు అతీతంగా అగ్ర ప్రాధాన్యమివ్వటం తక్షణావసరం.

కాలం చెల్లిన క్రమబద్ధీకరణ నిబంధనలను తొలగించి, ముందుచూపుతో ప్రణాళికాబద్ధ నిబంధనలను రూపొందించాలి. భవనాల బైలాస్‌ను పటిష్ఠపరచాలి. పట్టణ భూమిని గరిష్ట స్థాయిలో వినియోగించుకోవాలి. ఈ మొత్తం ప్రక్రియలో ప్రజల భాగస్వామ్యాన్ని విధిగా తీసుకోవాలి. మొక్కుబడిగా కాకుండా.. స్థానిక ప్రజల అభిప్రాయాలకు, అవగాహన, అనుభవం కలవారి ఆలోచనలకు ప్రాధాన్యతనివ్వాలి. నగరాల విస్తరణను ప్రణాళికాబద్ధం చేస్తూ మౌలిక వసతుల్ని సమగ్రంగా చేపట్టాలి. ప్రకృతి విపత్తులకు కుదేలవకుండా, వర్షమొస్తే మునిగిపోకుండా ఉండాలి. మురుగునీటి పారుదలకు పక్కా ఏర్పాట్లు ఉండాలి. రహదారులపై భద్రతకు, ట్రాఫిక్ జాంలను నివారించేందుకు

చర్యలు తీసుకుంటూ ఆధునిక రవాణా వ్యవస్థకు దారులు పరవాలి.

వలసలు స్థానికులకు ఉపాధి అవకాశాలను దెబ్బతీయకుండానే దేశ ఆర్థిక వృద్ధికి దోహదం చేస్తాయని ఇప్పుడు నిరూపితంగా కూడా వెల్లడైంది. అయితే నగరాల్లో ఆర్థిక కలాపాల వల్ల మెరుగైన ఆదాయాలు లభిస్తున్నా కూడా.. నగరాల్ని వలస కార్మికులు సొంతం చేసుకోలేపోతున్నారు. కొవిడ్ నేపథ్యంలో లాక్‌డౌన్ ప్రకటించినప్పుడు, ఏమాత్రం నగర ప్రాంతాల్లో తమ జీవితం పట్ల భరోసా ఉన్నా వలస కార్మికులు అంత పెద్దఎత్తున, తిరస్కారభావంతో సొంతూళ్లకు మళ్లేవారు కారు. ఏదో నాలుగు డబ్బులు పోగేసుకుని కాస్త సరదాగా గడపటానికి తప్ప మనముంటున్న నగరాలు జీవనయోగ్యం కాదు.. అని వారు నిర్ధారణగా అనుకోబట్టే ప్రాణాలకు తెగించి మరీ తిరుగు వలసలు వెళ్లారు. నగరాలకు తిరిగిరావటం పట్ల వారిలో భయాందోళనలు ఇంకా తొలగిపోలేదు. కాబట్టి వలస కార్మికులు నిశ్చింతగా పనిచేసుకోగలిగేలా అందుబాటులో ఇళ్ల వసతిని కల్పించాలి. తక్కువ ఆదాయం ఉన్నా కూడా ఇంటి యాజమానులు కాగలిగేలా చౌక ఇళ్ల నిర్మాణాన్ని పెద్దఎత్తున చేపట్టాలి. కోట్లాది ఇళ్ల నిర్మాణాన్ని ఆరంభశూరత్వంలా కాకుండా నిరాఘాటంగా, లబ్ధిదారుల భాగస్వామ్యం ఉండేలా కొనసాగించాలి. అలాగే వలస కార్మికులు ఎక్కడ నుంచైనా తమ ఓటుహక్కును వినియోగించుకునేలా, తమకు వర్తించే ప్రభుత్వ పథకాల లబ్ధిని పొందగలిగేలా అన్ని ఏర్పాట్లూ ఉండాలి. ఇందుకోసం ఈ-ఓటింగ్ సహా సాంకేతిక వనరుల్ని ఉపయోగించుకోవాలి. వలస కార్మికులకు ప్రయోజనాల్ని పరిరక్షించటం వల్ల నగరాలకు దీర్ఘకాలంలో చాలా ప్రయోజనాలు సమకూరతాయి. దేశవ్యాప్తంగా కూడా దీన్ని వల్ల పేదరికం తగ్గుతుంది, పౌరుల ఆదాయాలు పెరుగుతాయి, వృద్ధి రేటు ఊపందుకుంటుంది.

అలాగే నగరాల్లో ప్రజలపై ఆర్థిక భారం లేకుండా అందరి ఆరోగ్యానికీ భరోసా తేలిగ్గా లభించేలా వైద్యుల్ని, సదుపాయాల్ని అందుబాటులోకి తేవాలి. ఇందుకోసం ఫ్యామిలీ డాక్టర్ పద్ధతిలో సమగ్ర ప్రజారోగ్య విధానాన్ని అమలు చేయాలి. దీనివల్ల ప్రజలు ఆందోళన చెందకుండా, ప్రతి దానికీ పెద్దాస్పత్రుల వద్దకు పరిగెత్తకుండా ప్రాథమిక అవగాహనతో వైద్యం చేయించుకోగలుగుతారు. జబ్బులు పెరగకుండా ఉంటాయి. ప్రజల ఆదాయ శక్తి పెరుగుతుంది. ప్రతి నగరంలో అంటువ్యాధుల నిర్ధారణ ల్యాబ్‌లను అందుబాటులోకి తేవాలి. గందరగోళం, దోపిడీకి ఆస్కారం లేకుండా భరోసానిచ్చే నాణ్యమైన వైద్యాన్ని ఈ రకంగా అందించటంతోపాటు.. వ్యాధి నివారణ చర్యలకు ప్రాధాన్యత ఇవ్వాలి. కాలుష్య నివారణ, రక్షిత మంచినీరు, దోమల కట్టడి, పారిశుద్ధ్యం, పార్కులు, క్రీడా మైదానాలు మొదలైన లంగ్‌స్పేస్‌ల ఏర్పాటుకు పటిష్ఠ చర్యలు తీసుకుంటే పలు వ్యాధులను నివారించవచ్చు. వీటిపై ప్రజల్లో కూడా అవగాహన పెంచేందుకు మొక్కుబడిగా కాకుండా ప్రణాళికాబద్ధంగా, స్థిరంగా చర్యలు తీసుకోవాలి. ఆరోగ్యకర నగరాల నిర్మాణాన్ని ఒక కాన్సెప్ట్‌గా ఇటీవల నీతి ఆయోగ్ ద్వారా ప్రభుత్వం కూడా ప్రకటించింది. పేరు ఏదైనా కావచ్చు.. ప్రజలందరికీ ఖర్చు లేకుండా సమగ్ర వైద్య సేవలు అందుబాటులోకి రావటం కీలకం.

ఇదే సమయంలో, నాణ్యమైన చదువులు ప్రతి బిడ్డకూ అందుబాటులో ఉండేందుకు తగిన విద్యావసతుల్ని కల్పించాలి. ప్రజల, ముఖ్యంగా మహిళలు, పిల్లలు, దివ్యాంగులు, వృద్ధుల భద్రత, సౌకర్యాలకు ఏర్పాట్లు చేయాలి.
ఇక వాతావరణ మార్పులకు సంబంధించి.

వాతావరణ మార్పులు ప్రపంచవ్యాప్త సమస్య అనటంలో సందేహం లేదు. దీనిపై బ్రిటన్‌లోని గ్లాస్గో వేదికగా ఈ నెలలో సీఓపీ-26 సదస్సును ఐక్యరాజ్యసమితి నిర్వహిస్తోంది. అంతర్జాతీయ స్థాయిలో తీసుకోవాల్సిన చర్యల్ని అలా ఉంచితే, ముందు మన పట్టణ ప్రాంతాల వైపు నుండి సరిచేసుకోవాల్సిన మౌలిక లోపాలు ఎన్నో ఉన్నాయి.

పర్యావరణానికి ప్రాంతీయ, జాతీయ, స్థానిక స్థాయిల్లో నిర్దేశించిన లక్ష్యాల మేరకు పట్టణ ప్రాంతాల్లో కార్యక్రమాల అమలుతోనే భూతాపాన్ని గణనీయంగా తగ్గించటం సాధ్యమవుతుంది. భవన నిర్మాణంలో పర్యావరణ హితకర సామాగ్రిని వినియోగించాలి. సమర్థ ఘన వ్యర్థ పదార్థాల నిర్వహణ పద్ధతుల్ని అవలంబించాలి. ప్లాస్టిక్ వినియోగాన్ని నియంత్రిస్తూ పునర్వినియోగ ఉత్పత్తుల వాడకాన్ని ప్రోత్సహించాలి. హరిత స్థలాల్ని పెంచాలి. శిలాజ ఇంధనాల వాడకం స్థానంలో సంప్రదాయేతర ఇంధన వనరులను వినియోగించాలి. వ్యవసాయ వ్యర్థాలు, వ్యవసాయ పద్ధతుల వల్ల చుట్టుపక్కల నుండి కాలుష్యం వ్యాపించకుండా తగిన విధానాలను అమలు చేయాలి. నూతన నగరాల నిర్మాణంలో విద్యుత్ వినియోగం తక్కువగా ఉండే విధానాలకు రూపకల్పన చేయాలి. నగరాల అభివృద్ధి ప్రణాళికలు పర్యావరణానికి అను కూలంగా ఉండాలి. వాతావరణాన్ని చల్లబరిచే సాంకేతికతలను అభివృద్ధి చేయాలి. కుండపోత వర్షాలు కురిసిన కొన్ని రోజుల్లోనే తీవ్ర మంచినీటి ఎద్దడిని ఎదుర్కొంటున్న పరిస్థితుల్ని మార్చేలా వాననీటిని ఒడిసి పట్టే పద్ధతులకు ప్రాధాన్యమివ్వాలి. ఈ లక్ష్య సాధనలో పర్యావరణహిత సాంకేతికతల్ని గరిష్ఠంగా ఉపయోగించుకుంటూ పటిష్ఠమైన పట్టణీకరణ వ్యూహాలతో నగరాలు కీలకపాత్ర నిర్వర్తించవలసిన అవసరం ఉంది.

**సాధికారత, ప్రజల భాగస్వామ్యమున్న స్థానిక ప్రభుత్వాలు**

ఈ మొత్తం ప్రక్రియలో ఎంతో కీలకమైనవి బలమైన స్థానిక ప్రభుత్వాలు, ఎక్కడికక్కడ ప్రజల భాగస్వామ్యం! స్థానిక స్వతంత్ర పాలన లేకుండా కేవలం పై నుండి ఆదేశాలిస్తే పట్టణాల విస్తరణ, నగర జీవన నిర్వహణలు సక్రమంగా జరగవు. మన దేశంలో పట్టణ మౌలిక వసతులు అధ్వాన్నంగా ఉన్నప్పటికీ, పాలనా వైఫల్యం వల్ల ఆ నష్టం అనేక రెట్లు ఎలా పెరుగుతోందో దాదాపు 22 నెలల క్రితం మన దేశంలో విజృంభించిన కొవిడ్ సంక్షోభం స్పష్టంగా వెల్లడించింది. కరోనాపై పోరాటం అనగానే మనకు గుర్తొచ్చే లాక్‌డౌన్‌లు, ఆస్పత్రులు, మాస్కులు, వలస కార్మికులు, ఆదాయాల్లో ఒడిదుడుకులు, చివరకు వ్యాక్సిన్లు వంటి వాటిలో చాలా

సమస్యలకు మన దేశంలో నగరాల్లోని పాలనే కేంద్రబిందువుగా ఉంది. కేంద్ర సర్కారు, పలు రాష్ట్రాల ప్రభుత్వాలు కొవిడ్-19పై సాంప్రదాయ పద్ధతుల్లో తప్ప స్మార్ట్‌గా స్పందించటంలో విఫలమయ్యాయనటంలో సందేహం లేదు. అయితే, మన నగరాల్లో పాలన అధ్వాన్నంగా ఉండటం సమస్యను అనేకరెట్లు పెంచింది. భారతీయ నగరాల్లో సరైన జీవన వసతులు, స్థానికంగా బలమైన పాలన గనక ఉండి ఉంటే.. కరోనాను మరింత మెరుగ్గా కట్టడి చేయగలిగేవాళ్లం. గ్రామీణ ప్రాంతాలను ప్రభావితం చేసిన కొవిడ్ రెండో దశను కూడా మరింత సమర్థవంతంగా ఎదుర్కోగలిగేవాళ్లం.

కదలికలు, ఇతర ప్రాంతాలవారితో సంపర్కం ఎక్కువగా ఉండే నగర ప్రాంతాల్లోనే, ముఖ్యంగా మహానగరాల్లోనే కొవిడ్ ప్రభావం ఎక్కువగా ఉంది. నగరాలను సరైనరీతిలో కట్టడి చేస్తూ నడిపించే పాలనా సామర్థ్యం మన వద్ద లేకపోవటం వల్ల కఠిన లాక్‌డౌన్ అమలును భరించాల్సి వచ్చింది. దీనివల్ల కోట్ల మంది ప్రజలు కటిక పేదరికంలోకి జారిపోగా.. ఒక దేశంగా కూడా భారత్ ఆర్థికంగా, సామాజికంగా, కొన్ని రంగాల పరంగా భారీ మూల్యం చెల్లించాల్సి వచ్చింది.

కరోనా ఏమీ ఎబోలాలా ఎక్కువశాతం మందికి ప్రాణాంతక వ్యాధి కాదు. దీర్ఘకాల వ్యాధులు లేకుండా, వయోభారం లేకుండా ఉంటే కరోనాను రోజువారీ జాగ్రత్తలతోనే నివారించుకోవచ్చు, ఒకవేళ వచ్చినా బయటపడవచ్చు. కానీ ఈ విషయాల గురించి స్పష్టత వచ్చాక కూడా మనం జీవితాల్ని, జీవనోపాధిని బ్యాలెన్స్ చేసుకోవటంలో విఫలమై మూల్యం చెల్లించామంటే.. అందుకు ముఖ్యంగా నగరాల్లోని స్థానిక పాలన పేలవంగా ఉండటమే పెద్ద కారణం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లాగే స్థానికంగా మునిసిపల్ కార్పొరేషన్ల సమర్థ పాలనకు నిధులు, అధికారాలతో కూడిన సాధికార ప్రభుత్వాలు లేకపోవటం కరోనాపై భారత్ పోరును ఆత్మరక్షణలోకి నెట్టింది. దాదాపు అన్ని రాష్ట్రాల్లో ఈ స్థానిక ప్రభుత్వాలకు నిధులు, అధికారాలు లేవు. జాతీయ, రాష్ట్ర స్థాయిల్లోని ప్రభుత్వాలు పన్నుల్లో దాదాపు 95 శాతం వాటాను లాగేసుకుంటూ స్థానిక ప్రభుత్వాలను నామమాత్రం చేశాయి. చివరికి స్థానిక ప్రభుత్వాల్లో అణగారిన వర్గాలు, మహిళలకు రిజర్వేషన్లు ఉన్నా కూడా సాధికారత లేకుండా చేయటంతో అవి అధికారంలేని పదవులుగా మారిపోయాయి. లాక్‌డౌన్‌ని అర్థరహితమైన రీతిలో గుండుగుత్తగా దేశమంతటా విధించినా, ఆర్థిక కలాపాలకు కేంద్రాలైన నగరాల్లో పనుల్ని బంద్ చేయటం వల్లే ఎక్కువగా గడ్డు పరిస్థితులు ఏర్పడ్డాయి.

పట్టణాల విస్తరణపై నివేదికలో నీతి ఆయోగ్ కూడా స్థానిక స్వయంపాలన ప్రాధాన్యతను గుర్తించింది. రాష్ట్రాలు జారీ చేసే నిబంధనలను యథాతథంగా స్వీకరించటం కాకుండా, స్థానిక పరిస్థితులను బట్టి తీసుకోవాలి అని చెప్పింది. "స్థానిక ప్రభుత్వాలు ప్రణాళిక నిబంధనలు, భవనాల నిబంధనల (బైలాస్) ద్వారా అభివృద్ధి కార్యక్రమాలను క్రమబద్ధీకరించాలి. చాలా నగరాల్లో అభివృద్ధి క్రమబద్ధీకరణ నిబంధనలను దశాబ్దాల క్రితం రూపొందించారు. వాటిని ఏకపక్షంగా నవీకరించిన ఉదంతాలున్నాయి. నమూనా భవన నిబంధనలు-2016ని అనుసరించి పలు రాష్ట్రాలు ఇటీవల తమ నిబంధనలను సవరించాయి. స్థానిక ప్రభుత్వాలు వీటిని యథాతథంగా కాకుండా.. స్థానిక అవసరాలు, ఆర్థిక పురోభివృద్ధికి దోహదం చేసేలా స్వీకరించాలి".

సాధికారత గల స్థానిక ప్రభుత్వాలతో పట్టణాల్లో నాణ్యమైన ఆరోగ్యం, విద్యలతోపాటు పౌర సేవల్ని హక్కుగా అందించేలా ప్రభుత్వ సేవల్ని జవాబుదారీ చేయాలి. వివక్ష లేకుండా చేయాలి. నగరాల్లో పెరుగుతున్న జనాభా వల్ల నేరాలు పెరగకుండా, ప్రమాదకర మాదక ద్రవ్యాల వినియోగం వంటివి లేకుండా ఆధునిక సాంకేతికత వినియోగంతో పటిష్ఠ చర్యలు తీసుకోవాలి. నగరాల్లో నాయకత్వాన్ని ప్రత్యక్షంగా ఎన్నుకోవటంతోపాటు జనాభాకు ఏటా తలసరి రూ.2,000 చొప్పున కేటాయింపులు చేయాలి. ప్రజల భాగస్వామ్యానికి చట్టపరమైన అవకాశాల్ని కల్పించాలి. రెండు, మూడు పోలింగ్ బూత్‌లకు కలిపి ఒక వార్డు కమిటీని ఏర్పాటు చేయాలి. కాలనీ సంఘాలను, పన్నుల డబ్బుకు తగ్గ సేవలపై అవగాహన కల్పించే ట్యాక్స్ పేయర్స్ అసోసియేషన్ వంటి సంస్థలనూ భాగస్వాముల్ని చేయాలి. ఇలా వికేంద్రీకరణతో, సంబంధిత వర్గాలందరి భాగస్వామ్యంతో సుస్థిర, ఆనందదాయక నగర జీవనానికి బాటలు వేయాలి. ఈ మూడో అంచె ఫెడరలిజంలో అక్రమాలు, దుర్వినియోగాలు జరగకుండా చూసే అధికారాలు రాష్ట్ర ప్రభుత్వం చేతుల్లోనే ఉంటాయి. స్థానిక ప్రజాప్రతినిధులు అసమర్థులయితే, ప్రజాప్రయోజనాలకనుగుణంగా పనిచేయకుంటే.. పదవీకాలం ముగియకుండానే గద్దె దించటానికి వీలుగా 'రీకాల్' విధానాన్ని కూడా ప్రవేశపెట్టవచ్చు.

పర్యావరణహితంగా సాంకేతికతను పూర్తిస్థాయిలో వినియోగించుకుంటూ పట్టణ ప్రాంతాల్లో ఈ రకంగా బహుముఖ కృషి చేయటంతోపాటు.. నగరాల మీద మితిమీరిన భారం పడకుండా నియంత్రించేందుకు జాతీయ విధానాన్ని రూపొందించాలి. ప్రస్తుతం దేశంలో నగరాలన్నీ జనాభాతో నిండిపోతున్నాయి. 2011నాటి లెక్కల ప్రకారం దేశంలో 37.7 కోట్ల మంది అంటే 31.1 శాతం (ప్రస్తుతం 34 శాతం) నగరాల్లో జీవిస్తున్నారు. ఐక్యరాజ్యసమితి నివేదిక ప్రకారం 2050 నాటికి ఆ సంఖ్య 52.8 శాతానికి పెరగనుంది. ప్రపంచ నగర జనాభాలో 2050 నాటికి భారత్, చైనా, నైజీరియాలు మూడో వంతుకు ప్రాతినిధ్యం వహించనున్నాయని ఆ నివేదిక స్పష్టం చేసింది. 2028 నాటికి టోక్యో జనాభాను అధిగమించి ప్రపంచంలోనే అత్యధికులు నివసిస్తున్న నగరంగా ఢిల్లీ ఆవిర్భవించనుందని అంచనా. గతిలేక నగరాలకు వలసలు పోవాల్సిన అవసరంలేకుండా మౌలిక వసతులు, సేవలు, రవాణా తదితర ఏర్పాట్లతో గ్రామీణ ప్రాంతాలకు ఆర్థిక కేంద్రాలుగా చిన్న పట్టణాల్ని కూడా అభివృద్ధి చేయాలి. దీనివల్ల మెట్రోలు సహా నగరాలపై ఒత్తిడి తగ్గి మెరుగైన జీవన ప్రమాణాలు, ఉపాధి అవకాశాలు జనాభాలో ఎక్కువమందికి వేగంగా అందుబాటులోకి వస్తాయి. సమానావకాశాలు అందరికీ అందే సమ్మిళిత అభివృద్ధి సాధ్యమవుతుంది. ఈ తరహా

చర్యలుంటేనే నగరీకరణ భారత్‌కు భారీ బలిమి అవుతుంది. లేకుంటే, ఏ ఉపద్రవమొచ్చినా మన నగరాల్లో ఉంటున్నవారు చిగురుటాకులా వణికిపోవాల్సిందే, ఆర్థిక వృద్ధి ఒడిదుడుకులకు గురవ్వాల్సిందే. కరోనా, ఇతర ఉపద్రవాల నేపథ్యంలోనైనా ఈవేళ్టి మన సుఖంతోపాటు, రేపటి తరాల భవిష్యత్తు కోసం ఇక ఏమాత్రం ఆలస్యం చేయకుండా సమగ్ర పట్టణీకరణ సంస్కరణలకు ఉపక్రమించాలి.

**ఆసియాలోని వివిధ దేశాల్లో నగర జనాభా**

| | | | |
|---|---|---|---|
| జపాన్ | 91.6 | బంగ్లాదేశ్ | 36.6 |
| ఇరాన్ | 74.9 | భారత | 34.0 |
| చైనా | 59.2 | ఆఫ్గాన్ | 25.5 |
| భూటాన్ | 40.9 | నేపాల్ | 19.7 |
| మాల్దీవులు | 39.8 | శ్రీలంక | 18.5 |
| పాకిస్తాన్ | 36.7 | | (శాతాల్లో) |

**(ప్రపంచ నగరీకరణపై ఐక్యరాజ్యసమితి నివేదిక 2018 నుండి)**

### 75% పట్టణ జనాభా.. 10 రాష్ట్రాల్లో

ప్రస్తుతం దేశంలోని 75% పట్టణ జనాభా పది రాష్ట్రాలలోనే ఉందని నీతి ఆయోగ్ తెలిపింది. ఆ పదింటిలో ఆంధ్రప్రదేశ్ కూడా ఒకటని ఉదహరించింది. రాష్ట్రంలో పట్టణ ప్రాంతాల (సెన్సస్ టౌన్ల) సంఖ్య 2001-11 మధ్య 93 నుండి 227కు పెరిగినట్లు తెలిపింది. దేశంలో మురికివాడల్లో నివసించేవారిలో 70% మంది ఆరు రాష్ట్రాలలోనే ఉంటున్నారని పేర్కొంది. అందులో ఆంధ్రప్రదేశ్ వాటా 15% మేర ఉందని వెల్లడించింది.

## వాయు కాలుష్య కట్టడికి 42 నగరాలకు రూ.4,400 కోట్లు

దేశవ్యాప్తంగా 10 లక్షలకు పైగా జనాభా ఉన్న 42 నగరాల్లో కాలుష్యం తగ్గించి గాలి నాణ్యత పెంచేందుకు రూ.4,400 కోట్లను రాష్ట్రాలకు గ్రాంటుగా ఇవ్వాలని యూనియన్ ప్రభుత్వం 15వ ఆర్థిక సంఘం సిఫార్సు చేసింది. ఈ నగరాల్లో తెలంగాణ నుంచి హైదరాబాద్ ఉంది. ఆంధ్రప్రదేశ్‌కు రూ.135 కోట్లు ఇవ్వనున్నారు. హైదరాబాద్‌వాయు కాలుష్య నియంత్రణలో భాగంగా జీహెచ్ఎంసీ (రూ.1449.01 కోట్లు), హెచ్ఎండీఏ (రూ.200.14 కోట్లు), ట్రాఫిక్ పోలీసులు (రూ.7.61 కోట్లు), టీఎస్ ఆర్టీసీ (రూ.13.06 కోట్లు), టీఎస్ ట్రెడ్‌కో (రూ.61 కోట్లు) సంస్థలు రాబోయే ఐదేళ్లలో రూ.1,730 కోట్లు వెచ్చించేందుకు ప్రణాళిక రూపొందించాయి. ఇందులో రూ.118.6 కోట్లు ఆర్థిక సంఘం సిఫార్సుతో వస్తాయని అంచనా. ఘన వ్యర్థాల నిర్వహణకు మరో రూ.250 కోట్లు విడుదలవుతాయని ప్రభుత్వ యంత్రాంగం ఆశాభావంతో ఉంది.

## పట్టణ స్వచ్ఛ భారత్ (2.0), అమృత్ రెండో దశ

పట్టణ ప్రాంత ప్రజలకు చెత్త నుంచి విముక్తితోపాటు తాగునీటి భద్రత కల్పించే రెండో దశ స్వచ్ఛ భారత్ (పట్టణ), అమృత్ కార్యక్రమాలకు ప్రధాని నరేంద్ర మోదీ శ్రీకారం చుట్టారు. ఇందుకు రూ.4.28 లక్షల కోట్ల వ్యయంతో అంచనాల్ని రూపొందించారు. వేగంగా జరుగుతున్న పట్టణీకరణ సవాళ్లను ఎదుర్కోవటం, 2030 నాటికి సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధన లక్ష్యంగా యూనియన్ ప్రభుత్వం వీటిని రూపొందించింది. స్వచ్ఛ భారత్ (పట్టణ) కింద పట్టణాలకు మురుగు నుండి విముక్తి కల్పిస్తారు. అమృత్ పథకం పరిధిలోకి రాని అన్ని పట్టణ ప్రాంతాల్లో మురికి నీటి నిర్వహణ చేపడతారు. అన్ని పట్టణ స్థానిక సంస్థలను ఓడీఎఫ్ ప్లస్ (బహిరంగ మల విసర్జన రహితం)గా మారుస్తారు. లక్ష జనాభాకు పైబడిన పట్టణాలను ఓడీఎఫ్ ప్లస్‌గా తీర్చిదిద్దుతారు. తద్వారా పట్టణాలు స్వచ్ఛమైన ప్రాంతాలుగా మారే లక్ష్యాన్ని చేరుకుంటాయని అంచనా. ఘన వ్యర్థాలను అవి ఉత్పత్తి అయ్యేచోటే వేరు చేయటంపై దృష్టి సారిస్తారు. వాటిని తగ్గించటం, పునర్వినియోగించటం, పునఃశుద్ధి చేయటం గురించి యోచనలు చేస్తారు. మునిసిపాలిటీల్లో వెలువడే అన్ని రకాల వ్యర్థాలను శాస్త్రీయంగా శుద్ధి చేసి వాటిని సమర్థవంతంగా వినియోగిస్తారు. ఈ స్వచ్ఛ భారత్ 2.0కి యూనియన్ ప్రభుత్వం 1.41 లక్షల కోట్లు ఖర్చు చేస్తుంది.

అమృత్ 2.0 కార్యక్రమం కింద దేశవ్యాప్తంగా ఉన్న 4,700 పట్టణ స్థానిక సంస్థల్లో 2.68 కోట్ల నల్లా కనెక్షన్లు ఇచ్చి ప్రతి ఇంటికీ తాగునీటి సౌకర్యాన్ని కల్పిస్తారు. 500 అమృత్ పట్టణాల్లో ఇళ్లకు మురుగు వ్యర్థాల కనెక్షన్లు ఇస్తారు. దీనివల్ల పట్టణ ప్రాంతాల్లో ఉన్న 10.5 కోట్ల మందికి ప్రయోజనం కలుగుతుందని అంచనా. ఉపరితల, భూగర్భ జలాలను సంరక్షించటంతోపాటు, వాటి పునరుద్ధరణకు చర్యలు తీసుకుంటారు. ఇందుకోసం ప్రపంచస్థాయి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగిస్తారు. పట్టణ ప్రాంతాల్లో తాగునీటి సౌకర్య కల్పన పురోగతిని తెలుసుకునేందుకు తాగునీటి సర్వే కూడా చేపడతారు. ఈ మొత్తం కార్యక్రమానికి జాతీయ స్థాయి ప్రభుత్వం రూ.2.87 లక్షల కోట్లు కేటాయించింది.

## పౌరులు స్మార్ట్‌గా భాగస్వాములైతేనే స్మార్ట్ సిటీలు

తగినంత నీటి సరఫరా, విద్యుత్ సరఫరాకు భరోసా, చెత్త నిర్వహణ సహా పారిశుద్ధ్యం, ప్రజలు తక్కువ సమయంలో గమ్యాలకు చేరటానికి వీలుగా ప్రజారవాణా, ఆధునిక ఐటీ కనెక్టివిటీ, డిజిటలైజేషన్, సుపరిపాలన, పర్యావరణ సమతూకాన్ని కాపాడటం, పౌరుల రక్షణ మొదలైన మౌలికాంశాలకు ప్రాధాన్యతనిస్తూ ప్రారంభమైన స్మార్ట్ సిటీస్ మిషన్ విజయవంతమవ్వాలన్నా కూడా ప్రజలు పాలనలో, సంస్కరణల్లో స్మార్ట్‌గా పాల్గొనటం అవసరం. పాలనలో పౌరుల పాత్ర ఒట్టి మొక్కుబడిగా ఉంటే ఉపయోగం లేదు. స్మార్ట్ పౌరులంటే.. తమంతట తాము స్మార్ట్ పరిష్కారాలకనిర్ణయాల్లో, పరిష్కారాల్లో భాగస్వాములయ్యేవాళ్లు! సంస్కరణల అమలు, పరిమిత వనరులతోనే అపరిమిత ఫలితాల్ని సాధిస్తుండటం, ప్రాజెక్టు రూపకల్పనల్ని, అందులో ఉపయోగించే రకరకాల సాంకేతికతల్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుండటం స్మార్ట్ సిటీస్ మిషన్‌లో చేయాల్సిన పనులు.

స్మార్ట్ పరిష్కారాలను అమలు చేయటం ద్వారా నగరాలు టెక్నాలజీని, నైపుణ్యాల్ని.. మౌలిక వసతులు, సేవల్ని మెరుగుపరిచేలా ఉపయోగించుకోగలుగుతాయి. ఈ సమగ్రాభివృద్ధి జీవన నాణ్యతను పెంచుతుంది, ఉపాధి అవకాశాల్ని సృష్టిస్తుంది, అందరి ఆదాయాల్నీ, ముఖ్యంగా పేద, మధ్యతరగతి ప్రజానీకం ఆదాయాల్ని పెంచుతుంది.

## వాతావరణ మార్పుల మధ్యే పిల్లల జీవనం: యూనిసెఫ్

భూమిపై ఉన్న పిల్లలంతా ఏదో ఒక వాతావరణ మార్పునకు గురవుతున్నారు. వాతావరణ మార్పుల ప్రభావాల మధ్యనే జీవిస్తున్నారు. భవిష్యత్తును ప్రభావితం చేసే చర్చల్లో పాల్గొనే హక్కు ప్రతి బిడ్డకీ ఉంటుంది. ఇందుకోసం వాతావరణ మార్పులపై జరుగుతున్న 'కాప్-26' సదస్సులో అత్యవసర సమగ్ర ప్రణాళికను రూపొందించాల్సిన అవసరం ఉంది.

## భారతీయ జీవనశైలి అంటే ఆచారవ్యవహారాలే కాదు..

భారతీయ జీవనశైలి అంటే కేవలం ఆచారవ్యవహారాలు కాదు.. రోజువారీ పాలనావ్యవహారాల్లో కూడా ప్రజల చురుకైన భాగస్వామ్యం ఉండటం. రోజువారీ అంశాలను స్థానికంగానే సమర్థవంతంగా నిర్వహించుకున్న సుదీర్ఘ చరిత్ర మన దేశానిది. 5,000 ఏళ్ల క్రితమే సింధులోయ నాగరికత మన వ్యవస్థీకృత పట్టణ జీవనానికి నిలువుటద్దంగా నిలుస్తుంది. విశాల రహదారులు, మార్కెట్ స్థలాలు, పాలనా కార్యాలయాలు, సామూహిక స్నానఘట్టాలు, మురుగుపారుదల, పారిశుద్ధ్య వ్యవస్థలు ఉండేవి. అందుబాటులో ఉన్న ఆధారాలు, విస్తృత భౌగోళిక విస్తీర్ణం బట్టి, హరప్పా నగరం స్థానిక నిర్ణయాధికారమున్న స్వయంపాలిత నగర రాజ్యమని తెలుస్తుంది. వేదకాలంలో కూడా స్థానిక పాలన ఒక కట్టుబాటుగా ఉండేది. 3500 సంవత్సరాల క్రితం, తొలి వేదయుగంలో కూడా రాజ్యాల చుట్టూ కాకుండా తెగల చుట్టూనే రాజకీయ నిర్మాణం ఉండేది కాబట్టి, పాలన కూడా స్థానికంగా, సమూహాల చుట్టూనే కేంద్రీకృతమై ఉండేది. మలి వేదయుగంలో కూడా స్థానిక సూత్రమే ఉండేది. గౌతమ బుద్ధుడు, మహావీరుడు కాలంనాటికి లిచ్ఛావి గణతంత్ర రాజ్యం స్థానిక ప్రభుత్వాల వ్యవస్థకు నిలువుటద్దంగా ఉండేది. సమానత్వం ప్రాతిపదికన స్థానిక తెగలను సంఘటితం చేసి సమాఖ్యలా ఏర్పాటు చేశారు. ఇతర సమాఖ్యల్ని- విదేహ రిపబ్లిక్, వజ్జయిని రిపబ్లిక్, ప్రాచీన రచనల్లోని (అంగుట్టార నికాయ, భగవతి సూత్ర) పదహారు మహాజనపదాల ప్రస్తావన చూస్తే, స్వయంపాలిత స్థానిక సంస్థలు సమానత్వం ప్రాతిపదికన కాన్ఫెడరేషన్లుగా ఏర్పడ్డాయని అర్థమవుతుంది. 2300 సంవత్సరాల క్రితం నాటి మౌర్య సామ్రాజ్యం నుంచి మొగల్ సామ్రాజ్యం (క్రీశ 1526-1707) వరకు, సుమారు రెండు సహస్రాబ్దుల కాలం, పట్టణాలలో నియమిత అధికారులు, కౌన్సిల్, ఎన్నికలైన పాలనా అధికారులకు విధివిధానాలు వంటి భిన్నమైన ఏర్పాట్లతో వ్యవస్థ పనిచేసేది. స్థానిక స్వయంపాలన భారతీయ సంస్కృతిలో భాగం. ఈ మాటను ప్రధానమంత్రి నరేంద్రమోదీ కూడా బహిరంగంగా ఉటంకించారు. కానీ ఆచరణలో మాత్రం.. స్వతంత్రం వచ్చాక రాజ్యాంగ నిర్మాణ సమయంలో అప్పటి పరిస్థితుల వల్ల ఏర్పాటు చేసిన కేంద్రీకృత పాలనా పద్ధతుల్ని ఈవేళ్టికీ కొనసాగించటానికే, ఇంకా నియంతృత్వ పోకడల్ని వీలైనంత బలోపేతం చేయటానికే ఆయన కూడా ప్రాధాన్యత ఇస్తున్నారు. భారతీయతకు పెద్దపీట వేసే పార్టీ తమదని చెబుతూనే స్థానిక స్వయంపాలనకు గండి కొడుతున్నారు. మరోపక్క ప్రజాస్వామిక దేశాలతో పాటు నియంతృత్వ చైనా కూడా స్థానిక ప్రభుత్వాలకు గణనీయ అధికారాలను, నిధులను ఇస్తున్నాయి. కరోనా పాఠాల తర్వాతైనా మన పాలకులు అధికారాలను మూడో అంచెకు వికేంద్రీకరించి స్థానిక ప్రభుత్వాలను బలోపేతం చేయాలి. నగర పాలనను బలోపేతం చేయటంతోనైనా అడుగులు మొదలుపెట్టాలి.

# హుజూరాబాద్‌లో ప్రజాస్వామ్య, ఎన్నికల రాజకీయ సంక్షోభం చూశాకైనా దామాషా పద్ధతి, ముఖ్యమంత్రుల ప్రత్యక్ష ఎన్నికకు పార్టీలు ముందుకు రావాలి..

## దళితబంధు పథకాన్ని రీడిజైన్ చేసి, అదే డబ్బుని దళితులు, పేదల విద్య, ఆరోగ్యం, ఉపాధి కోసం వెచ్చించాలని ముఖ్యమంత్రి కేసీఆర్‌కు జేపీ విజ్ఞప్తి

దేశ చరిత్రలోనే కనీవినీ ఎరుగని రీతిలో హుజూరాబాద్ తాజా ఉప ఎన్నికలో డబ్బు వెదజల్లిన తీరుపై అనేక వార్తలు వెలువడ్డాయని, మన కంటే ఎంతో సంపన్న దేశమైన బ్రిటన్‌లో 2019 ఎన్నికల్లో రెండు ప్రధాన పార్టీలూ దేశమంతటా చేసిన ఖర్చు కంటే కూడా ఈ ఒక్క అసెంబ్లీ స్థానంలో ప్రస్తుత ఎన్నికలో వెచ్చించిన డబ్బు ఎక్కువని ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ అన్నారు.

"బ్రిటన్‌లో అధికార కన్జర్వేటివ్ పార్టీ, ప్రతిపక్ష లేబర్ పార్టీలు కలిపి 2019 పార్లమెంటు ఎన్నికల్లో సుమారు 24 మిలియన్ పౌండ్లు ఖర్చు చేశాయి. ప్రస్తుత మారక విలువ ప్రకారం ఇది రూ.240 కోట్లకు సమానం. కొనుగోలు శక్తి రీత్యా చూస్తే ఈ వ్యయం రూ.70 కోట్లు ఉంటుంది. అంటే, మన కంటే తలసరి ఆదాయం 16 రెట్లు ఎక్కువగా ఉన్న బ్రిటన్‌లో దేశవ్యాప్తంగా జరిగిన ఎన్నికల్లో రెండు ప్రధాన పార్టీలు చేసిన వ్యయం కంటే..




కొనుగోలు శక్తి రీత్యా 3 రెట్లు ఎక్కువ మొత్తాన్ని ఒక్క హుజూరాబాద్ ఉప ఎన్నికలో ఖర్చు చేశారు. మన ప్రజాస్వామ్యం, ఎన్నికల రాజకీయం ఎంత తీవ్ర సంక్షోభంలో ఉన్నాయో ఇంతకంటే ఎక్కువ చెప్పనక్కర్లేదు" అని జేపీ అన్నారు.

ఈ సంక్షోభ పరిస్థితిని మార్చటానికి కేవలం పోలీసు కేసులు, నగదు స్వాధీనం, ఎన్నికల సంఘం ప్రయత్నాలు చాలవని జేపీ అన్నారు. డబ్బు పంపిణీ వల్ల ఎన్నికల్లో ఎవరూ విజయం సాధించలేని పరిస్థితిని కల్పించాలన్నారు. అప్పుడు డబ్బు పంపిణీ లేకపోవటం వల్ల ఓడిపోతామన్న భయం, డబ్బు పంచితే గెలుపు అవకాశాలు పెరుగుతాయన్న ఆశ రెండూ పార్టీలకు, అభ్యర్థులకు ఉండవన్నారు.

"ప్రస్తుత ఎన్నికల వ్యవస్థలో కొద్దిపాటి ఓట్ల తేడాతో ఫలితాలు తారుమారవుతున్నాయి. ఒక్క ఓటు తేడాతో నెగ్గినా గెలిచినవారికి రాజకీయ ఫలితం లభిస్తుండగా, ఒక్క ఓటు తేడాతో ఓడినా నెగ్గనివారికి రాజకీయ ఫలితం శూన్యమైన పరిస్థితి నెలకొంది. విజయం మొత్తం విజేతకే భోజ్యం అవుతోంది. దీన్ని మార్చి దామాషా ఎన్నికల పద్ధతిని ప్రవేశపెట్టం అత్యవసరం. ఒక్క ఓటు తేడాతో అభ్యర్థుల గెలుపోటములు కాకుండా.. ఒక పార్టీ మొత్తం రాష్ట్రంలో పొందిన ఓట్లను బట్టి సీట్లను కేటాయించే దామాషా పద్ధతి ఉంటే, పార్టీల దృష్టి మారి ఓట్ల కొనుగోలుతో సీట్లు గెలవాలనుకోవటం ఉండదు. దామాషా పద్ధతి వల్ల నియోజకవర్గంలో డబ్బు పంపిణీ చేసేవారికి ఏ ప్రయోజనమూ కనిపించదు. దీంతో సహజంగానే అభ్యర్థుల, పార్టీల డబ్బు పంపిణీ గొడవ పోయి.. అభ్యర్థుల చరిత్ర, వారికి సమాజంలో ఉన్న పేరు ప్రతిష్ఠలు, గౌరవం, పార్టీ సిద్ధాంతాలు, ఎజెండా



మొదలైనవి ప్రాముఖ్యత సంతరించుకుంటాయి. ఎన్నికల తీరు సంపూర్ణంగా మారిపోతుంది.

"సుస్థిర ప్రభుత్వాలు ఏర్పాటు కోసం దామాషా పద్ధతిలో కొన్ని మార్పులు చేర్పులు చేయవచ్చు. ఉదాహరణకి ఎన్నికల్లో అత్యధిక ఓట్లు వచ్చిన పార్టీకి 10% అదనంగా సీట్లు కేటాయించే ఏర్పాటు ఉంటే, 40 శాతం ఓట్లతోనే మెజారిటీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయవచ్చు. అలాగే ఒక పార్టీకి రాష్ట్రంలో 5 లేక 10 శాతం ఓట్లు ఉంటేనే సీట్ల పంపిణీ ఉండేలా ఏర్పాటు చేస్తే, కరడుగట్టిన అతివాద, అరాచక పార్టీలకి లేదా కేవలం కులం మీద ఆధారపడిన పార్టీలకి స్థానం లేకుండా పోతుంది. ఈ రకమైన మార్పులతో దామాషా పద్ధతిని తీసుకొస్తే,

రాజకీయం తీరు మారి ఓట్ల కొనుగోలు ఆగిపోతుంది. ఇప్పటికైనా అన్ని పార్టీలూ కలిసి దీనిపై ఏకాభిప్రాయం సాధించటం మన ప్రజాస్వామ్య భవిష్యత్తుకి అత్యవసరం" అని జేపీ అన్నారు.

"అలాగే ఈరోజు రాష్ట్రాల్లో ప్రజలు ఓట్లు వేస్తున్నది పార్టీ నాయకుడి మీద నమ్మకంతోతప్ప నియోజకవర్గంలో అభ్యర్థిని చూసి కాదు. కానీ ఆ నాయకుడు లేదా నాయకురాలు అధికారానికి వచ్చేది శాసనసభ ఎన్నుకున్నప్పుడు మాత్రమే. ఈ నేపథ్యంలో, ప్రభుత్వ ఏర్పాటు కోసం శాసనసభ ఎన్నికల్లో సర్వశక్తుల్నీ వినియోగించటం, అక్రమాలకు పాల్పడటం, ఓటు కొనటం పెరిగిపోయాయి. తీరా ఒక పార్టీ నెగ్గి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశాక.. అంతకు ముందు ఓట్లు కొన్నా, ముఖ్యమంత్రి ముఖం చూసి ప్రజలు ఓట్లు వేసినా, ప్రభుత్వం నిలబడేది మాత్రం ఎమ్మెల్యేల రాజకీయ మద్దతుతోనే. దీంతో ప్రభుత్వాన్ని కాపాడుకోవటం కోసం ప్రతిరోజూ ముఖ్యమంత్రులు ఎన్నో విషయాల్లో రాజీ పడాల్సి వస్తోంది. అధికారుల బదిలీలు, రేషన్ కార్డులు, కాంట్రాక్టులు, పోలీసు కేసులు, భూ కబ్జాలు, ప్రతి విషయంలో రాజకీయ జోక్యం, ప్రభుత్వ మనుగడ కోసం ప్రజా ప్రయోజనాలను పణంగా పెట్టటం, పక్షపాత ధోరణి, పరిపాలన కుంటుపడటం జరుగుతోంది. దీన్నుంచి బయటపడాలంటే రాష్ట్ర ప్రభుత్వ అధినేతను ప్రత్యక్షంగా ఎన్నుకోవటం అవసరం. అప్పుడు ఒక వంక ప్రత్యక్షంగా ప్రభుత్వాధినేత ఎన్నిక జరుగుతుంది .. మరోవంక విపరీత పక్షపాత ధోరణి, అనవసర రాజకీయ జోక్యం పోతాయి. ఇటీవలి కాలంలో రాష్ట్రాల్లో ప్రభుత్వాలు నిరంతరం అస్థిరం పాలుకావటం లేదా మనుగడ కోసం పరిపాలన కుంటుపడటం మళ్లీ మళ్లీ చూస్తున్నాం. కనీసం 75 ఏళ్ల భారత స్వాతంత్ర్యం సందర్భంగానైనా పార్టీలన్నీ కలిసి ఎన్నికల వ్యవస్థలో మార్పులు తీసుకురావటం అవసరం. పక్షపాతాల్ని వీడి మౌలిక మార్పు కోసం ముందుకు రావాలని అన్ని పార్టీల్ని, పత్రికల్ని, వ్యవస్థల్ని విజ్ఞప్తి చేస్తున్నాం" అని జేపీ అన్నారు.



హుజూరాబాద్ ఎన్నికల ఫలితాన్ని తెలంగాణ రాష్ట్రానికి సంబంధించి విశ్లేషించినట్లయితే, పక్షపాతాలు, పార్టీ రాజకీయాల్ని పక్కన పెడితే.. సామాన్య ప్రజలు ఒక బలమైన సందేశాన్ని రాజకీయ పార్టీలకు, రాష్ట్ర ప్రభుత్వానికి అందించారని జేపీ అన్నారు.

"ప్రపంచ ప్రజాస్వామ్యంలో ఎక్కడాలేని రీతిలో తెలంగాణ ప్రభుత్వం దళితబంధు పథకం పేరిట ఒక్కో దళిత కుటుంబానికి రూ.10 లక్షలు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించింది. దీన్లో భాగంగా ఉప ఎన్నిక జరుగుతున్న హుజూరాబాద్‌లో ఆ పథకానికి సుమారు రూ.1000 కోట్లు పంపిణీ చేయటం కూడా జరిగింది. కానీ ఎన్నికల ఫలితాల సరళిని చూసినట్లయితే ప్రభుత్వం అధికారికంగా ఇంత పెద్ద మొత్తం పంపిణీ చేసిన ప్రాంతాల్లోని గ్రామాల్లో, పోలింగ్ బూత్‌లలో ఓట్లను విశ్లేషిస్తే, ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఓట్లు పడ్డాయి. అంటే దళితులు, బీదలు, సామాన్య ప్రజలు ప్రధానంగా కోరుకుంటున్నది కేవలం తాత్కాలిక సాయం మాత్రమే కాదు. పేద కుటుంబాలు కోరేది తమ బిడ్డలు మధ్యతరగతి స్థాయికి ఎదగాలని, తమ కుటుంబానికి సంపాదించే శక్తి పెరగాలని, అదనపు ఆదాయాన్ని పొందాలని. పరిమితమైన స్థాయిలో తాత్కాలిక అవసరాల కోసం బీదలకు సాయం చేయటం అవసరమే. కానీ ప్రజలు నిజంగా కోరేది ఎటువంటి భారం లేకుండా పిల్లలకు మంచి ప్రమాణాల విద్య, కుటుంబం దివాళా తీయకుండా కుటుంబ సభ్యులందరికీ మంచి ప్రమాణాల ఆరోగ్యం, యువతకి మంచి నైపుణ్యం, ఆర్థిక ప్రగతిని వేగంగా సాధించి వ్యవస్థలో ఉద్యోగాల్ని కల్పించటం, ఈ ఉపాధి ద్వారా శాశ్వతంగా బీద కుటుంబాల ఆదాయాన్ని పెంచటం, ఆత్మగౌరవంతో, ఆత్మస్థైర్యంతో ఆ కుటుంబాలు పైకి ఎదగటం. బీదరికం అంతం కావటానికి, కులవ్యవస్థను రూపుమాపటానికి ఇంతకు మించి వేరే మార్గం లేనే లేదు. హుజూరాబాద్ నియోజకవర్గంలో బీదలు, దళితులు, సామాన్యులు చాలా స్పష్టంగా ఈ సందేశాన్ని రాజకీయ వ్యవస్థకు ఇచ్చారు. దీన్ని పరిగణలోకి తీసుకోవాలని రాష్ట్ర ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు గారిని, రాష్ట్ర ప్రభుత్వాన్ని సవినయంగా కోరుతున్నాం. తదనుగుణంగా దళితబంధు పథకాన్ని పునస్సమీక్షించాలి. దళితబంధు పథకాన్ని రాష్ట్రం మొత్తానికీ అమలు చేయటానికి ఎంత ఖర్చవుతుందో, ఆ మొత్తం డబ్బునీ దళిత, బీద కుటుంబాలకే మంచి ప్రమాణాల విద్య, ఆరోగ్యం ఆ కుటుంబాలకి ఏ మాత్రం భారం లేకుండా అందిస్తూ యువత నైపుణ్యాలను పెంచి, ఉపాధి అవకాశాలను పెంచి ఆ కుటుంబాల ఆదాయం పెంచే మార్గాన్ని ఏర్పరిచేందుకు అందించాలి. దళితబంధు కోసం సంకల్పించిన వనరుల్ని ప్రజల అభీష్టం మేరకు ఈ బీద వర్గాల అభ్యున్నతికే శాశ్వతంగా ఆదాయాలు పెరిగే పథకాల అమలుకు వినియోగించాలి. అప్పుడు బీదరికం పోతుంది, కులవ్యవస్థ ప్రభావం తగ్గిపోతుంది, రాష్ట్ర భవిష్యత్తుకు, ఆర్థికాభివృద్ధికి సుస్థిర పునాదులు ఏర్పడతాయి".

"ఈ ఎన్నికల్ని కేవలం రాజకీయ కోణంలోనో, గెలుపు ఓటముల కోణంలోనో, పార్టీల ప్రతిష్ఠ కోణంలో నుంచో చూడకుండా శాశ్వతంగా ఆదాయాన్ని కల్పించే అభివృద్ధి కావాలని ప్రజలు కోరుకుంటున్న సందేశానికి తార్కాణంగా గుర్తించటం, తెలంగాణ భవిష్యత్తుకి, ఈ దేశంలోని ప్రజానీకం భవిష్యత్తుకి అత్యవసరం" అని పేర్కొంటూ.. వెలుగుల పండుగ మన రాజకీయాల్లో, జీవితాల్లో ఈ వెలుగులు నింపాలి అని జయప్రకాష్ నారాయణ్ ఒక ప్రకటనలో దీపావళి శుభాకాంక్షలు తెలిపారు.


# అందరికీ ఆరోగ్యానికి ఆచరణసాధ్య నమూనా

**సమర్థవంతం / అందుబాటు / అతి తక్కువ వ్యయం**

## జులై 2021

(తెలుగులో స్థూల అనువాదం)

(గమనిక: ప్రజలపై ఎటువంటి ఆర్థిక భారం లేకుండా భారతదేశంలో అందరికీ నాణ్యమైన ఆరోగ్యాన్ని జీడీపీలో అతి తక్కువ వ్యయంతో అందించేందుకు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ నేతృత్వంలో ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్) ఇంగ్లీషులో రూపొందించిన సమగ్ర ఆరోగ్య విధానానికి స్థూలంగా తెలుగులో చేసిన అనువాదమిది. ఇందులో పట్టికలు, గణాంక పటాలు, అనెగ్జర్ల వివరాలుండవు. ఆరోగ్య విధానంపై రూపొందించిన పుస్తకంలో పూర్తి సమాచారం ఉంటుంది)



ప్రాంతాలవారీ తేడాలతోపాటు.. ప్రభుత్వ ఆరోగ్య సదుపాయాల నెట్‌వర్క్ పెద్దఎత్తున ఉన్నప్పటికీ, దేశ ప్రజల ఆరోగ్య అవసరాల్లో ఎక్కువ శాతాన్ని తీరుస్తూ ప్రయివేటు రంగం భారీగా అభివృద్ధి చెందటం భారతీయ ఆరోగ్య వ్యవస్థలో కొట్టొచ్చినట్లు కన్పించే అంశం. మౌలిక వసతులు, వినియోగం, వ్యయం ఈ మూడు కోణాల్లోనూ ప్రయివేటు ఆరోగ్య రంగం భారీగా విస్తరించింది.

**2.2. ఆరోగ్య సేవల్లో ప్రయివేటు రంగం పాత్ర**

**2.2.1. మౌలిక వసతులు**

ప్రస్తుతం ఆరోగ్య మౌలిక వసతుల్లో 60 శాతానికిపైగా ప్రయివేటు రంగంలోనే ఉన్నాయి. ఏప్రిల్ 2020 నాటికి, మొత్తం 18,99,228 ఆస్పత్రి పడకల్లో, 11,85,242 ప్రయివేటులోనే ఉన్నాయి. అయితే, రాష్ట్రాల వారీగా వీటి ఏర్పాటులో సమతుల్యత లేదు. దేశం మొత్తంలోని ఆస్పత్రి పడకల్లో సగం.. 28 శాతం జనాభా నివసించే ఆరు రాష్ట్రాల్లో (2.1 గణాంక పటం) కేంద్రీకృతమై ఉన్నాయి.

**(గణాంక పటం 2.1: జనాభాకు అనుగుణంగా ఆస్పత్రి పడకల శాతం)**

**2.2.2. వినియోగం**

ప్రయివేటు ఆరోగ్య రంగ మౌలిక వసతులు విస్తరించిన తీరు.. ప్రయివేటు సదుపాయాలు, ప్రభుత్వ రంగ వైద్య సేవల వినియోగ శాతంలో కూడా అంతరాలకు దారితీసింది. 2.2 పట్టిక స్పష్టపరుస్తున్నట్లు, దేశంలోని దాదాపు ప్రతి పెద్ద రాష్ట్రంలో కూడా ప్రయివేటు వైద్యులే ఆరోగ్య సేవల్లో ఆధిపత్యం వహిస్తున్నారు. ఇక్కడ ఆస్పత్రికి వెళ్లటమంటే దాదాపు 75 శాతం ప్రయివేటు ఆరోగ్య సదుపాయాల వద్దకు వెళ్లటమే (అనుబంధం 2.3).

**(పట్టిక 2.2: రాష్ట్రాల వారీగా మౌలిక వసతుల్లో, వినియోగంలో ప్రయివేటు రంగం వాటా)**

ఎన్.ఎస్.ఎస్.ఓ అంచనాల ప్రకారం, భారత్‌లో ప్రస్తుతం వైద్య సంప్రందింపుల శాతం 2.3గా ఉంది. అంటే, ఒక వ్యక్తి ఆస్పత్రికిగానీ, వైద్యునిగానీ (అనధికారికంగా వైద్యం చేసేవారితో కూడా కలిపి) ఏడాదికి సగటున రెండుసార్లు సందర్శిస్తారు (అనుబంధం 2.3). వీటిలో 25 శాతం సందర్శనలు మాత్రమే ప్రభుత్వ ఆరోగ్య సదుపాయాల వద్దకు వెళ్తున్నవి. ప్రభుత్వ ఆరోగ్య విభాగంలో ఈ కన్సల్టేషన్ శాతం గత 25 ఏళ్లుగా 0.5 నుంచి 0.6 శాతం వద్దే నిలిచిపోయింది (అనుబంధం 2.3). వైద్య కన్సల్టేషన్లలో గణనీయ వాటా ప్రయివేటు రంగంలో అనధికారికంగా, శిక్షణ లేకుండా వైద్యం చేసే వారిది కాగా, ప్రభుత్వ రంగంలో డాక్టర్ కాకుండా ప్రత్యుత్పత్తి, కుటుంబ నియంత్రణ అంశాల్లో సేవలందించే ఆరోగ్య సిబ్బందిది అవుతోంది. గ్రామీణ భారతదేశంలో 70 శాతం ప్రాథమిక ఆరోగ్య సేవలు అనధికార ఆరోగ్య సేవలదారుల ద్వారానే జరుగుతున్నాయి. అనేక కేసుల్లో ఆరోగ్య సమస్య వచ్చినవారు మొదట వీరి వద్దకే వెళ్తున్నారు.

**(గణాంక పటం 1: ఆరోగ్య సేవల్లో ప్రభుత్వ రంగం వాటా శాతం - ఆస్పత్రి సంరక్షణ**

**బాక్స్ 2.2: దశాబ్దాలుగా ప్రభుత్వ రంగ సదుపాయాల వినియోగం తీరు**

గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో కూడా ప్రభుత్వ వైద్య సదుపాయాల వినియోగ శాతం స్థిరంగా పెరుగుతోందని 2020-21 ఆర్థిక సర్వే తెలిపింది (గణాంక పటం 1, పటం 2). గ్రామీణ ప్రాంతాల్లో ఇన్‌పేషెంట్ సేవలు 2014లో 42% నుండి 2018లో 46%కి పెరిగాయి. అంతకుముందు దశాబ్దంలో 2004 నుంచి మాత్రం సంఖ్యలో పెద్దగా మార్పు లేదు. మరోవైపు, పట్టణ ప్రాంతాల్లో ప్రభుత్వ సదుపాయాల వినియోగం 2004 నుంచి 2014 మధ్య 38 నుంచి 32 శాతానికి పడిపోయింది. 2014 నుంచి మాత్రం పెరుగుతూ 2018 నాటికి 35%కి చేరుకుంది. ప్రభుత్వ వైద్య సదుపాయాల వినియోగంలో కొంతమేర పెరుగుదల కనిపించినా, ప్రయివేటు రంగ సేవల ఆధిపత్యమే దేశంలో కొనసాగుతోంది.

**గణాంక పటం 2: ఆరోగ్య సేవల్లో ప్రభుత్వ రంగం వాటా శాతం - ఔట్‌పేషెంట్ కేర్)**

**2.2.3. వ్యయం**

ప్రయివేటు రంగం భారీగా విస్తరించటం, ఆ రంగం సేవలనే ఎక్కువశాతం ప్రజలు వినియోగించుకోవటం వల్ల సహజంగానే ఆరోగ్య సేవల్లో ప్రయివేటు వ్యయం కూడా పెరిగింది. సి.హెచ్.ఇలో దాదాపు 75 శాతం ప్రయివేటు వర్గాల నుంచే వస్తోంది (గణాంక పటం 2.2). జి.డి.పిలో 3.53 ఉన్న జి.హెచ్.ఇ.. దేశంలోని టి.హెచ్.ఇలో 93 శాతానికి సమానం. కాబట్టి, దేశంలో ఆరోగ్య సేవల కోసం చేసే ఆరోగ్య వ్యయంలో మూడొంతులు ప్రయివేటు చెల్లింపు నుండే వస్తోంది.

**(గణాంక పటం 2.2: ప్రస్తుత ఆరోగ్య వ్యయంలోని వివరాలు అంశాల వారీగా, 2016-17)**

సి.హెచ్.ఇలో ప్రయివేటు వ్యయం వాటా అంత ఎక్కువగా ఉండటం చెప్పుకోదగిన ఏ పెద్ద దేశంలోనూ కనిపించదు. ఆ వాటా అమెరికాలో 49.6%, జర్మనీలో 22.32%, చైనాలో 43.6%, బ్రెజిల్‌లో 58.2%, వియత్నాంలో 52.6%గా ఉంది (అధ్యాయం 1లోని పట్టిక 1.2ను చూడండి).

టి.హెచ్.ఇలో ప్రయివేటు ఆరోగ్య వ్యయం వాటా భారీగానే కొనసాగుతున్నప్పటికీ, తగ్గుముఖంలో ఉందని గత 15 ఏళ్ల జాతీయ ఆరోగ్య గణాంకాలు వెల్లడిస్తున్నాయి (గణాంక పటం 2.3). 2004-05 నుండి 2016-17 నాటికి ఆ వాటా దాదాపు 10 శాతం తగ్గిందన్నది కూడా గమనార్హం.

దేశంలోని మొత్తం ఆరోగ్య వ్యయంలో ప్రయివేటు వ్యయం వాటా అసంబద్ధమైన రీతిలో భారీఎత్తున ఉండటం వల్ల.. ప్రభుత్వం చేసే తలసరి ఆరోగ్య వ్యయం కంటే తలసరి ప్రయివేటు వ్యయం కూడా భారీగా పెరిగింది. 2016-17లో తలసరి

ప్రయివేటు ఆరోగ్య ఖర్చు రూ.2963గా ఉంది. ప్రభుత్వ తలసరి వ్యయానికి (రూ.1418) ఇది రెట్టింపు కంటే ఎక్కువ. గణాంక పటం 2.4లో చూపినట్లు, ఈ శతాబ్దం ప్రారంభం నుండీ ప్రభుత్వ, ప్రయివేటు తలసరి వ్యయం మధ్య అంతరం పెరగటమో లేక అలాగే కొనసాగటమో జరిగింది (అనుబంధం 2.5).

**(గణాంక పటం 2.3: మొత్తం ఆరోగ్య వ్యయంలో ప్రయివేటు ఖర్చు శాతం, 2016-17,**

**గణాంక పటం 2.4: ప్రభుత్వ, ప్రయివేటు తలసరి ఆరోగ్య వ్యయం, 2000-2018)**

**2.3. ప్రజలు సొంతంగా చేస్తున్న ఖర్చు భారం**

ఆరోగ్యంలో ప్రయివేటు వ్యయం భారీగా ఉండటం వల్ల భారతదేశంలో పేద, మధ్యతరగతి వర్గాలపై విపరీత భారం పడుతోంది. ప్రయివేటు ఆరోగ్య వ్యయంలో భాగమైన అయిదు అంశాల్లో (గణాంక పటం 2.2 చూడండి).. ప్రయివేటు ఆరోగ్య బీమా, ఓ.ఓ.పి.ఇలు వ్యక్తులు నేరుగా భరిస్తున్న ఆరోగ్య భారానికి స్పష్టమైన నిదర్శనాలు. ఈ రెంటిలో కూడా ఖర్చు.. పొదుపు చేసిన డబ్బు నుంచో, ఇతర మార్గాల నుంచో హఠాత్తుగా చేయాల్సింది కావటంతో ఓ.ఓ.పి.ఇ ఆర్థికంగా ప్రజల్ని మరింతగా ఛిద్రం చేస్తోంది. ఆరోగ్య సేవలు అందుకునే చోట ఆరోగ్య అవసరానికి చెల్లింపు భరోసా లేనప్పుడు ఓ.ఓ.పి.ఇ తప్ప గత్యంతరం లేకుండా పోతోంది. ప్రయివేటు ఇన్సూరెన్స్ కూడా ఈ సమస్యను పరిష్కరించకుండా అందుకు విరుద్ధ పద్ధతిలో వ్యవహరిస్తోంది. అనుకోకుండా, అనుకోనిరీతిలో ఉన్నపళంగా అయ్యే ఓ.ఓ.పి.ఇ భారాన్ని తీసుకోవటం లేదు. అనుకోని అవసరానికి చెల్లింపు భరోసా ఇవ్వాలంటే క్రమం తప్పకుండా కిస్తీల్ని చెల్లించాలని ప్రయివేటు ఇన్సూరెన్స్‌లు అడుగుతున్నాయి. భారత్‌లో ప్రయివేటు ఆరోగ్య బీమా వర్తింపు చాలా తక్కువగా, మొత్తం జనాభాలో 3% మేర మాత్రమే ఉంది (అధ్యాయం 5లో పట్టిక 5.6). దీంతోపాటు, ఈ కొద్దిపాటి కవరేజీ కూడా జనాభాలోని ఎక్కువ సంపన్న వర్గాలకి మాత్రమే పరిమితమైంది. పేద వర్గాలకు.. ఆరోగ్య అవసరాలకు ఆర్థిక నష్ట ప్రమాదం నుండి కాపాడే ఎటువంటి రక్షణ ఛత్రం లేదు (పట్టిక 2.3). నాణ్యమైన సేవలందించే ప్రభుత్వ ఆరోగ్య వ్యవస్థ అందుబాటులో లేకపోవటంతో, దిగువ, మధ్యాదాయ వర్గాల ప్రజలు విధిలేని పరిస్థితుల్లో ప్రయివేటు సౌకర్యాల వద్ద ఓ.ఓ.పి.ఇని వెచ్చించాల్సి వస్తోంది. సి.హెచ్.ఇలో కేవలం 5% మాత్రమే ప్రయివేటు ఆరోగ్య బీమాకు వెచ్చిస్తుండగా, 63 శాతం సి.హెచ్.ఇ.. ఓ.ఓ.పి.ఇ అని మనం గణాంక పటం 2.2లో చూశాం. ఈ ఓ.ఓ.పి.ఇ వాటా మిగిలిన అన్ని పెద్ద దేశాల్లో కంటే కూడా చాలా ఎక్కువ. ఉదాహరణకి, సి.హెచ్.ఇలో వాటాగా ఓ.ఓ.పి.ఇ.. అమెరికా, జర్మనీ, చైనా, వియత్నాంలలో వరుసగా 11 శాతం, 12.6 శాతం, 35.75 శాతం, 44.9 శాతం మాత్రమే (అధ్యాయం 1లో పట్టిక 1.2ను పరిశీలించండి).

**(పట్టిక 2.3: వివిధ వర్గాల ప్రజానీకంలో ప్రయివేటు బీమా కవరేజీ)**

అంత భారీ ఓ.ఓ.పి.ఇ భారం జనాభాలోని పేదవర్గాల జీవితాల్లో తీవ్ర విపరిణామాలను కలిగిస్తోంది. ఆరోగ్య వ్యయాల్ని తమకు తామే భరించాల్సి రావటం వల్ల.. ఆరోగ్యానికి ఆర్థిక రక్షణ కొరవడటం వల్ల కలిగే తీవ్ర కష్టనష్టాల మధ్య పేద, మధ్యతరగతివారు నిరంతరం నలిగిపోతున్నారు. ఫలితంగా, ఓ.ఓ.పి.ఇ వల్ల పేదరికం, అనారోగ్యం వల్ల ఆదాయాన్ని కోల్పోవటం భారత్‌లో పెద్దఎత్తున చోటుచేసుకున్నాయి. దీని పర్యవసానాలు రెండు రకాలుగా ఉన్నాయి. మొదటిది, పేదరిక రేఖకు కాస్త ఎగువకు చేర్చగలిగాం అనుకునేలోపే కోట్లాదిమంది పేదరికంలోకి జారిపోతున్నారు. భారత్‌లో పేదరికాన్ని అధిగమించిన వారిలో దాదాపు 5% మంది (3.5 కోట్ల మంది) 2004-05లో కేవలం ఆరోగ్య ఖర్చుల కారణంగా పేదలుగా మారిపోయారని ఒక అధ్యయనం అంచనా వేసింది. మరో అధ్యయనం ప్రకారం, రాష్ట్రాలవారీ అధికారిక దారిద్ర్య రేఖ ప్రమాణాలకనుగుణంగా లెక్కేస్తే 2011-12లో దాదాపు 5.5 కోట్ల మంది కేవలం చికిత్స ఖర్చుల వల్ల పేదరికంలోకి జారిపోయారు (పట్టిక 2.4). నిజానికి, ఆరోగ్య ఖర్చుల వల్ల ఏటా 6 కోట్ల మంది ప్రజలు పేదలుగా మారిపోతున్నారని జాతీయ స్థాయి ప్రభుత్వం అంచనా వేస్తోంది. రెండోది, అప్పటికే దారిద్ర్య రేఖకు దిగువన ఉన్నవారి పేదరికాన్ని ఓ.ఓ.పి.ఇ మరింత దుర్భరం చేస్తోంది. పట్టిక 2.4 చూపినట్లు, ఓ.ఓ.పి.ఇ వ్యయం పేదల నెలవారీ వినియోగ వ్యయంపై పెద్దఎత్తున భారం మోపుతూ, వారి ఆర్థిక కష్టాల్ని ఇంకా తీవ్రతరం చేస్తోంది. అయితే, ఈ అంచనాలు దేశవ్యాప్త సగటును తెలియజేసేవి. కేసుల వారీగా పరిశీలిస్తే ఈ భారం అనేక రెట్లు ఎక్కువగా ఉంటుంది. ముఖ్యంగా, పెద్ద అనారోగ్య సమస్య తలెత్తినప్పుడు చేసే వ్యయం తీవ్ర ఆర్థిక దుస్థితికి దారితీస్తోంది, పెనుభారమవుతోంది.

పెరిగిపోతున్న ఓ.ఓ.పి.ఇ భారం సవాలును ఎదుర్కోవటం కోసం.. ఆ పెరుగుదల తీరు, అందుకు ఎక్కువగా దోహదం చేస్తున్న అంశాలను గుర్తించటం అవసరం. 2004-05, 2011-12 మధ్య కాలంలో, నిరుపేద వర్గంపై ఉన్న ఓ.ఓ.పి.ఇ భారం అతి ఎక్కువ స్థాయిలో పెరిగింది (పట్టిక 2.5). కుటుంబ వినియోగ వ్యయంలో పెరుగుదల కంటే ఓ.ఓ.పి.ఇ పెరుగుదల రేటు ఎక్కువగా ఉంది. దీనివల్ల కుటుంబ వినియోగ వ్యయంలో ఓ.ఓ.పి.ఇ వాటా ఆ మేరకు పెరిగింది.

మొత్తం కుటుంబ వినియోగ వ్యయంలో ఆరోగ్యం కోసం వెచ్చించే ఓ.ఓ.పి.ఇ క్రమంగా పెరుగుతూ 1993-94లో 4.9 శాతం నుండి 2004-05లో 6%కి, 2011-12లో 7.2%కి చేరింది. 2004-05 నుంచి 2011-12 మధ్య, ఓ.ఓ.పి.ఇ వాటా పెరుగుదల జనాభాలో నిరుపేద 20 శాతానికి అత్యధికంగా ఉంది (గణాంక పటం 2.5). సాధారణంగా రోజువారీ వినియోగ వ్యయం వాటా సంపన్నుల ఆదాయంలో తక్కువగా, పేదల ఆదాయంలో పెద్దఎత్తున ఉంటుంది. ఫలితంగా, అధిక ఓ.ఓ.పి.ఇ, ఆరోగ్య వైఫల్యం వల్ల వేతనాన్ని, ఆదాయాల్ని కోల్పోవటం పేద, మధ్యతరగతి వర్గాలకు చాలా సందర్భాల్లో

అశనిపాతమవుతోంది. వారిని మరింత పేదరికంలోకి నెట్టటమో, వారి కుటుంబాల్ని ఆర్థికంగా కుంగదీయటమో చేస్తోంది.

ఓ.ఓ.పి.ఇ భారంలో రెండు అంశాలున్నాయి. ఒకటి, వైద్య సంప్రదింపు కోసమో, ఆస్పత్రిలో చేరటం వల్లో ఆరోగ్య సేవలందించేవారికి చెల్లించిన డబ్బు. రెండోది, రోగ నిర్ధారణ పరీక్షలు (డయాగ్నొస్టిక్‌లు), మందులు, ఇతరాలు వగైరాలకు చేసే ఖర్చు. ఆరోగ్య సేవలందించేవారికి చేసే చెల్లింపులకి సంబంధించి, సంస్థాగత వ్యయం (ఇన్‌పేషెంట్ కేర్) మొత్తం ఓ.ఓ.పి.ఇలో పెరుగుతోంది. ఓ.ఓ.పి.ఇలో ఆస్పత్రి సేవల వ్యయం 1993-94లో 26.2 శాతం ఉండగా, 2004-05లో 40.7 శాతం, 2011-12లో 46.1 శాతంగా ఉంది. ఇన్‌పేషెంట్ సేవలు ఖరీదైనవి కావటంతో, ఆస్పత్రిలో అప్పుడప్పుడూ చేరినా సరే అందుకయ్యే సంస్థాగత వ్యయం వాటా, ముఖ్యంగా ప్రయివేటు ఆస్పత్రుల్లో ఓ.ఓ.పి.ఇలో క్రమంగా పెరుగుతూ వస్తోంది. ఆరోగ్యం కోసం చేసే ఓ.ఓ.పి.ఇలో అధికంగా ఔట్‌పేషెంట్ సేవల వాటాయే ఉంది. వైద్య సలహా వ్యయం ఎక్కువ కాకపోవచ్చుగానీ, ఆస్పత్రి సంరక్షణ కంటే ఔట్‌పేషెంట్ సంప్రదింపులు పెద్దసంఖ్యలో ఉన్నాయి.

ఓ.ఓ.పి.ఇలోని అంశాల్లో మందులపై చేసే ఖర్చు ప్రధానంగానే ఉన్నప్పటికీ, ఇతర అంశాలకు భిన్నంగా, ఈ వాటా 1993-94 నుంచి తగ్గటం మొదలైంది (1993లో 78% ఉండగా, 2004-05లో 66%, 2011-12లో 63% ఉంది). ఇదే సమయంలో రోగ నిర్ధారణ పరీక్షలపై వ్యయం భారీగా పెరిగింది. 1993-94లో 2% నుండి 2011-12లో 8%కి ఈ ఖర్చు పెరిగింది. దీన్ని అనుసరించి 'ఇతరాల్లో' ఖర్చు కూడా పెరిగింది (1993-94లో 8 శాతం నుండి 2011-12లో 17%కి). సాంకేతిక పురోగమనం వల్ల లేదా మితిమీరిన టెస్టులతో అనవసర వినియోగం వల్ల ఖర్చులు పెరిగాయనటానికి డయాగ్నోస్టిక్‌ల వాటాలో పెరుగుదల సంకేతం కావచ్చు. ఖర్చు పెరగటానికి కారణాలు ఏవైనా.. నాణ్యమైన, అందుబాటులో ఉండే డయాగ్నోస్టిక్ సేవలు పటిష్ఠ ప్రజారోగ్య వ్యవస్థలో కీలకావసరం. దీంతోపాటు, 'ఇతరాలు' విభాగంలో రవాణా, బస, ఆహారం వంటి వ్యయాలు ఉండే అవకాశమున్నందున, ఆరోగ్య సేవలు ఉన్నకొద్దీ పేదలకు, గ్రామీణ ప్రాంతాల్లో, చిన్న పట్టణాల్లో ఉంటున్నవారికి భారంగా మారుతున్నాయి. ఈ విభాగాల్లో పెరుగుదల భారం నిరుపేద వర్గాలపైనే అత్యధికంగా ఉంటున్నదన్న అధ్యయనం.. ఈ వాస్తవాన్ని మరింత ధృవీకరిస్తుంది (గణాంక పటం 2.5). ఈ నేపథ్యంలో ఆరోగ్యంపై చేసే ఓ.ఓ.పి.ఇ పేద కుటుంబాల ఆర్థిక స్థితిపై తరచూ వినాశకర ప్రభావాన్ని చూపుతోందనటంలో ఆశ్చర్యం లేదు.

**(పట్టిక 2.4: మొత్తం ఓ.ఓ.పి.ఇ, వైద్య వ్యయం వల్ల భారత్‌లో కుటుంబాలు పేదరికంలోకి జారిపోతున్న వైనాన్ని తెలియచేసే సూచికలు: 1993-1994, 2004-2005, 2011-2012.**

**పట్టిక 2.5: తలసరి మొత్తం వినియోగ వ్యయం, తలసరి ఓ.ఓ.పి.ఇ పెరుగుదల (సి.ఎ.జి.ఆర్)**

**గణాంక పటం 2.5: వివిధ వర్గాల వినియోగ వ్యయంలో ఓ.ఓ.పి.ఇ వాటా శాతం పెరుగుదల)**

**గణాంక పటం 2.6: ఓ.ఓ.పి.ఇ, అందులోని విభాగాల మిశ్రిత (కాంపౌండ్) పెరుగుదల వార్షికంగా, 1993-94 నుండి 2011-12 వరకు)**

తీవ్ర అనారోగ్య సమస్యకు ఓ.ఓ.పి.ఇ వ్యయం ఉన్నప్పుడు, ఆరోగ్యంపై ఓ.ఓ.పి.ఇ ఖర్చు మొత్తం కుటుంబ వినియోగ వ్యయంలో 10 శాతంతో సమానం లేదా ఇంకా ఎక్కువ అని చెబితే.. ఓ.ఓ.పి.ఇ విపరిణామాలు మరింత బాగా అర్థమవుతాయి. తీవ్ర అనారోగ్యాల చికిత్స వ్యయ భారాన్ని మోస్తున్న కుటుంబాల సంఖ్య 2004లో 21 శాతం నుండి 2014లో సుమారు 25 శాతానికి పెరిగింది. ఈ పెరుగుదల కూడా ఎక్కువగా దిగువ స్థాయి వర్గాల్లోనే జరిగింది (పట్టిక 2.6). ఆరోగ్య సేవల్ని అందుకోవటం పేద, మధ్యతరగతి వర్గాలకు ఉన్నకొద్దీ భారంగా మారుతోందని, ఆయా కుటుంబాలు తీవ్ర ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోతున్నాయని తేటతెల్లమవుతోంది.

**(పట్టిక 2.6: ఎం.పి.సి.ఇ వర్గాల్లో తీవ్ర అనారోగ్య చికిత్సల వ్యయ భారం మోస్తున్న కుటుంబాలు- ఎన్.ఎస్.ఎస్ 2004, ఎన్.ఎస్.ఎస్ 2014)**

ఇన్‌పేషెంట్, ఔట్‌పేషెంట్ వ్యయాల్ని మొత్తంగా బేరీజు వేస్తే రెండోదే ఆర్థికంగా ఎక్కువగా భారంగా ఉంది. పేదల ఆదాయాలపై ఔట్‌పేషెంట్ కేర్ ఎంత పెద్ద భారం మోపుతోందో.. ఆరోగ్యంపై ఓ.ఓ.పి.ఇ వ్యయం పేదరికాన్ని పెంచుతున్న వైనంపై 2004-05 సంవత్సరానికి చేసిన ఓ విశ్లేషణ చాలా స్పష్టంగా వివరించింది. ఓ.ఓ.పి.ఇలో ఆస్పత్రి సేవల వ్యయం కాలక్రమంలో పెరిగినా, చాలామంది విషయంలో ఔట్‌పేషెంట్ సేవల వ్యయ భారమే ఎక్కువగా ఉంది. ఇన్‌పేషెంట్ కేర్‌పై ఓ.ఓ.పి.ఇని తొలగించి చూసినా కూడా ఆరోగ్యంపై ఓ.ఓ.పి.ఇ వల్ల (2004-05లో 3.53%) ఏటా పేదల సంఖ్యలో పెరుగుదలలో పెద్ద మార్పేమీ కన్పించలేదని (3.33%) షరావత్ ప్రభృతులు వెల్లడించారు (పట్టిక 2.7). కానీ ఓ.ఓ.పి.ఇ నుండి ఔట్‌పేషెంట్ సేవలను తొలగించినప్పుడు, పేదల సంఖ్య గణనీయంగా, 0.53 శాతానికి పడిపోయింది. ఆస్పత్రిలో చేరాల్సిన అవసరం ఉన్నవారిపై ఓ.ఓ.పి.ఇ భారం ఎక్కువగా ఉంటుందనటంలో సందేహం లేదు. అయితే, ఎక్కువశాతం ప్రజలు ఏటా ఆస్పత్రిలో చేరాల్సిన అవసరం ఉండదు. కానీ, సాధారణ అనారోగ్యాలకు లేదా దీర్ఘకాలిక వ్యాధుల నియంత్రణకి ఔట్‌పేషెంట్ సేవలు దాదాపు ప్రతి కుటుంబానికీ అవసరం. ఔట్‌పేషెంట్ కేర్ వల్ల ఆర్థిక భారంలో కూడా, మందుల కోసమే ఓ.ఓ.పి.ఇలో 60 శాతానికిపైగా అవుతోంది. ఓ.ఓ.పి.ఇ భారాన్ని తొలగించగలిగితే జనాభాలోని నిరుపేదలకు అతి పెద్ద ఉపశమనం లభిస్తుంది. తీవ్ర

అనారోగ్య సమస్యలకు చికిత్స భారాన్ని మోస్తున్న వివిధ వర్గాల కుటుంబాల శాతంలో భిన్న నేపథ్యాల్లో కూడా ఇదే తరహా ధోరణులు కన్పించాయి.

ఓ.ఓ.పి.ఇలో మందుల వ్యయం వాటా ఎక్కువగా ఉండటం డాక్టర్ కన్సల్టేషన్ ఫీజు తక్కువనటానికి సంకేతం. ఉదాహరణకి, 2018లో మందులపై వ్యయం మొత్తం ఓ.ఓ.పి.ఇలో గ్రామీణ ప్రాంతాల్లో 68 శాతంగా, పట్టణ ప్రాంతాల్లో 61 శాతంగా ఉంది. మరోవైపు, కన్సల్టేషన్ ఫీజు ఈ రెండు ప్రాంతాల్లో వరుసగా 12 శాతం, 16 శాతంగా ఉంది. ఎక్కువమంది ప్రజానీకం అనధికారికంగా వైద్యం చేసే వారి ద్వారా ఆరోగ్య సేవలను అందుకుంటున్నారనటానికి ఇదో సంకేతం కావచ్చు. దేశ ఆరోగ్య రంగంలో ఎల్లెడలా విస్తరించి ఉన్న వీరు ఫీజుని నామమాత్రంగానే తీసుకుంటూండవచ్చు. మందుల ధరలు అధికారిక విధానాలతో బయట నిర్ణయమై ఉంటాయి కాబట్టి వాటిని మార్చటం సాధ్యం కాదు కానీ, డాక్టర్ కన్సల్టేషన్ ఫీజును మాత్రం వైద్యం చేసే వారు ప్రాధాన్యతలకనుగుణంగా మార్చుకోవచ్చు. కాబట్టి, మరింత ఎక్కువమంది ఔట్‌పేషెంట్లను, ముఖ్యంగా దిగువ ఆదాయ వర్గాల నుండి ఆకర్షించటానికి అనధికారికంగా వైద్యం చేసేవారు కన్సల్టేషన్ ఫీజుని తక్కువగా తీసుకుంటూండవచ్చు. అటువంటి పరిస్థితి దుర్బల ఆరోగ్య సేవలతో తల్లడిల్లుతున్న దిగువ, మధ్యాదాయ వర్గాలకసమస్యను మరింత తీవ్రతరం చేస్తుంది. అనధికార వైద్య సేవలందించేవారి చేతిలో అశాస్త్రీయమైన, కొన్ని సందర్భాల్లో అపాయకరమైన చికిత్సా పద్ధతుల బారినపడే పెను ప్రమాదాన్ని వారు ఎదుర్కొంటుంటారు. కాబట్టి, అందరికీ అర్థవంతమైన ఆరోగ్యానికి, ముఖ్యంగా పెద్దఎత్తున పేదరికం ఉన్న సమాజంలో భరోసా అందించాలంటే.. ప్రభుత్వ ఆరోగ్య సేవలను తగినంతగా సమగ్ర రీతిలో అందుబాటులోకి తేవటం తప్పనిసరి.

ముఖ్యంగా పేద, దిగువ ఆదాయ వర్గాలపై పడుతున్న అపార ఆర్థిక భారాన్ని తగ్గించాలంటే, రోగి నామమాత్రపు రుసుమును లేదా అసలు ఎటువంటి ఫీజూ చెల్లించాల్సిన అవసరం లేకుండా చేస్తూ నాణ్యమైన ఔట్‌పేషెంట్ సేవలకు ప్రత్యేక ప్రాధాన్యతతో మన ఆరోగ్య వ్యవస్థను రూపొందించాలి. ఔట్‌పేషెంట్ కేర్ సమగ్రంగా ఉండాలి. వైద్యునితో సంప్రదించే సదుపాయం, తప్పనిసరి మందులు, డయాగ్నోస్టిక్ సేవలు చాలామేర ఉచితంగా ఉండటం, ఆరోగ్య సేవల వినియోగదారులు ప్రశ్నించగలిగేలా, విధిగా జవాబుదారీతనం ఉండేలా నామమాత్రపు రుసుము ఏర్పాట్లు.. ఔట్‌పేషెంట్ సేవల్లో భాగంగా ఉండాలి. ఆరోగ్య సేవల కోసం రవాణా వంటి ఉప వ్యయాల భారం ప్రజలపై పెరుగుతోందన్న వాస్తవాన్ని కూడా మనం విస్మరించకూడదు. కాబట్టి మనం రూపొందించే వ్యవస్థ ప్రజలపై భారాల్ని తగ్గించి, ఓ.ఓ.పి.ఇని తగ్గించేలా ఉండాలి.

**(పట్టిక 2.7: ఆరోగ్య వ్యయం వల్ల పేదరికం (2004-05) వివిధ ఓ.ఓ.పి.ఇ నేపథ్యాల్లో పేదల సంఖ్యలో పెరుగుదల (%))**

ఓ.ఓ.పి.ఇ, తీవ్ర అనారోగ్యాలకు అవుతున్న ఖర్చుకు సంబంధించి వివిధ రాష్ట్రాల మధ్య విస్తృత తేడాలున్నందున.. వ్యవస్థ నిర్మాణం కూడా రాష్ట్రాలవారీగా మారొచ్చు. సాంక్రమిక వ్యాధుల నుండి అసాంక్రమిక వ్యాధులకు పరివర్తన (ఎపిడమలాజికల్ ట్రాన్సిషన్) స్థాయి ఎక్కువగా ఉన్న రాష్ట్రాల్లో ఓ.ఓ.పి.ఇ వ్యయం చేస్తున్న కుటుంబాల సంఖ్య పెరుగుతోందని పొందే తదితరులు వెల్లడించారు (ఇలా 12 రాష్ట్రాలున్నాయి. ఇందులో పూర్వపు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కూడా ఉంది). సాంక్రమిక, సాంక్రామికేతర వ్యాధులలో డి.ఎ.ఎల్.వైల నిష్పత్తిని అనుసరించి ఈ రాష్ట్రాలను వర్గీకరించారు. ఇటువంటి రాష్ట్రాల్లో భారం పెరుగుతుండటంతోపాటు, తలసరి ఓ.ఓ.పి.ఇ కూడా ఎక్కువగా ఉంది. సాంక్రమిక వ్యాధుల నుండి పరివర్తన స్థాయి ఎక్కువగా ఉన్న రాష్ట్రాల్లో ఓ.ఓ.పి.ఇ భారం పెరుగుతున్న తీరులోనే, తీవ్ర అనారోగ్యాల ఖర్చు భారం కూడా ఎక్కువగా ఉంది. నిజానికి, తీవ్ర అనారోగ్యాల ఖర్చు భారం 2004-2014 మధ్య పెరిగింది ఈ 12 రాష్ట్రాలలోనే. ఈ ధోరణులకు కారణాలు ఫలానా అంటూ ఇతిమిద్ధంగా నిగ్గు తేలలేదు గానీ, వాస్తవానికి దగ్గరగా వివిధ రకాల వివరణల్ని చెప్పుకోవచ్చు. అటువంటి ఒక పరికల్పన ఏమిటంటే, సాంక్రమిక వ్యాధులకనుండి పరివర్తన స్థాయి ఎక్కువగా ఉన్న రాష్ట్రాల్లో అసాంక్రమిక వ్యాధులు, గాయాలు ఎక్కువగా ఉండటం ఎక్కువ ఆరోగ్య వ్యయ భారానికి కారణం. ఎన్.సి.డిల వల్ల తలెత్తే సమస్యలకు చికిత్స సాధారణంగా ఖరీదైనది, దీర్ఘకాలంపాటు ఉంటుంది కాబట్టి.. ఈ రాష్ట్రాల్లో ఆరోగ్య సేవల్ని ఎక్కువగా వినియోగించుకోవటం కూడా ఇంకో కారణం కావచ్చు. సాంక్రమిక వ్యాధుల నుండి పరివర్తన స్థాయి తక్కువగా ఉన్న రాష్ట్రాల్లో అసాంక్రమిక వ్యాధుల భారం పెరుగుతున్నప్పటికీ అందుబాటులో ఆరోగ్య సేవలు లేవని కూడా విశ్లేషించవచ్చు.

**2.4: భారత ఆరోగ్య వ్యవస్థ ఎదుర్కొంటున్న సవాళ్లు, విహంగ వీక్షణం**

భారత్‌లో ఆరోగ్య వ్యవస్థను బలోపేతం చేసేందుకు రూపొందించే ఏ పరిష్కారమైనా కూడా దేశవ్యాప్తంగా ఆరోగ్య సేవలను ప్రభావితం చేస్తున్న ఈ దిగువ సవాళ్లను పరిగణలోకి తీసుకోవాలి. ఈ సవాళ్లు ఎన్నో ఉండటం, ఎంతో పెద్దఎత్తున విస్తరించి ఉండటం వల్ల మన ముందున్న బాధ్యత కష్టతరమైనది.

1. ప్రజారోగ్యంపై ప్రభుత్వపరంగా మనం చేస్తున్న ఖర్చు జి.డి.పిలో ఒక శాతానికి కాస్త ఎక్కువగా మాత్రమే ఉంది. నాణ్యమైన వైద్య సేవలను అందరికీ అందించాలంటే ఈ శాతం బాగా తక్కువ. మన దేశ ఆదాయ స్థాయిలకి అనుగుణంగా చూస్తే, ఓ.ఓ.పి.ఇ మితిమీరిన భారం. దీనివల్ల కోట్లాది ప్రజలు ఏటా పేదరికం దిగువకు జారిపోతున్నారు.
2. చికిత్సల భారం వల్ల కోల్పోతున్న డి.ఎ.ఎల్.వైలు అభివృద్ధి చెందిన ఓ.ఇ.సి.డి దేశాలతో పోల్చి చూసినపుడు మాత్రమే కాకుండా, అనేక మధ్య, దిగువ ఆదాయ దేశాలతో పోల్చి చూసినా కూడా మన దేశంలో గణనీయంగా ఎక్కువ (అధ్యాయం 1లోని పట్టిక 1.4ను పరిశీలించండి).
3. ఈవేళ కూడా క్షయ, మలేరియా, డెంగీ, డయేరియా వంటి

అంటువ్యాధులు మన ఆరోగ్య వ్యవస్థకు పెద్ద స్థాయి సవాలునే విసురుతున్నాయి.

4. ఇప్పటికే నిధుల కొరతతో, అధ్వాన్నంగా ఉన్న వ్యవస్థకు ఎన్.సి.డిల పెరుగుదల మరో పెద్ద సవాలుగా పరిణమించింది. ఇందుకు రెండు కారణాలున్నాయి. మొదటిది, ప్రాథమిక దశలోనే వ్యాధిని గుర్తించి, నివారించే చర్యలు లోపించటం. దీని వల్ల చిన్న అనారోగ్యాలు దీర్ఘకాల వ్యాధులుగా పరిణమించే అవకాశాలు ఎక్కువవుతున్నాయి. ఫలితంగా వ్యాధి ప్రబలత, మరణాల సంఖ్య పెరుగుతున్నాయి. రెండోది, ప్రజల ఆరోగ్య అవసరాలు మారుతున్నకొద్దీ, ఖరీదైన, అధునాతనమైన వైద్య సేవలు అవసరమవుతూ, అటు రోగులకు, ఇటు వ్యవస్థకు అయ్యే ఖర్చులు కూడా పెరుగుతుంటాయి.
5. సమగ్రమైన ప్రాథమిక ఆరోగ్య సేవలను అందించే దిశలో ప్రభుత్వాల విధానాలు లేకపోవటంతో, ప్రయివేటు రంగంలో ఫ్యామిలీ డాక్టర్ల వ్యవస్థ గణనీయంగా తగ్గిపోయింది. ఆస్పత్రి సేవల మీద ఆధారపడటం పెరిగింది.
6. ద్వితీయ స్థాయిలో చేయాల్సిన వైద్యాన్ని మూడో దశ లేదా మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రుల్లో చేయటం ఉన్నకొద్దీ పెరుగుతోంది. దీనివల్ల, అందుబాటు ఖర్చుతో నాణ్యమైన వైద్యాన్ని అందించే చిన్న నర్సింగ్ హోంల సంఖ్య తగ్గిపోయింది.
7. తృతీయ స్థాయి వైద్యం ప్రయివేటు రంగంలో భరించలేనంత ఖరీదైనది. ప్రభుత్వ రంగ ఆస్పత్రులు ప్రస్తుతం తగినన్ని నిధులు, సదుపాయాలు లేక అత్యుత్తమ నైపుణ్యమున్నవారిని ఆకర్షించలేకపోతున్నాయి. సాంక్రమిక వ్యాధుల నుండి పరివర్తన వల్ల ప్రజల ఆరోగ్య అవసరాలు మారుతున్నకొద్దీ, ఆరోగ్య వ్యయాలు అనివార్యంగా పెరుగుతుంటాయి. సాంకేతికతలో ముందడుగులు ఈ పెరుగుదలకు ఇంకా దోహదం చేస్తాయి. ఇటువంటి నేపథ్యంలో, తృతీయ స్థాయి వైద్యంలో ఏక చెల్లింపు (సింగిల్-పేయర్) ఇన్సూరెన్స్ వల్ల వ్యయాలు అమాంతం పెరిగిపోతూ ఖజానాను ఖాళీ చేస్తాయి. ఫలితంగా, దీర్ఘకాలంలో అలాంటి వ్యవస్థను కొనసాగించటం కష్టమవుతుంది.

ఈ సవాళ్లను ఎదుర్కోవటానికి ఆరోగ్య వ్యవస్థలో హేతుబద్ధమైన రీతిలో ప్రభుత్వ పెట్టుబడిని పెంచటం అవసరం. నాణ్యమైన ఆరోగ్యానికి దేశంలో భారీ డిమాండ్ ఉంది. ప్రయివేటు రంగం నుంచి పెట్టుబడుల ప్రవాహం ఉధృతమవుతుండటమే ఇందుకు సంకేతం. 2011లో 94 మిలియన్ అమెరికన్ డాలర్ల నుండి 2016లో 1,275 మిలియన్ డాలర్లకి, అంటే 13.5 రెట్లు ఈ పెట్టుబడులు పెరిగాయి. ఇందులో 647 మిలియన్ డాలర్లు విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి (ఎఫ్.డి.ఐ) నిధులు. 2015-16 సంవత్సరం వచ్చిన మొత్తం ఎఫ్.డి.ఐ నిధుల్లో ఇది 1.6%. అయితే, మూడో దశ వైద్యంలో ప్రయివేటు పెట్టుబడులు పెరగటం వల్ల ఎక్కువమంది రోగులకు తగిన ఫలితం లభించదు. పేద, మధ్యతరగతి వర్గాలకు ఈ సేవలు చేరువ కూడా కాలేవు.

ప్రభుత్వ పెట్టుబడి తగినంత లేకుంటే, నాణ్యమైన ఆరోగ్య సేవలు పేద, మధ్యతరగతి వర్గాలకు చాలామేర అందుబాటులో లేకుండా పోతాయి.

భారతదేశ ఆరోగ్య వ్యవస్థలో నిర్దిష్టంగా ఉన్న పలు రీతుల్లోని ప్రతి అంశాన్నీ పరిగణలోకి తీసుకుని ఒక సమగ్ర దృక్పథంతో ఆరోగ్య సేవల విధానాన్ని రూపొందించటం ఇప్పుడు మనం చేయాల్సిన పని. ఈ అధ్యాయంలో స్థూలంగా పేర్కొన్నట్లు.. మన సమాజంలో, దేశంలో ఉన్న అపార వైవిధ్యాన్ని దృష్టిలో పెట్టుకుని ఏకకాలంలో పరిష్కరించాల్సిన అనేక అంశాలున్నాయి.

అక్కడ కొంత, ఇక్కడ కొంత తరహాలో అరకొర చర్యలు ఆరోగ్య సేవల్లో ఆశించిన ఫలితాన్నివ్వవు. ఆరోగ్య సేవల్ని సమగ్రంగా చూడకుండా ఆరోగ్య కార్యక్రమాల్ని ప్రత్యేక పథకాలుగా విభజించటం వల్ల ఆచరణలో ఫలితం లేదని రెండు స్థాయిల్లో తేలింది: ఒకటి, కార్యక్రమాలపై ఖర్చుకు తగ్గ ఫలితాలు లేవు. రెండోది, ప్రజలు ఎక్కువ చెల్లిస్తూ, ఎక్కువ కష్టాల పాలవుతున్నారు. కింది స్థాయిలో తగిన ఔట్‌పేషెంట్ సేవలు లేకపోవటం వల్ల తేలిగ్గా నయం చేయగల సమస్యలు తీవ్ర అనారోగ్యాలుగా, ప్రాణం మీదకు తెచ్చే జబ్బులుగా మారుతున్నాయి. ప్రాథమిక వైద్యంలో వైఫల్యం, పై స్థాయి వైద్యానికి సిఫారసు పద్ధతి కొరవడటం.. తృతీయ స్థాయి వైద్యంపై పెనుభారం మోపుతున్నాయి. రోగులు కిక్కిరిసిపోవటానికి, సేవలు అధ్వాన్నమవటానికి, ప్రజల విశ్వాసం సన్నగిల్లటానికి కారణమవుతున్నాయి. నాణ్యమైన ఆరోగ్యం విశ్వసనీయత కొరవడి తరచూ నిర్లక్ష్యపూరితంగా ఉండటం, ప్రయివేటు సేవలు మోయలేని భారం కావటం, సొంతంగా జేబుల్లో నుండి చేసే ఖర్చు తడిసి మోపెడవటం, జబ్బు వల్ల పెరిగే ఇతర భారాలు, ప్రజలు ఉత్పాదకతను, ఆదాయాల్ని కోల్పోవటం, ఆరోగ్యకరమైన జీవన సంవత్సరాల్ని కోల్పోవటం, నాణ్యమైన జీవితం తగ్గిపోవటం.. ఇలా మన జీవితాలు, జీవనోపాధుల మీద ఆరోగ్యసంక్షోభం అనేక రకాలుగా ప్రత్యక్షంగా తీవ్ర ప్రభావాల్ని కనబరుస్తోంది.

ఇప్పటికే ఉన్న పునాదుల మీద సాపేక్షంగా తక్కువ ఖర్చయ్యే, అదే సమయంలో సమర్థవంతమైన, అందుబాటులో ఉండేటువంటి ఆరోగ్య సంరక్షణ వ్యవస్థను నిర్మించటం ఇప్పుడు భారత్ ముందున్న సవాలు. సమూల ప్రక్షాళన ఆచరణసాధ్యం కాదు, సాధ్యం కూడా కాదు. ఖజానాకున్న పరిమితుల వల్ల ఇబ్బడిముబ్బడిగా నిధుల్ని భారతదేశం వెచ్చించలేదు. మౌలిక వసతుల సంస్థల్ని, ప్రోత్సాహకాల్ని పరిగణలోకి తీసుకుంటూ సమర్థవంతమైన, నిరంతరాయమైన, తక్కువ ఖర్చుతో సుసాధ్యమైన అత్యుత్తమ ఫలితాల్ని సాధించే సమగ్ర ఆరోగ్య వ్యవస్థను నిర్మించటం మన లక్ష్యం కావాలి.

### 2.5: భారతదేశ ఆరోగ్య వ్యవస్థ బలాలు

ఆరోగ్య రంగంలో మనకు అసాధారణ సవాళ్లున్నాయి. అయితే, భారత్‌కు మాత్రమే ప్రత్యేకమైన, దేశ ఆదాయానికి అనుగుణమైన అనేక సానుకూలతలు కూడా ఉన్నాయి. వాటిని

సరిగా వినియోగించగలిగితే అందరికీ ఆరోగ్యాన్నిచ్చే ఒక పటిష్ఠ ఆరోగ్య వ్యవస్థను నిర్మించగలం. మిగతా అనేక అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థలకు భిన్నంగా, భారతదేశం పెద్దసంఖ్యలో వైద్యులు, నర్సులు, ఇతర ఆరోగ్య వృత్తి నిపుణుల్ని తయారుచేస్తోంది. మానవ వనరుల్లో మనం స్వయంసమృద్ధం. కొన్నేళ్లుగా, మన వైద్యుల్లో చెప్పుకోదగినంతమంది విదేశాల్లో శిక్షణ పొంది నైపుణ్యాన్ని సాధించారు. వారి నైపుణ్యం, నిష్ణాతత వల్ల అనేక సంక్లిష్ట ప్రక్రియలు, అధునాతన ఆపరేషన్లు, వైద్య సేవలు భారత్‌లో అందుబాటులోకి వచ్చాయి. గుండె నాళాల బైపాస్ గ్రాఫ్ట్, మోకాలు మార్పిడి, మూత్రపిండాల మార్పిడి మొదలైన వైద్య ప్రక్రియల్లో మన విజయాల శాతం, భద్రత రికార్డు ప్రపంచ ప్రమాణాలకు దీటుగా ఉంది. మన దేశంలో అనేక వైద్య ప్రక్రియలకు అయ్యే ఖర్చు ప్రపంచంలోనే అతి తక్కువ వ్యయాలతో సమానంగా ఉంది. చాలా కేసుల్లో ఓ.ఇ.సి.డి దేశాల్లో అయ్యే ఖర్చుల్లో ఐదో వంతు నుంచి పదో వంతు మాత్రమే అవుతోంది. మన ఔషధ రంగం ఓ పెద్ద విజయగాథ. భారతదేశం అత్యున్నత నాణ్యత కలిగిన ఔషధాల్ని అతి తక్కువ ధరలకే ఉత్పత్తి చేస్తోంది. అనేకమంది పేద భారతీయులు మందుల కోసం ఓ.ఓ.పి.ఇ వ్యయం చేస్తూ ఔషధాల ఖర్చు భారంగా భావిస్తుంటారుగానీ, ప్రపంచ ప్రమాణాల ప్రకారం చూస్తే మన ఔషధాలు చాలా చౌక. భారతదేశం ప్రపంచంలోనే అత్యంత నాణ్యమైన టీకాలను అతి తక్కువ ఖర్చుతో తయారుచేస్తోంది. మనం వీటన్నిటినీ, ఇతర బలాలతో కలిపి ఒక సమర్థవంతమైన, ఆర్థికభారం లేని ఆరోగ్య సంరక్షణ నమూనా కోసం వినియోగించాలి.

ఆరోగ్య రంగంలోకి ఏటా డాక్టర్లు పెద్దసంఖ్యలో ప్రవేశిస్తున్నారు. మనకున్న 542 వైద్య కళాశాలలు ప్రతి సంవత్సరం 80,000 మంది వైద్య గ్రాడ్యుయేట్లను తయారుచేస్తున్నాయి. చైనాను మినహాయిస్తే, ఏటా ఆరోగ్య రంగంలోకి వచ్చే అర్హులైన మెడికల్ డాక్టర్ల సంఖ్య ప్రపంచంలోనే మన దేశంలో అత్యధికం (గణాంక పటం 2.7). ప్రస్తుతమున్న వ్యవస్థాగత మౌలిక సదుపాయాలు దేశ అవసరాలకు తగ్గట్లు వైద్యులు, ఇతర ఆరోగ్య సిబ్బందిని సమకూర్చగల స్థాయిలో ఉన్నాయి. అయితే, నర్సుల విషయంలో ఆ పరిస్థితి లేదు. వైద్య గ్రాడ్యుయేట్లు, నర్సింగ్ గ్రాడ్యుయేట్ల నిష్పత్తి అసమతుల్యంగా ఉంది. మనకు మరింతమంది నర్సులు కావాలి. ముఖ్యంగా జనాభా పరివర్తన చోటు చేసుకుంటూ, అసాంక్రమిక వ్యాధులకు ఇంకా ఎక్కువగా నర్సింగ్ సేవలు అవసరమవుతున్న తరుణంలో. ఈ అంశాన్ని మినహాయిస్తే.. ఆరోగ్య రంగంలో మానవ వనరుల పరంగా మనం నాణ్యతపైన, మన అవసరాలకు తగ్గట్లు నవీకరించిన శిక్షణా కార్యక్రమాల మీద దృష్టి సారిస్తే చాలు.

**(గణాంక పటం 2.7: ఎంపిక చేసిన దేశాల్లో వైద్య కళాశాలలు, గ్రాడ్యుయేట్లు)**

దేశ ఆరోగ్య అవసరాలను తీర్చటంలో ప్రయివేటు రంగం కీలక పాత్రను పోషిస్తోంది. చౌకతో ధరల పోటీలో మిన్నగా ఉండటం వల్ల భారత ప్రయివేటు ఆరోగ్య సంరక్షణ రంగానికి ప్రపంచస్థాయిలో ఆదరణ పెరుగుతోంది. భారత్‌లో అత్యాధునిక వైద్య, శస్త్ర చికిత్స వైద్యాల ఖర్చు అభివృద్ధి చెందిన దేశాలతో పోలిస్తే ఎంతో తక్కువ (పట్టిక 2.8). అదే సమయంలో మన సురక్షితత్వం, విజయాల శాతం ప్రపంచ అత్యుత్తమ స్థాయితో పోటీపడగలిగేలా ఉన్నాయి. దీనివల్ల మన దేశం వైద్య పర్యాటకానికి ఆకర్షణీయ కేంద్రంగా మారుతోంది. 2017లో దాదాపు 5,00,000 మంది వైద్య పర్యాటకులకి భారతదేశంలో వైద్యం చేశారు. అమెరికాతో పోలిస్తే 65-90 శాతం వ్యయం ఆ రోగులకు ఆదా అయింది.

**(పట్టిక 2.8: ఎంపిక చేసిన దేశాల్లో వైద్య ప్రక్రియలకయ్యే ఖర్చు, అమెరికన్ డాలర్లలో)**

ఆస్పత్రి సేవలతోపాటు, గత కొన్నేళ్లలో ప్రయివేటు డయాగ్నోస్టిక్ కేంద్రాల గొలుసులు విస్తరించటంతో మన దేశం రోగ నిర్ధారణల నాణ్యతను మెరుగుపరచటంలో గణనీయ ప్రగతిని సాధించింది. ఈ ప్రయివేటు ల్యాబొరేటరీలు.. అందుబాటులో ఉండే డయాగ్నోస్టిక్ సేవల స్థాయిని పెంచటంతోపాటు వాటి అందుబాటు, సామర్థ్యం, ఫలితాల్లో కచ్చితత్వం కూడా ఉండేలా చేశాయి.

భారత ఔషధ పరిశ్రమ వేగంగా అభివృద్ధి చెందుతూ ప్రపంచంలోనే అత్యున్నత శ్రేణిలోకి చేరింది. ప్రస్తుతం పరిశ్రమ విలువ 40 బిలియన్ అమెరికన్ డాలర్లని అంచనా (పట్టిక 2.9). 2030 నాటికి ఈ విలువ 120-130 బిలియన్ డాలర్లకు పెరుగుతుందని భావిస్తున్నారు. పరిశ్రమ సమర్థవంతంగా, అందుబాటు ధరల్లో ఉత్పత్తి చేస్తూ, ఔషధాల తయారీలో మనం చాలా మేర స్వావలంబన సాధించేందుకు దోహదం చేసింది. 2019-20లో మన ఔషధ దిగుమతులు ఈ రంగంలోని ఎగుమతుల్లో ఎనిమిదో వంతు ఉన్నాయి (పట్టిక 2.10).

దేశం దాదాపు 60,000 జనరిక్ ఉత్పత్తుల్ని 60 చికిత్సా విభాగాల్లో తయారు చేస్తోంది. ఇది ప్రపంచ జనరిక్ ఔషధాల ఎగుమతుల్లో పరిమాణంలో 20 శాతం. భారతీయ ఔషధాల్ని 200కి పైగా దేశాలకు ఎగుమతి చేస్తున్నారు. అమెరికా మనకు ప్రధాన మార్కెట్‌గా ఉంది. భారతీయ మందుల నాణ్యత ప్రపంచ స్థాయిలో ఉంటుండగా, ఉత్పత్తుల ధరలు మాత్రం ఓ.ఇ.సి.డి దేశాల ధరల కంటే అనేక రెట్లు తక్కువగా ఉంటున్నాయి. ప్రపంచ దేశాలకు టీకాల సరఫరా చేసే కీలక దేశంగా కూడా భారత్ గుర్తింపుని పొందింది. ప్రపంచంలో టీకాల డిమాండ్‌ను దాదాపు సగం మేర మన దేశమే పూరిస్తోంది. నిజానికి, ప్రపంచ ఆరోగ్య సంస్థకు డి.పి.టి, బి.సి.జి, తట్టు (మీజిల్స్) వ్యాక్సిన్ల అతి పెద్ద సరఫరాదారు భారత్. సముచిత ధరల్లోనే మన అవసరాలను తీర్చగల అంతర్గత పాటవం, నైపుణ్యాలు, సామర్థ్యం మన పరిశ్రమకు ఉన్నాయి. దీంతోపాటు, అత్యున్నత నైపుణ్యాలున్న ఆధునిక బయోటెక్నాలజిస్టులు, మైక్రోబయాలజిస్టులు, కెమిస్టులు, కెమికల్ బయోకెమికల్ ఇంజినీర్లు మన వద్ద పెద్దసంఖ్యలో ఉండటం వల్ల వ్యాక్సిన్ల అభివృద్ధి వ్యయం తక్కువగా ఉంది.

**(పట్టిక 2.9: భారత ఔషధ మార్కెట్,**

**పట్టిక 2.10: భారత ఔషధ పరిశ్రమలో దిగుమతులు, ఎగుమతులు)**

మానవ వనరుల అభివృద్ధి పరంగా ఎంతో దిగువన ఉన్న ఒక పేద దేశంలో ఇవన్నీ గణనీయమైన విజయాలు. ఓపక్క ఆరోగ్యకరమైన భవిష్యత్తుకి భరోసా ఇచ్చే సమర్థ వ్యూహాలను రూపొందించుకుని, అమలు చేసుకుంటూ.. మరోపక్క ఈ బలాలు, సామర్థ్యాల మీద మనం ఆరోగ్య వ్యవస్థను నిర్మించాలి. రాజ్యవ్యవస్థ పాత్రను, ముఖ్యంగా ఆరోగ్య రంగంలో పాత్రను ముందుగా స్పష్టంగా అర్థం చేసుకోవటం ఒక సుస్థిర ఆరోగ్య సంరక్షణ వ్యవస్థను నిర్మించుకోవటానికి ఎంతో అవసరం. సమర్థవంతమైన, అందుబాటులో ఉండే, ఆర్థిక భారం కాకుండే వ్యవస్థను విజయవంతంగా నిర్మించుకోవటానికి దేశం లోపల, బయట కూడా పాత అనుభవాల నుండి మనం నేర్చుకోవాలి.

# అధ్యాయం - 3

### ఆరోగ్యసంరక్షణలో ప్రభుత్వం పాత్ర

భారతదేశ ఆరోగ్య రంగం ప్రధానంగా ప్రయివేటు రంగం ప్రభావం ఎక్కువగా కలిగినది. 2014లో ఎన్.ఎస్.ఎస్.ఓ సర్వే వెల్లడించినట్లు, ప్రయివేటు రంగం 75 శాతం ప్రజల వైద్య అవసరాలను తీరుస్తోంది. ప్రభుత్వ ఆరోగ్య రంగానికి సరిగా నిధులు లేవు, దుర్బలమైనది. ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య వ్యవస్థను ఉపయోగించుకునేవారు కూడా లేకుండగా.. చిన్న అనారోగ్యాలకు కూడా ప్రజలు ఆస్పత్రులకే పరుగులు పెడుతుండటంతో ప్రభుత్వాస్పత్రులు కిక్కిరిసి పోతున్నాయి. ప్రభుత్వ రంగ మౌలిక వసతులు శిథిలావస్థలో ఉండగా, జీతభత్యాలు ఎంతో తక్కువగా ఉన్నాయి. దీనివల్ల నైపుణ్యమున్నవారిలో ఎక్కువమంది ప్రయివేటు ఉద్యోగావకాశాల వైపు మొగ్గు చూపుతున్నారు. సేవల నాణ్యత సక్రమంగా లేకపోవటంతో ప్రభుత్వ వైద్య వ్యవస్థ ప్రజల విశ్వాసాన్ని కోల్పోయింది. విశ్వసించదగిన ప్రభుత్వ ఆరోగ్య వ్యవస్థ లేకపోవటంతో, 2వ అధ్యాయంలో చూసినట్లు, అవకాశాన్ని ప్రయివేటు రంగం అందిపుచ్చుకుని వేగంగా ఎదిగింది. భారతదేశం ప్రపంచంలోనే అతి ఎక్కువ విదేశీ ప్రత్యక్ష పెట్టుబడిని ఆరోగ్య రంగంలో అందుకుంటున్న దేశం. అయితే, ఈ డబ్బులో ఎక్కువ భాగం ఖర్చుకు తగ్గ ఫలితాలు ఉండని తృతీయ స్థాయి మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రుల్లోకే ప్రవహిస్తోంది.

ఓ.ఓ.పి.ఇని తగ్గించటానికి, ఆరోగ్య సేవల్ని పేదలకు మరింతగా అందుబాటులోకి తేవటానికి భారతదేశంలో ప్రభుత్వాలు ఉన్నకొద్దీ ఆయుష్మాన్ భారత్, ఆరోగ్యశ్రీ వంటి సామాజిక బీమా పథకాలపైనే ఆధారపడుతున్నాయి. సామాజిక బీమా, ఉమ్మడి నష్ట ప్రమాదాల భర్తీ (రిస్క్ పూలింగ్) వల్ల పేదలపై భారం కొంత తగ్గొచ్చుగానీ, అంతిమంగా అవి భారాన్ని ఖజానాపైకే మళ్లిస్తాయి. దీర్ఘకాలంలో ఆర్థికంగా ఆచరణసాధ్యం కాని పరిస్థితి తలెత్తుతుంది. ప్రజల ఆరోగ్యాన్ని పెద్దగా మెరుగుపరచకుండా, ఈ విధానం ప్రభుత్వ ఖజానాలోని ప్రజాధనాన్ని ఖాళీ చేస్తుందనటంలో సందేహం లేదు. ప్రయివేటు రంగం కనుసన్నల్లోని ఆరోగ్య సంరక్షణ నమూనాల్లో ఖర్చులు.. ఫలితాలతో పొంతన లేకుండా ఉన్నకొద్దీ పెరిగిపోతుంటాయి. ఓ ఆధునిక, మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి అంటే, భారీ ఎత్తున వనరులు, నైపుణ్యాలు, అధునాతన సాంకేతికతలతో కూడినది. కొత్త సాంకేతికతల్ని కనిపెడుతున్నకొద్దీ, ఖర్చు అడ్డూఆపూ లేకుండా అనివార్యంగా పెరుగుతుంటుంది, అదే సమయంలో అదనపు వ్యయం వల్ల ఒనగూరే ఉపాంత విలువ చాలా తక్కువగా ఉంటుంది. నాణ్యమైన భవనాలు, హంగులు, ఖరీదైన పరికరాలు, ఎంతో నిపుణత కలిగిన సిబ్బందికి అయ్యే వ్యయం భరించలేని స్థాయిలో పెరుగుతూంటుంది. పెట్టుబడికి కనీస లాభం రావాలంటే ప్రయివేటు రంగం ఎక్కువ ఫీజుల్ని వసూలు చేయక తప్పని పరిస్థితి ఏర్పడుతుంది.

మార్కెట్ వైఫల్యాలకు అద్దం పట్టే అసమర్థమైన ప్రయివేటు ఆరోగ్య సంరక్షణ మార్కెట్‌కు అమెరికా ఆరోగ్య వ్యవస్థ పెద్ద ఉదాహరణ. ప్రపంచంలోనే అత్యధికంగా, బ్రిటన్ కంటే రెట్టింపుగా, జి.డి.పిలో 18 శాతాన్ని ఆరోగ్య రంగంపై వెచ్చిస్తూకూడా అమెరికా ఆరోగ్య వ్యవస్థ అందుకు తగ్గ ఫలితాల్ని సాధించటంలో విఫలమైంది (అధ్యాయం 1లో పట్టిక 1.2, పట్టిక 1.3). అమెరికా మొత్తం ఆరోగ్య వ్యయంలో సగం దాకా పౌరులు ఇన్సూరెన్స్ పద్ధతుల ద్వారా ప్రయివేటుగా చెల్లిస్తున్నదే. మొత్తంగా ఇంత విపరీత వ్యయం చేస్తున్నా కూడా, అమెరికాలోని ఆరోగ్య సూచికలు అనేక ఇతర అభివృద్ధి చెందిన దేశాల కంటే వెనుకన ఉన్నాయి. సమగ్ర ఆరోగ్యాన్ని పరిగణలోకి తీసుకుని 169 దేశాలకు ర్యాంకులనిచ్చే బ్లూమ్‌బర్గ్ అత్యంత ఆరోగ్యకర దేశం సూచిక.. అమెరికాకు 35వ స్థానాన్ని ఇచ్చింది. ఓ.ఇ.సి.డి దేశాలన్నిటి కంటే దాదాపు దిగువన అమెరికా ఉంది! జి.డి.పిలో 9 శాతాన్ని ఆరోగ్యం కోసం వెచ్చించే స్పెయిన్ ఈ జాబితాలో అగ్రస్థానాన ఉంది. ఆ తర్వాత ఇటలీ, ఐస్‌లాండ్, జపాన్, స్విట్జర్లాండ్ ఉన్నాయి (పట్టిక 3.1). పౌరుల ఆరోగ్య అవసరాల్లో ఎక్కువ శాతాన్ని ప్రభుత్వమే అందించే బ్రిటన్‌కు 19వ స్థానం లభించింది.

**(పట్టిక 3.1: ఎంపిక చేసిన దేశాల మధ్య బ్లూమ్‌బర్గ్ అత్యంత ఆరోగ్యకర దేశం ర్యాంకింగులు, 2019)**

ఆరోగ్య రంగంలో మార్కెట్ వైఫల్యాలు ఎందుకున్నాయో అర్థం చేసుకోవటానికి స్వేచ్ఛామార్కెట్ల ఆర్థిక సూత్రాల్ని అర్థం చేసుకోవటం ముఖ్యం.

### 3.1 ఆరోగ్య సంరక్షణలో మార్కెట్ వైఫల్యాలు

సరైన పరిస్థితులున్నప్పుడు, స్వేచ్ఛా మార్కెట్లు సరఫరా, డిమాండ్ శక్తులను అనుసరించి వనరులను సమర్థవంతంగా కేటాయించటాన్ని ప్రోత్సహిస్తాయి. ఆర్థికవేత్త జెఫ్రీ హ్యామర్ మాటల్లో చెప్పాలంటే, ఒక ఆదర్శప్రాయ మార్కెట్‌లో

కొనుగోలుదారుడి (ప్రయివేటు) ప్రయోజనం సమాజ (సామాజిక) ప్రయోజనం ఒకటే అవుతాయి. ఒడిదుడుకులు లేని సాధారణ పరిస్థితుల్లో అవి రెండూ ఆ ఉత్పత్తిని తయారుచేయటంలో సమాజ వ్యయం సమానంగా ఉంటూ, వనరులు అత్యంత సమర్థవంతంగా వినియోగించేలా చేస్తాయి. అయితే ఆరోగ్య రంగ మార్కెట్లు ఆదర్శానికి ఆమడ దూరంలో ఉంటాయి. ఆరోగ్య సేవలందించే వారి మధ్య, ప్రజావసర వస్తువులు, బాహ్య అంశాల మధ్య లోపభూయిష్ట పోటీ, సమాచార స్థాయిల్లో తేడా మార్కెట్ సమతుల్యతను అస్థిరపరిచి 'మార్కెట్ వైఫల్యాల'కు దారితీస్తాయి. ఫలితంగా సామాజిక సంక్షేమం దెబ్బతింటుంది. దీన్నుంచి, మార్కెట్ వైఫల్యాలు ఆరోగ్య సంరక్షణ మార్కెట్లలో ఉత్పత్తి, వినియోగంలో సామర్థ్యాన్ని ఒడిదుడుకులకు గురిచేసి వనరులు వృధాకు, మొత్తంగా ఆరోగ్య రంగంలో ఎటువంటి మెరుగుదలా లేకుండా ఖర్చుల్ని పెంచేస్తాయి. ఈ పర్యవసానాల్ని తరచూ పేదలే భరించాల్సి వస్తుంది.

**ఈ దిగువ నాలుగు కారణాల వల్ల మార్కెట్ వైకల్యాలు ఆరోగ్య సేవలను అందించటంలో ప్రభుత్వ పాత్రను తప్పనిసరి చేస్తున్నాయి:**

**1. భారత్‌లో సాంక్రమిక వ్యాధుల భారం ఎక్కువ**

అధ్యాయం 1లో 1.4 పట్టికలో, 1.9 నుండి 1.12 గణాంక పటాల్లో చర్చించినట్లు, సాంక్రమిక వ్యాధుల భారం ఇప్పటికీ భారత్‌లో గణనీయంగా ఎక్కువ స్థాయిలోనే ఉంది. సాంక్రమిక వ్యాధులు బాహ్యాంశాలతో ముడిపడి ఉంటాయి. బాహ్యతలు ఒక వ్యక్తి నుంచి మరో వ్యక్తికి మళ్లే ప్రయోజనాలు లేదా వ్యయాలు. ఉత్పత్తిలో ఏ మేరకు కొనాలి లేదా అమ్మాలి అనేవి ఇక్కడ ఉత్పత్తి దారుడు లేదా కొనుగోలుదారుడు యోచించేవి, నిర్ణయించేవి కావు. అంటువ్యాధిలో ఒక వ్యక్తికి చికిత్స చేయటం వల్ల మరో వ్యక్తికి సోకకుండా నివారణ జరుగుతుంది. అయితే, చికిత్స తీసుకోవాలని ఒక వ్యక్తి తీసుకునే నిర్ణయంలో ఇతరులకు వ్యాప్తి చెందటమనే నష్ట ప్రమాదాన్ని పరిగణలోకి తీసుకోవటం ఉండదు. ఈ బాహ్యాంశాన్ని విస్మరిస్తే, వ్యాధి చికిత్సకు ప్రయివేటు మార్కెట్‌లో చాలా ఎక్కువ ఖర్చవుతుంది.. అందించే చికిత్స మాత్రం స్వల్ప స్థాయిలో ఉంటుంది. వ్యక్తులు తమంతట తాము లేదా పూర్తి కోర్సు చికిత్సను తీసుకున్నా కూడా వ్యాధిని సకాలంలో నయం చేయలేకపోవచ్చు. దానివల్ల, వ్యాధి వ్యాప్తిని అరికట్టలేకపోవటం, యాంటీబయాటిక్ నిరోధకత పెరగటం జరుగుతుంది. రెండు ఫలితాలూ ప్రజారోగ్యానికి ప్రమాదకరమైనవే.

అంటువ్యాధుల్ని నియంత్రించటం ప్రజల ఉమ్మడి అవసరం. ప్రజల ఉమ్మడి అవసరాలు అంటే వాటి కోసం డబ్బు చెల్లించని వ్యక్తులు వాటిని వినియోగించకుండా నిరాకరించలేనివి, ఇతర వినియోగదారులకు వాటి అందుబాటును తగ్గించకుండా ఒక వ్యక్తి వినియోగించగలిగినవి. అటువంటి వస్తువుల సామాజిక విలువ (మొత్తం విలువ) ప్రయివేటు ఉత్పత్తి విలువను అధిగమిస్తాయి. వాటిని అమ్మరు కాబట్టి వాటి ప్రయివేటు ఉత్పత్తి విలువ సున్నాగా ఉంటుంది. సాంక్రమిక వ్యాధులకు కారణమయ్యే దోమలు వంటి వాహకాల నిర్మూలన లేదా నియంత్రణ, ఆరోగ్య సమాచార శిబిరాలు, టీకాల కార్యక్రమాలు ప్రజల ఉమ్మడి అవసరాలుగా ఉండే ఆరోగ్య సేవలకు కొన్ని ఉదాహరణలు. ఒక అంటువ్యాధికి టీకా తీసుకున్న బిడ్డ మిగతా పిల్లలను కూడా వ్యాధి సోకకుండా కాపాడుతుంది.

ఒక దేశంలో మొదలైన కొవిడ్ ఇన్ఫెక్షన్ ప్రపంచంలో శరవేగంగా వ్యాపించి ప్రజారోగ్యంపైనే కాకుండా అనేక ఇతర రంగాలపై గొలుసుకట్టు ప్రభావాన్ని ప్రదర్శించి అంతిమంగా అన్ని దేశాల ఆర్థిక వ్యవస్థల్నీ ప్రభావితం చేసింది. ప్రపంచీకరణ అనూహ్యంగా విస్తరించి ఉన్న ప్రపంచంలో అంటువ్యాధుల్ని నియంత్రించటం నిజానికి ప్రపంచ ప్రజానీకపు ఉమ్మడి అవసరం అని మహమ్మారి తేటతెల్లం చేసింది. కొవిడ్ నిరోధానికి టీకాలివ్వటంలో ఏ దేశాన్నీ మినహాయించలేం. ఆ ప్రయోజనాలు పొందకుండా ఏ దేశాన్నీ నిలువరించలేం. వినియోగంలో ఎవరితోనూ ఎవరికీ పోటీ ఉండదు. ఒక దేశం ప్రయోజనాల్ని పొందటం మరో దేశ ప్రయోజనాల్ని తగ్గించదు. టీకాల అభివృద్ధి ఎంతో వ్యయంతో కూడిన వ్యవహారం. విజయవంతమవుతుందన్న గ్యారంటీ కూడా ఉండదు. పెట్టుబడికి తగ్గ ప్రతిఫలానికి భరోసా లేకపోతే.. ప్రయివేటు రంగం పెద్ద మొత్తాల్ని పెట్టుబడి పెట్టే నష్ట ప్రమాదానికి సిద్ధపడదు. అందుకే ప్రపంచవ్యాప్తంగా ప్రభుత్వాలు వ్యాక్సిన్ అభివృద్ధి, ఉత్పత్తిని వేగవంతం చేసేందుకు, వ్యాక్సిన్ అభివృద్ధిదారుల నష్ట ప్రమాదావకాశాల్ని తగ్గించటానికి.. కొవిడ్ టీకా పరిశోధన, అభివృద్ధి (ఆర్ & డి), కొనుగోళ్లపై పెద్ద మొత్తాల్ని వెచ్చించాయి. విపరీత డిమాండ్ ఉన్న నేపథ్యంలో, ప్రభుత్వ జోక్యం లేకుంటే వ్యాక్సిన్‌ల ధర చాలా ఎక్కువగా ఉండేది. నిజానికి, టీకాలను నేరుగా మార్కెట్లలోకి విడుదల చేసి ఉంటే, వాటిని సంపన్నులే మొదట పొందగలిగేవారు. కొవిడ్ సోకే ప్రమాదం ఎంతో ఎక్కువగా ఉన్నవారు, వృద్ధులు, పేదలకు అవి మొదట అందేవి కావు.

అన్నికంటే ముఖ్యంగా, సాంక్రమిక వ్యాధుల భారం అసమానతల కారణంగా పేదల్లో ఎక్కువ. సాంక్రమిక వ్యాధుల వల్ల కోల్పోయిన డి.ఎ.ఎల్.వైలు ప్రతి 1,00,000 జనాభాకి ఉప-సహారా ఆఫ్రికా, దక్షిణాసియాలోనే ఎక్కువని గణాంక పటం 3.1ను చూస్తే అర్థమవుతుంది. ప్రపంచంలోనే నిరుపేదల సంఖ్య, వాటా అతి ఎక్కువగా ఉన్న మొదటి రెండు ప్రాంతాలు ఉప-సహారా ఆఫ్రికా, దక్షిణాసియా. ప్రపంచ నిరుపేదల్లో వరుసగా 50.7 శాతం, 33.4 శాతం ఈ రెండు ప్రాంతాల్లోనే ఉంటున్నారు. అదేవిధంగా, భారతదేశంలో కూడా అంటువ్యాధుల భారం పేదల్లోనే ఎక్కువ. ఈ వ్యాధుల్ని ప్రాథమిక ఆరోగ్య సేవల స్థాయిలోనే సమర్థవంతంగా నియంత్రించవచ్చు. వ్యాధి నివారణ, తొలి దశలోనే గుర్తించటం, చికిత్స అందించటంలో ప్రయివేటు రంగానికి లాభాలు కనిపించవు. అంటువ్యాధి నియంత్రణలో ప్రభుత్వ జోక్యం లేకుంటే, పేదలు పెద్ద మూల్యం చెల్లిస్తారు.

**(గణాంక పటం 3.1: ప్రతి లక్ష జనాభాకి సి.ఎం.ఎన్.ఎన్.డిల వల్ల కోల్పోతున్న డి.ఎ.ఎల్.వైలు, 2019 జనాభా)**

(ఇంకా ఉంది...)

FDR FOUNDATION FOR DEMOCRATIC REFORMS


# Towards Viable Universal Healthcare


The COVID-19 pandemic has caused enormous suffering and tested the capacity of our healthcare system and economy like never before.

The vicious second wave of the pandemic brought to the fore shortcomings in our healthcare system. But the **real challenges** run deeper.

Let us explore.

## **Non-communicable disease** (NCD) burden in India is on the rise!








Government expenditure on healthcare is only about

**1.2%**


of GDP!

**75%** of Current Health Expenditure comes from private sources!




About **6 crore**
people descend into poverty every year due to out-of-pocket expenditure on healthcare!

## How OFTEN do we visit doctors?




2 consultations per capita includes both formal and informal providers.


Given the prevalence of informal providers in India, formal consultation rate would be **far lower!**

Only **25%**
of all consultations lie in the public sector, the rest being towards private healthcare providers.

**Source**

- Institute for Health Metrics and Evaluation
- National Health Accounts 2016-17
- Ministry of Health, Government of India
- Organisation for Economic Co-operation and Development
- Nastional Samle Survey Organisation

RNI. Regd No. 69976/98 Postal Reg. No. HD-913/2021-2023 Published on 10th November, 2021 Posting Date 15 &16th of every month




*If undelivered please return to:*

*LOKSATTA UDYAMA SAMSTHA,*
*Tulips Apartments, 6-3-655,*
*Flat.No. 407,*
*Behind civil supplies office,*
*Somajiguda,*
*Hyderabad - 500 082*

**Edited, Printed and Published by Dr. Jayaprakash Narayan, National Coordinator, Loksatta for and behalf of Foundation for Democratic Reforms, Tulips Apartments, 6-3-655, Flat.No. 407, Behind civil supplies office, Somajiguda, Hyderabad - 500 082. Printed at Kala Jyothi Process Pvt Ltd, 1-1-60/5, RTC "X" Roads, Hyderabad 500 020**